www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


బుధవారం | 26-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 260 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.12:02 తదుపరి సప్తమి, నక్షత్రం: శ్రవణం రా.1:33 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.5:42 మొదలు, దుర్ముహూర్తం:ఉ.11:40-మ.12:24, అమృతఘడియలు: మ.2:27-4:10, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:30, సూర్యాస్తమయం: 5:34 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సూపర్ ఫుడ్
ఉక్కును మించిన చెక్క



అల్యూమినియం కన్నా తేలిక
అమెరికా శాస్త్రజ్ఞుల ఆవిష్కరణ
సాధారణ చెక్కలోనే రసాయన మార్పులతో అభివృద్ధి
నిర్మాణ, రక్షణ, వాహన తయారీ రంగాల్లో వినియోగం
14



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన ఉపసంఘం సభ్యులు అనగాని, బీసీ జనార్దన్ రెడ్డి, అనిత, నారాయణ, నిమ్మల, అధికారులు

ఏపీ @ 29 జిల్లాలు



కొత్తగా పోలవరం, మార్కాపురం, మదనపల్లె





రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా
మార్కాపురం, మదనపల్లెతో కలిపి 3 కొత్త జిల్లాలు

- మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు
- మండపేట నియోజకవర్గం తూర్పులోకి
- అద్దంకి, కందుకూరు.. ప్రకాశంలో విలీనం
- ఇక 'వాసవీ పెనుగొండ మండలం'
- ఆదోని మండలం పునర్వ్యవస్థీకరణ
- కొత్తగా పెద్ద హరివాణం ఏర్పాటు
- కొన్ని మండలాలు వేర్వేరు డివిజన్లలోకి
- ముఖ్యమంత్రితో ఉప సంఘం భేటీ
- సవరించిన నివేదికకు చంద్రబాబు ఓకే
- ఫైలుకు నేడు ఆన్‌లైన్‌లో మంత్రుల ఆమోదం
- ఆ వెంటనే ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు
- అభ్యంతరాలకు నెల రోజులు గడువు

5 కొత్త రెవెన్యూ డివిజన్లు

నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిరతోపాటు బనగానపల్లె కూడా

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు కొత్త జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. పోలవరం ముంపు మండలాల వాసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు.. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను కొత్తగా ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సిఫారసు చేసింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని ఈ సబ్‌కమిటీ కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణను కొలిక్కితెచ్చింది. మంగళవారం సీఎంను కలిసి, సవరించిన అధ్యయన నివేదికను సమర్పించింది. అందులో మూడు కొత్త జిల్లాలు.. మార్కాపురం, మదనపల్లె, పోలవరంతో పాటు ఐదు రెవెన్యూ డివిజన్లు..(నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిర, బనగానపల్లె),

మిగతా 13వ పేజీలో...

9 జిల్లాల్లో మార్పుల్లేవ్!

పార్టీయే సుప్రీం!


- మంత్రులు, ఎమ్మెల్యేల్లో నిర్లక్ష్యం వద్దు
- గ్రీవెన్స్ నిర్వహించని 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు నోటీసులు
- పార్టీ కోసం కష్టపడిన వారందరికీ న్యాయం
- ఆ బాధ్యత నేనే తీసుకుంటా
- 1 నుంచి పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు
- 10 రోజుల్లో పార్టీ కమిటీల నియామకం
- జోనల్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో లోకేశ్



అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) పార్టీ కన్నా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ కాదని టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తమ తమ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు, ప్రజలతో గ్రీవెన్స్ నిర్వహించని ఇద్దరు మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలపై సీరియస్ అయ్యారు. వారందరికీ తక్షణం నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా

మిగతా 14వ పేజీలో...

మానుతున్న శతాబ్దాల గాయాలు



అయోధ్య ఆలయ శిఖరంపై ధ్వజారోహణంలో ప్రధాని మోదీ, భాగవత్, యోగి, ఆనందీబెన్

నేడు ప్రపంచమంతా రామభక్తిలో మునిగింది

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఆత్మన్యూనత పోలేదు
- మన జాతీయ చిహ్నాల రూపకల్పనలోనూ దాని ప్రభావం
- వచ్చే పదేళ్లలో ఆ భావజాలం నుంచి బయటపడదాం
- అయోధ్యలో మోదీ.. రామ మందిరంపై ధ్వజారోహణం
- కరసేవకుల ఆత్మలు నేడు శాంతించాయి: భాగవత్

2

ఉద్యాన హబ్‌గా సీమ

- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ప్రోత్సాహకాలు 13
- డిమాండ్ ఉన్న పంటలు పండించే రైతులకు మరిన్ని సౌకర్యాలు
- 5.98 లక్షల మంది రైతులకు లబ్ధి.. ఉద్యాన శాఖపై సీఎం సమీక్ష

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు తప్పనిసరి

విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు: సీఎం

3

నిరక్షరాస్యుల కోసం 'అక్షరాంధ్ర'

ఏటా 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లక్ష్యం

14



గ్రామ సచివాలయ వ్యవస్థపై

అధ్యయనం

- మార్చి నాటికి నివేదిక.. తర్వాత చర్యలు 13
- మంత్రుల బృందంతో డిప్యూటీ సీఎం పవన్ చర్చ
- పదోన్నతులపైనా సమీక్ష



మీకు ఆ అధికారమే లేదు

నీటి కేటాయింపులను తిరగదోడేందుకు వీల్లేదు!

- కృష్ణా ట్రైబ్యునల్-2కు ఆంధ్రప్రదేశ్ స్పష్టీకరణ.. ఆధారాల్లేని తెలంగాణ వాదనలకు విలువ లేదు
- ఏ ప్రాజెక్టు నీటి కేటాయింపునూ మార్చకూడదు.. తొలి నుంచీ వాదనలు వింటామంటే కుదరదు
- విభజన చట్టం సెక్షన్ 89లో పేర్కొన్న కేటాయింపులను మార్చేందుకు వీల్లేదు
- తెలంగాణ కొత్తగా పుట్టిన బిడ్డ కాదు.. వందేళ్ల నుంచే ప్రాజెక్టులకు కేటాయింపులున్నాయి
- ఉమ్మడి రాష్ట్రంలో నిర్ణయాలకు తెలంగాణ బాధ్యత వహించాల్సిందే
- కావేరి వివాదంతో కృష్ణా వివాదానికి పొంతన లేదు.. బలమైన వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా.. నేడు, రేపూ కొనసాగనున్న విచారణ

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై ఆధారాల్లేకుండా తెలంగాణ చేస్తున్న వాదనలకు విలువ లేదని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులను మార్చే అధికారం కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్-2కు లేదని తేల్చిచెప్పింది. తెలంగాణ ప్రాజెక్టులకు అదనంగా ఎందుకు నీటిని కేటాయించాలో ఆ రాష్ట్రం చెప్పడం లేదని.. అదే విధంగా ఏ ప్రతిపాదన మేరకు.. ఏ తీర్పుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ నీటి వాటాలో కోత పెట్టాలో స్పష్టం చేయలేకపోతోందని తెలిపింది. ఇలాంటి వాదనలకు విలువ ఉంటుందా అని ప్రశ్నిస్తూ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ సారథ్యంలోని కృష్ణా ట్రైబ్యునల్-2 ముందు బలమైన వాదనలు

మిగతా 14వ పేజీలో...



ఆ సైన్యాధికారి తొలగింపు సబబే!

- పూజలో పాల్గొనేందుకు నిరాకరించిన క్రైస్తవ సైన్యాధికారి డిస్మిస్‌పై సుప్రీంకోర్టు 2
- తోటి సైనికుల మనోభావాలను గౌరవించడంలో విఫలమయ్యారు
- మన సైన్యం సెక్యులరిజానికి ప్రతీక
- విచారణ సందర్భంగా ధర్మాసనం

నేవీ గూఢచర్యం కేసులో

ఇద్దరికి జైలు శిక్ష

12

కీలక తీర్పు చెప్పిన ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు

నైలు నదిలో మొసళ్లెన్ని?

- నిన్న కురిసిన వానలో ఎన్ని చినుకులు?
- ఇలాంటి ప్రశ్నలకు ఏం చెబుతాం...
- పరకామణి చోరీ కేసులోనూ ఇదే చెప్పా
- సీఐడీ విచారణ తర్వాత భూమన వ్యంగ్యం
- అరగంటలో ముగిసిన విచారణ
- రాజీ గురించి తెలియదని వెల్లడి



న్యాయవాదితో కలిసి విచారణకు వస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సీఐడీ ముందు విచారణకు హాజరయ్యారు. అరగంటలో ముగిసిన విచారణ అనంతరం బయటికి వచ్చారు. లోపల ఏం సమాధానాలు చెప్పారో తెలియదుగానీ... విచారణకు ముందు, బయటికి వచ్చాక మాత్రం మీడియా ముందు తనలోని వ్యంగ్యమంతా ప్రదర్శించారు. "ఒత్తిడి భరించలేని నిబద్ధత కలిగిన పోలీసు అధికారులు నన్ను పిలిచారు. అయినను... పోయిరావలె హస్తినకు" అంటూ లోపలికి వెళ్లారు. తిరిగి బయటికి వచ్చాక మళ్లీ మీడియాతో మాట్లాడుతూ... "పసిఫిక్ మహా సముద్రంలో ఎన్ని నీళ్లు ఉన్నాయి? నైలు నదిలో మొసళ్ల సంఖ్య ఎంత? 1500 ఏళ్లుగా వెంకన్నకు

మిగతా 14వ పేజీలో...

కుటుంబ సభ్యులే కాలయములు

» గతేడాది ప్రపంచవ్యాప్తంగా కుటుంబ సభ్యుల చేతిలో 50వేల మందికి పైగా మహిళల మృతి

» సగటున ప్రతీ 10 నిమిషాలకొక హత్య

న్యూఢిల్లీ, నవంబరు 25: ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 137 మంది(ప్రతీ 10నిమిషాలకు ఒకరు) మహిళలు తమ జీవిత భాగస్వాములు, కుటుంబసభ్యుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. గతేడాది 50వేల మందికి పైగా మహిళలను వారి కుటుంబసభ్యులే చంపేశారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ఒకటి ఈ దారుణ విషయాన్ని వెల్లడించింది. 117దేశాల్లో హత్యా ఘటనలను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ఆ దేశం.. ఈ దేశం.. అని తేడా లేకుండా ప్రపంచంలో ప్రతీ చోటా మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. ఆఫ్రికా ఖండంలో ఈ తరహా హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, గతేడాది ఒక్క ఆఫ్రికాలోనే దాదాపు 22వేల మంది మహిళలు తమ కుటుంబసభ్యుల చేతుల్లో హత్యకు గురయ్యారని వివరించింది. ఇక, ఈ నివేదిక ప్రకారం.. మహిళల మొత్తం హత్యల్లో కుటుంబసభ్యుల చేతుల్లో చనిపోతున్న ఘటనలు 60% ఉన్నాయి. అదే సమయంలో కుటుంబసభ్యుల చేతుల్లో చనిపోతున్న పురుషుల సంఖ్య 11శాతంగా ఉంది.

మైనారిటీ విద్యాసంస్థల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా

» రాష్ట్రాలకు కేంద్ర అధికారుల సూచన

న్యూఢిల్లీ, నవంబరు 25 : మైనారిటీ విద్యా సంస్థల్లో ఏమైనా అనుమానాస్పద కార్యకలాపాలు సాగుతున్నాయా, ఆర్థిక అవకతవకలు ఉన్నాయా.. అని గుర్తించే బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించారు. హరియాణాలోని అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులకు ఉగ్ర ముఠాతో సంబంధాలు ఉన్నాయని తేలడం, ఢిల్లీ పేలుడు ఘటనతో వారికి సంబంధం ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈమేరకు రాష్ట్రాలకు తెలియజేశారు. ఈ నిర్ణయం మేరకు.. రాష్ట్రాలు మైనారిటీ విద్యాసంస్థల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు కేంద్ర సంస్థలకు ఆ సమాచారం అందజేయాలి. అలాగే ఆయా సంస్థల్లో పనిచేస్తున్నవారిలో ఎవరికైనా అనుమానాస్పద గతం ఉండడం, అటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నా తెలియజేయాలి.

అరుణాచల్ మాదే..భారత మహిళను వేధించలేదు

» చైనా పునరుద్ఘాటన.. ఖండించిన భారత్

బీజింగ్/న్యూఢిల్లీ, నవంబరు 25: భారతీయ మహిళను షాంఘై విమానాశ్రయంలో తాము నిర్బంధించడం గానీ, వేధించడం గానీ చేయలేదని చైనా తెలిపింది. భారత వీసా చెల్లదంటూ హాస్యాస్పద కారణాలతో అరుణాచల్ ప్రదేశ్ మహిళను చైనా అధికారులు నిర్బంధించడంపై భారత్ మంగళవారం తీవ్ర నిరసన తెలియజేసింది. అరుణాచల్ తమ భూభాగమని తేల్చిచెప్పడంతో చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. అరుణాచల్ తమ భూభాగమని.. దాని పేరు జాంగ్నాన్ అని, భారత్ చట్టవిరుద్ధంగా పెట్టుకున్న 'అరుణాచల్ ప్రదేశ్'ను తామెప్పుడూ గుర్తించలేదని స్పష్టంచేశారు. యూకేలో ఉంటున్న అరుణాచల్ మహిళ పేమా వాంగ్‌జోమ్ థాంగ్‌డాక్‌ను ఈ నెల 21న షాంఘై ఎయిర్‌పోర్టులో చైనా అధికారులు 18 గంటలు అదుపులోకి తీసుకున్నారు. అరుణాచల్ తమ భూభాగమంటూ ఆమె పాస్‌పోర్టుపై అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ నిరసన తెలిపింది.

అమెరికా కలలకు మరో దారి ఈబీ-1ఏ వీసా

న్యూఢిల్లీ, నవంబరు 25: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వలస విధానాలతో పాటు హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచేయడంతో అగ్రరాజ్యానికి వెళ్లేందుకు భారతీయులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. హెచ్-1బీ వీసాలపై ఆంక్షల నేపథ్యంలో ఎక్కువ మంది ఈబీ-1ఏ వీసా వైపు మొగ్గుచూపుతున్నారని నిపుణులు చెబుతున్నారు. యూఎస్ ఇమిగ్రేషన్ సేవల సంస్థ బౌండ్‌లెస్ ఇమిగ్రేషన్ గణాంకాల ప్రకారం... 2025 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఈబీ-1ఏ వీసా కోసం 7,338 దరఖాస్తులు అందాయి. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఇది 56శాతం ఎక్కువ. వీరిలో అత్యధికులు భారతీయ దరఖాస్తుదారులేనని అంచనా వేస్తున్నారు. సైన్స్, కళలు, విద్య, వ్యాపారం తదితర రంగాల్లో అసాధారణ సామర్థ్యాలను ప్రదర్శించినవారు ఈబీ-1ఏ వీసాలకు అర్హులు. వీరు శాశ్వతంగా అమెరికాలో నివసించవచ్చు.. అయితే నిర్దేశించిన పది ప్రమాణాల్లో కనీసం మూడైనా కలిగి ఉండాలి.

చైనా అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన ముగ్గురు వ్యోమగాములు


బీజింగ్, నవంబరు 25: చైనా అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లో ముగ్గురు వ్యోమగాములు చిక్కుబడిపోయారు. వీరిని అక్కడి నుంచి తిరిగి తీసుకురావడానికి ఎమర్జెన్సీ అంతరిక్ష నౌకను చైనా మంగళవారం పంపింది. షెన్‌జో అంతరిక్ష నౌక ద్వారా ఈనెల మొదట్లో చైనా అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాముల బృందం భూమికి రావాల్సి ఉంది. అయితే వారు వెళ్లిన షెన్‌జో 20 నౌక అద్దానికి అంతరిక్షంలో మిగిలిపోయిన ఉపగ్రహ శకలాలు తగిలాయి. దాని వల్ల ఆ అద్దం పాడై తిరుగు ప్రయాణానికి వీలులేకుండా పోయింది. తర్వాత తమ స్థానాన్ని భర్తీ చేయడానికి షెన్‌జో 21 అంతరిక్ష నౌకలో వచ్చిన ముగ్గురు వ్యోమగాముల బృందాన్ని అంతరిక్ష కేంద్రంలోనే వదిలి షెన్‌జో 20 మిషన్ బృందం భూమికి చేరింది. పాడైపోయిన తమ నౌకను అంతరిక్షంలోనే వదిలివేసి షెన్‌జో 21 నౌకలో వారు తిరిగి వచ్చారు. అయితే అక్కడ చిక్కుకుపోయిన షెన్‌జో 21 బృందాన్ని తిరిగి భూమికి తీసుకురావడం కోసం షెన్‌జో 22 అంతరిక్ష నౌకను ఖాళీగా చైనా పంపింది.

8వ ఖండం 'జీలాండియా' జాడ దొరికింది

న్యూఢిల్లీ, నవంబరు 25: మనకు ఖండాలు ఏడు అన్న విషయం తెలుసు. కానీ ఎనిమిదో ఖండం 'జీలాండియా' జాడ ఇప్పుడు దొరికింది. ఉపగ్రహాల గ్రావిటీ మ్యాపింగ్, సముద్రలోతుల్ని లెక్కించే బాతిమెట్రీ విధానంతో శాస్త్రవేత్తలు దీనిని కనుగొన్నారు. అది భారతదేశం కంటే పెద్ద భూభాగం. పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు తూర్పు వైపున 94% మునిగిపోయి ఉంది. ఇది 49 లక్షల చదరపు కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. మన మ్యాపుల్లో కనిపించకుండా పోయిన ఈ ఖండానికి సంబంధించి 2017లో భూగర్భ శాస్త్రవేత్తలకు కొన్ని ఆధారాలు లభించాయి. ఇతర ఖండాల్లో 30-45 కిలోమీటర్ల మందంతో ఉండే క్రస్ట్.. జీలాండియాకు 20 కి.మీ మాత్రమే ఉండటం వల్ల ఇది మునిగిపోయి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

పిప్పళ్లతో పెద్దపేగు క్యాన్సర్ అంతం!

» ఎన్ఐటీ రూర్కెల పరిశోధకుల అధ్యయనం



న్యూఢిల్లీ, నవంబరు 25: పిప్పళ్లు లేదా తోక మిరియాలు.. దేశంలోని చాలామంది వంటిళ్లలో కనిపించే ఓ మసాలా దినుసు. ఈ పిప్పళ్లకు ప్రాణాంతకమైన పెద్ద పేగు క్యాన్సర్(కొలన్ క్యాన్సర్)ను అంతం చేసే శక్తి ఉందని పరిశోధకులు గుర్తించారు. పిప్పళ్లలో సహజసిద్ధంగా ఉండే పిప్లార్టైన్(పైపర్‌లాంగమీన్) అనే పదార్థం పెద్ద పేగు క్యాన్సర్ కణాలను సమర్థంగా చంపేస్తుందని కనుగొన్నారు. ఈ పిప్లార్టైన్ క్యాన్సర్ రోగులకు ఓ వరం లాంటి ఔషధమని రూర్కెలలోని ఎన్ఐటీ పరిశోధకులు చెబుతున్నారు. బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన బృందాలతో కలిసి ఎన్ఐటీ రూర్కెల పరిశోధకులు చేసిన అధ్యయనంలో పిప్పళ్లలోని క్యాన్సర్ సంహారక శక్తి వెల్లడైంది. పెద్ద పేగు క్యాన్సర్ బారిన పడిన రోగులకు ప్రస్తుతం కీమో థెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రత్యామ్నాయ వైద్య విధానాలపై పరిశోధనలు చేస్తున్న క్రమంలో పిప్పళ్లలోని పిప్లార్టైన్‌ను పెద్ద పేగు క్యాన్సర్ కణాలపై పరీక్షించిన ఎన్ఐటీ రూర్కెల పరిశోధకులు అద్భుతమైన ఫలితాన్ని కనుగొన్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు బయోఫ్యాక్టర్స్ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

మానుతున్న శతాబ్దాల గాయాలు



రామాలయ ప్రాంగణంలో భారీ సంఖ్యలో భక్తులు, ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజం

నేడు ప్రపంచమంతా రామభక్తిలో మునిగింది

» అయోధ్యలో రామ మందిరంపై ధ్వజారోహణం సందర్భంగా ప్రధాని మోదీ

అయోధ్య, నవంబరు 25: అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో భారత ఆత్మకు శతాబ్దాలుగా అయిన గాయాలు మానుతున్నాయని, బాధ ఉపశమిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. నేడు భారత్‌తో పాటు మొత్తం ప్రపంచమే శ్రీరాముడి భక్తిలో మునిగిపోయిందని తెలిపారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తయిన సందర్భంగా మంగళవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవ శోభ సంతరించుకున్న అయోధ్యా నగరంలో వేలమంది భక్తుల 'జైశ్రీరామ్' నినాదాల మధ్య ప్రధాని మోదీ కాషాయ జెండాను ఆలయ శిఖరంపై రిమోట్ ద్వారా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. '500 ఏళ్ల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. ఈ ధ్వజారోహణ కార్యక్రమం ఎంతో ప్రత్యేకమైన దైవకార్యం. ఆలయంపై రెపరెపలాడుతున్న ఈ కాషాయ జెండా ఎప్పటికైనా అబద్ధాలపై నిజమే విజయం సాధించి తీరుతుందని నిరూపిస్తోంది' అని పేర్కొన్నారు. అయోధ్య రామాలయ నిర్మాణం కోసం పోరాటం చేసిన చేసినవారితోపాటు ఆలయ నిర్మాణానికి సహకరించిన వారికి, రామ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. 'త్రేతాయుగం నాటి అయోధ్య మానవతకు నైతిక మార్గంగా ఉండేది. 21వ శతాబ్దపు అయోధ్య నూతన అభివృద్ధి విధానానికి చిహ్నంగా మారింది' అని తెలిపారు.

ఆత్మన్యూనత నుంచి బయటపడదాం

ప్రజాస్వామ్యానికి భారతదేశమే తల్లి అని ప్రధాని మోదీ తెలిపారు. తమిళనాడులో వెయ్యేళ్లనాటి శాసనంలో ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి వివరించారు. "మన డీఎన్ఏలోనే ప్రజాస్వామ్యం ఉంది. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను వేరే దేశం నుంచి తెచ్చుకున్నామని వలసవాద భావజాలం వల్ల నేడు మనం భ్రమపడుతున్నాం. భారతీయ ఘనతను తలకిందులు చేసే విత్తనాలను 190 ఏళ్ల క్రితం మెకాలే చల్లాడు. మన జాతీయ చిహ్నాల రూపకల్పనలో కూడా ఈ భావాలు ప్రభావం చూపాయి. మనం స్వాతంత్ర్యమైతే సాధించాం కానీ, ఆత్మన్యూనత నుంచి స్వాతంత్ర్యం పొందలేదు. ఈ రకమైన ఆలోచనా విధానం నుంచి బయటపడేందుకు వచ్చే పదేళ్ల కాలాన్ని కేటాయించాలి. అందులో భాగంగానే ఇటీవల మన నౌకాదళం పతాకాన్ని కొత్తగా రూపొందించాం. అది కేవలం డిజైన్ మార్పు మాత్రమే కాదు. మన ఆలోచనల్లో మార్పు" అన్నారు

ప్రధాని భావోద్వేగం


అయోధ్యలో రామ మందిరం పునర్‌నిర్మించాలన్న శతాబ్దాల నాటి కల నెరవేరటంతో కోట్లాది మంది హిందువులు పులకించిపోతున్నారు. మంగళవారం ఆలయంపై స్వయంగా ధ్వజారోహణం చేసిన ప్రధాని మోదీ కూడా తన్మయత్వానికి లోనయ్యారు. ఆలయంపై ధ్వజం రెపరెపలాడగానే దానికి రెండు చేతులు జోడించి దండంపెట్టారు. ఆ సమయంలో మోదీ చేతులు వణికాయి. ఆ దృశ్యం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ధ్వజారోహణ కార్యక్రమానికి ప్రముఖులతోపాటు పలువురు సామాన్యులను కూడా అతిథులుగా ఆహ్వానించారు. అతిథుల్లో సోన్‌భద్రకు చెందిన ఆదివాసీలు, రామమందిరం-బాబ్రీ మసీదు కేసులో ప్రతివాది అయిన హషీమ్ అన్సారీ కుమారుడైన ఇక్బాల్ కూడా ఉన్నారు. ధ్వజారోహణం సందర్భంగా అయోధ్య నగరం ఉత్సవ శోభను సంతరించుకుంది. ఎటుచూసినా జైశ్రీరామ్ నినాదాలు మారుమోగాయి. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అమరుల ఆత్మలు శాంతించాయి

అయోధ్య రామాలయ నిర్మాణం కోసం త్యాగాలు చేసినవారి ఆత్మలు ఆలయ ధ్వజారోహణంతో శాంతించాయని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఈరోజు మనకు ఎంతో గొప్ప రోజు. సుదీర్ఘ కాలంగా ఉన్న మన కల నెరవేరిన రోజు. మన త్యాగాలన్నీ ఫలించిన రోజు. అశోక్‌సింఘాల్ (విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు)కు నిజమైన శాంతి లభించిన రోజు. ఎంతోమంది రామమందిరం కోసం త్యాగాలు చేశారు' అని పేర్కొన్నారు. అయోధ్య రామాలయంపై ధ్వజారోహణ కార్యక్రమం దేశంలో నూతన శకానికి నాంది అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

పాంచజన్య మెమోరియల్ ప్రారంభం

మహాభారత సంగ్రామం జరిగిన హరియాణాలోని కురుక్షేత్రలో నిర్మించిన పాంచజన్య మెమోరియల్‌ను మోదీ మంగళవారం ప్రారంభించారు. శ్రీకృష్ణుడి శంఖమైన పాంచజన్యానికి గుర్తుగా దీనిని అదే ఆకారంలో నిర్మించారు. పాంచజన్య విగ్రహం 5.5 టన్నుల బరువు ఉంది. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా నిర్మించిన అనుభవ్ కేంద్రాన్ని కూడా మోదీ సందర్శించారు. అక్కడే సిక్కు గురువు గురు తేగ్ బహదూర్ 350వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.




కాషాయ ధ్వజానికి మోదీ ప్రత్యేక పూజలు

ధ్వజం ప్రత్యేకతలు

కాషాయ ధ్వజం రూపకల్పనలో పలు ప్రత్యేకతలు ఉన్నాయి. త్రిభుజాకారంలో ఉన్న ధ్వజం 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు ఉంది. దానిపై శ్రీరాముడి వంశమైన భగవాన్ సూర్యుడితోపాటు ఓంకారాన్ని ముద్రించారు. శ్రీరాముడి కాలంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న కోవిదార వృక్షాన్ని కూడా ధ్వజంపై ముద్రించారు. త్రేతాయుగంలో కశ్యప మహర్షి మందార, పారిజాత చెట్లను అంటుకట్టి ఈ కోవిదార వృక్షాన్ని సృష్టించినట్లు చెబుతారు. శ్రీరాముడి సోదరుడైన భరతుడి రథ ధ్వజంలో ఈ వృక్షపు చిహ్నమే ఉంటుంది.

లోకం తీరు



ఆపరేషన్ యాంటీబయాటిక్స్

» నేషనల్ యాక్షన్ ప్లాన్ 2.0 విడుదల

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)ను ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధమైంది. అత్యాధునిక యాంటీబయాటిక్ మందులకూ లొంగని మొండి సూక్ష్మజీవులను (ఎంఎంఆర్) అరికట్టేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకొచ్చింది. రాబోయే ఐదేళ్ల కాలానికి (2025-2029) సంబంధించి.. 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎన్ఏపీ-ఏఎమ్ఆర్) 2.0'ను తాజాగా విడుదల చేసింది. కేంద్రం రూపొందించిన ఈ యాక్షన్ ప్లాన్ ప్రధానంగా ఆరు అంశాల ఆధారంగా పనిచేయనుంది.

విస్తృత అవగాహన: యాంటీబయాటిక్స్‌ను విచ్చలవిడిగా వాడేయకూడదని ప్రజలకు అర్థమయ్యేలా చెబుతారు. స్కూల్ పిల్లల నుంచి హెల్త్ వర్కర్ల వరకు అందరికీ దీనిపై అవగాహన కల్పిస్తారు.

పటిష్టమైన నిఘా: దేశవ్యాప్తంగా ల్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచనున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏ బ్యాక్టీరియా మందులకు లొంగడం లేదు? ఎక్కడ ఎక్కువ కేసులున్నాయి? అనే డేటాను సేకరిస్తారు. .

ఇన్ఫెక్షన్ల నివారణ: ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా.. ఇన్ఫెక్షన్లు ఒకరి నుంచి ఒకరికి సోకకుండా చూస్తారు. దీనివల్ల మందుల వాడకం తగ్గుతుంది.

మందుల వాడకంపై నియంత్రణ: వైద్యులు సిఫారసు చేసి, ప్రిస్క్రిప్షన్ ఇస్తేనే ఔషధాలను అమ్మే విధానాన్ని తీసుకురానున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్మడాన్ని పూర్తిగా అరికడతారు.

పరిశోధనలు-ఆవిష్కరణలు: పాత మందులు పనిచేయడం లేదు కాబట్టి, కొత్త యాంటీబయాటిక్ ఔషధాలను, టీకాలను, తక్కువ ఖర్చుతో రోగాన్ని గుర్తించే కిట్లను తయారు చేయడంపై దృష్టి సారిస్తారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తారు.

సమన్వయం: ఇది ఒక్క ఆరోగ్య శాఖ పనే కాదు కాబట్టి... వ్యవసాయం, పశుసంవర్థక, పర్యావరణ శాఖలతో సమన్వయం చేస్తారు.

కొన్నిసార్లు శిక్ష కన్న క్షమ మిన్న

» బూటు విసిరిన ఘటనను పట్టించుకోలేదు

» హిందువులను కించపరచడమన్న ప్రశ్నే లేదు: మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ, నవంబరు 25: కోర్టులో తనపై బూటు విసిరిన సంఘటనను తాను పట్టించుకోలేదని, ప్రభావితం కాలేదని మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు. తాను హిందువుల మనోభావాలను దెబ్బ తీశానన్న ప్రశ్నే తలెత్తదని చెప్పారు. పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లో ఓ విష్ణు విగ్రహం పునరుద్ధరణకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా 'పోయి, దేవుడికే చెప్పుకోండి' అని పిటిషనర్‌ను ఉద్దేశించి అన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని నిరసన తెలుపుతూ కోర్టులో ఒకరు ఆయనపై బూటు విసిరారు. దీనిపై అడిగిన ప్రశ్నకు గవాయ్ సమాధానం ఇస్తూ 'నేను హిందువుల మనోభావాలను కించపరిచానన్న ప్రశ్నే లేదు. నేను గుడులు, దర్గాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు అన్నింటికీ వెళ్తాను. అన్ని మతాలనూ అమితంగా గౌరవిస్తాను' అని చెప్పారు. ఆ నిర్ణయం ఆ క్షణంలో తీసుకున్నదే తప్ప ముందుగా అనుకొని చేసినది కాదని అన్నారు. బూటు విసిరన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి ఇష్టపడలేదని చెప్పారు. కొన్ని సార్లు శిక్షించడం కన్నా క్షమించడం మంచిదని అన్నారు. వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్త అవసరమని ఈ సంఘటన రుజువు చేసిందని చెప్పారు. రిటైర్మెంట్ అయిన తరువాత ప్రభుత్వ పదవులు చేపట్టకూడదని బాధ్యతలు స్వీకరించిన రోజునే అనుకున్నానని చెప్పారు. దానికి కట్టుబడి ఉంటానన్నారు.

ఆ సైన్యాధికారి తొలగింపు సబబే!

పూజలో పాల్గొనేందుకు నిరాకరించిన క్రైస్తవ సైన్యాధికారి డిస్మిస్‌పై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నవంబరు 25: తమ రెజిమెంటుకు సంబంధించిన హిందూ ఆలయంలో జరిగే వారాంతపు పూజలో ఇతర సైనికులతో కలిసి పాల్గొనటానికి నిరాకరించిన క్రైస్తవ మతానికి చెందిన ఓ సైన్యాధికారిని సైన్యం నుంచి తొలగించటాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. దీనివల్ల సదరు రెజిమెంటులో ఉండాల్సిన ఐక్యత దెబ్బతింటుందని, ప్రవర్తన మార్చుకోవాలని సీనియర్ అధికారులు పలుమార్లు చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టటాన్ని.. తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా అభివర్ణించింది. 'మీ ఉద్యోగానికి సంబంధించిన ఇతర అంశాల్లో మీరు ఎంత ప్రతిభావంతులైనా కావొచ్చు. కానీ, భారతీయ సైన్యం అంటేనే సెక్యులరిజానికి ప్రతీక. మీ సొంత సైనికుల భావోద్వేగాలను గౌరవించటంలో మీరు విఫలమయ్యారు' అని వ్యాఖ్యానించింది. శామ్యూల్ కమలేశన్ అనే సైన్యాధికారిని ఆర్మీ నుంచి తొలగించిన అంశంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. శామ్యూల్ కమలేశన్ 2017లో సైన్యంలో చేరారు. తదనంతర కాలంలో ఆయనకు ఒక స్క్వాడ్రన్ ట్రూప్ లీడర్ బాధ్యతలు అప్పగించారు. వారి రెజిమెంట్ ఉండే ప్రాంతంలో ఒక గురుద్వారా, ఒక ఆలయం ఉన్నాయి. వారాంతాల్లో జరిగే ఆధ్యాత్మిక పరేడ్‌లలో శామ్యూల్ తన సైనికులతో కలిసి పాల్గొనేవారు. అయితే, ఆలయంలో జరిగే మంగళహారతి, పూజ వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోకుండా ఆలయం బయట ఉండిపోయేవారు. దీనిపై ఆయన పైఅధికారులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. తర్వాత ఆయనను విధుల నుంచి తొలగించారు. ఈ ఉత్తర్వులను శామ్యూల్ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా.. ఉన్నతాధికారుల నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. దీంతో, శామ్యూల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'ఈ విధమైన ప్రవర్తన ద్వారా మీరు ఏ సంకేతం ఇస్తున్నారు? నాయకులు ఒక సమున్నత ఉదాహరణగా నిలవాలి. కానీ, మీరు మీ సైనికులనే అవమానిస్తున్నారు' అని పేర్కొన్నారు. శామ్యూల్ కమలేశన్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపిస్తూ.. తన క్లయింట్ రెజిమెంటులో జరిగే దీపావళి, హోలీ వంటి పండుగల్లో పాల్గొంటారని, సర్వధర్మస్థల్ (అన్ని మతాల ప్రార్థనాస్థలం) వద్ద జరిగే కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటారని తెలిపారు. ప్రస్తుతం పోస్టింగు ఉన్న ప్రాంతంలో సర్వధర్మస్థల్ లేకపోవటంతో.. ఆలయం బయట జరిగే కార్యక్రమాల్లో పాల్గొనటానికి సిద్ధంకానీ, లోపల జరిగే పూజల్లో మాత్రం పాల్గొనని, తన మతభావనకు అది విరుద్ధమని తెలిపారని పేర్కొన్నారు. ఆర్టికల్ 25 ప్రకారం శామ్యూల్ తన మతాన్ని పాటించే హక్కును కలిగి ఉంటారని, ఆర్మీ అధికారి అయినంత మాత్రాన దానిని కోల్పోరన్నారు.

కస్టడీ మరణాలు వ్యవస్థకు కళంకం

న్యూఢిల్లీ, నవంబరు 25: పోలీసు కస్టడీలో హింస, మరణాలు వ్యవస్థకు కళంకంలాంటివని, దేశం వీటిని సహించబోదని మంగళవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పోలీసు స్టేషన్లలో పనిచేసే సీసీటీవీ కెమేరాలు లేకపోవడంపై సుమోటోగా విచారణ జరుపుతున్నధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. రాజస్థాన్‌లో ఎనిమిది నెలల వ్యవధిలో 11 లాకప్ మరణాలు సంభవించడానికి సంబంధించిన కేసులో అన్ని పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేసేలా చూడాలని 2020లో ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో కోర్టులంటే చులకనగా తీసుకుంటున్నారా అని జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. దీనిపై తుషార్ మెహతా స్పందిస్తూ ఆదేశాల అమలుపై మూడు వారాల్లో అఫిడవిట్లు సమర్పిస్తామని చెప్పారు.

గందరగోళానికి అధిష్ఠానం తెరదించాలి

» కర్ణాటక సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై నెలకొన్న గందరగోళానికి పార్టీ అధిష్ఠానం తెరదించాలని సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధిష్ఠానం నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. అధిష్ఠానం పెద్దలను కలసి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకు ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీకి కర్ణాటకలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన పూర్తయింది. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం మార్పుపై చర్చ మొదలైంది. తాజా పరిణామాలపై డీకే శివకుమార్ కనకపురలో మీడియాతో మాట్లాడారు. పవర్ షేరింగ్ గురించి 2023లో పార్టీలోని నలుగురైదుగురు ముఖ్యుల సమక్షంలో ఒప్పందం జరిగిందని వెల్లడించారు. అది తమ మధ్య జరిగిన రహస్య ఒప్పందమని, బహిర్గతం చేయలేమని తెలిపారు.

నన్ను టార్గెట్ చేస్తే మీ పునాదులు కదిలిస్తా: మమత



బొన్‌గావ్, నవంబర్ 25: రాష్ట్రంలో తనను టార్గెట్ చేస్తే, దేశంలో బీజేపీ పునాదులు కదిలిస్తానంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. బీజేపీ ఎన్ని కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టినా, కేంద్ర సంస్థలన్నింటినీ రంగంలోకి దించినా తనను ఓడించలేదని అన్నారు. థాకూర్ నగర్‌లో మంగళవారం ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో మతువా మెజార్టీ ప్రాంతాల్లోని ఓటర్లను సీఏఏ పేరుతో విదేశీయులుగా ప్రకటించి, వెంటనే జాబితా నుంచి తొలగించేలా బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ వల్ల రాష్ట్రంలో ఇప్పటివరకు 36మంది ప్రాణాలు తీసుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలోనే 'హ్యామర్' క్షిపణుల తయారీ

భారత్, ఫ్రాన్స్ సంస్థల మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 25: భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా కీలక ఒప్పందం కుదిరింది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉన్న 'హ్యామర్' ఆయుధ వ్యవస్థ ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. ఈ మేరకు మన దేశానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ డిఫెన్స్ జాయింట్ వెంచర్ సహకార ఒప్పందం చేసుకున్నాయి. ఆకాశం నుంచి భూమిపై (ఎయిర్ టూ గ్రౌండ్) ఉన్న లక్ష్యాలను ఛేదించేలా హామర్ క్షిపణి వ్యవస్థను రూపొందించారు. దీన్ని రాఫెల్ యుద్ధ విమానం, తేజస్ వంటి తేలికపాటి యుద్ధ విమానాల నుంచి ప్రయోగించవచ్చని రక్షణ శాఖ పేర్కొంది. మరోవైపు, బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను భారత్ ఇతర దేశాలకు సరఫరా చేయనుంది. ఈ మేరకు 450 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4 వేల కోట్లు) విలువైన ఒప్పందాలు తుది దశకు చేరుకున్నాయని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఈ క్షిపణిపై ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపాయి.

మాల వేసుకోవాలంటే సెలవు తీసుకోండి

» జుట్టు పెంచుకొని, యూనిఫాం, బూట్లు లేకుండా విధులకు వచ్చేందుకు అనుమతి లేదు.. తెలంగాణ పోలీసు శాఖ ఉత్తర్వులు

సంతోష్‌నగర్, హైదరాబాద్ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల సహా ఇతర ఆధ్యాత్మిక దీక్షలు తీసుకునే పోలీసులు విధుల నుంచి సెలవు తీసుకోవాలని తెలంగాణ పోలీసు శాఖ తమ సిబ్బందికి సూచించింది. జుట్టు, గడ్డం పెంచుకొని, యూనిఫామ్‌కు బదులు సాధారణ దుస్తులు ధరించి, కాళ్లకు బూట్లు లేకుండా పోలీసు సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీసుస్టేషన్ ఎస్సై ఎస్.కృష్ణకాంత్ అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. దీక్ష నియమాలను పాటిస్తూ విధులకు హాజరయ్యేందుకు అనుమతి కోరుతూ ఆయన ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని తిరస్కరించిన ఉన్నతాధికారులు.. నిబంధనలపై పోలీసు సిబ్బంది అందరికీ స్పష్టతనిచ్చేలా ఓ మెమోను ఇటీవల జారీ చేశారు. అయ్యప్ప మాల సహా మరే ఆధ్యాత్మిక దీక్షలు తీసుకునే పోలీసులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు కూడా ఆ దీక్ష నియమాలను పాటించాలి అనుకుంటే విధులకు సెలవు తీసుకోవాలని స్పష్టం చేశారు. అయితే, పోలీసు శాఖ నుంచి వచ్చిన ఈ ప్రకటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయ్యప్ప మాల దీక్ష సమయంలోనే ఇలా చేస్తున్నారని, రంజాన్ సమయంలో ఈ నిబంధనలు ఎందుకు గుర్తు రావు? అని ప్రశ్నిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. నిబంధనలు అన్ని వర్గాలకు సమానంగా ఉండాలన్నారు. కానీ, ఒక వర్గానికి మాత్రమే నిబంధనలు విధించి, మరో వర్గం విషయంలో సానుకూలంగా ఉండడం ఎంత వరకు సబబు? అని రాజాసింగ్ నిలదీశారు. నిబంధనల అమలు అంశంలో అన్ని వర్గాలను సమానంగా చూడాలని, హిందు, ముస్లింలను రెండు కళ్లుగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

రేపు వైకుంఠద్వార దర్శనాల ఈ-డిప్ కోటా విడుదల

- డిసెంబరు 1 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- తొలి మూడు రోజులూ ఉచిత దర్శనాలే

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలను తొలి మూడు రోజులకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ప్రక్రియ ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. డిసెంబరు 30, 31, జనవరి 1 తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలను పూర్తి ఉచితంగా సామాన్య భక్తులకే కేటాయించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ రోజుల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి సహా అన్ని ప్రత్యేక దర్శనాలనూ రద్దు చేశారు. టికెట్ల కోసం ఎటువంటి ఒత్తిడి లేకుండా ఈ మూడు రోజులకు ఈసారి ఆన్‌లైన్‌లోనే తమ పేర్లను భక్తులు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 27 గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ మొదలవుతుంది. డిసెంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత డిప్ ద్వారా ఎంపికైన భక్తులకు డిసెంబరు 2 మధ్యాహ్నం 2 గంటలకు టోకెన్లు కేటాయిస్తారు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

ఈ-డిప్ ద్వారా కేటాయించే టోకెన్ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు వాట్సా్‌ప్‌లోని ఏపీ గవర్నమెంట్ బాట్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. 955023 00009 నెంబరుకు భక్తులు గోవిందా లేదా హాయ్ అని మెసెజ్ చేయాలి. ఎంచుకున్న భాషలో టీటీడీ టెంపుల్ సర్వీస్‌ను ఎంపిక చేస్తే వైకుంఠ ద్వార దర్శనం(డిప్) ఆప్షన్ కనిపిస్తుంది. దీని ద్వారా ఈ-మెయిల్ ఐడీ, అడ్రెస్, పిన్ కోడ్ వివరాలను నమోదు చేసుకోవచ్చు. తర్వాత 30, 31, 1వ తేదీల్లో కావాల్సిన తేదీని ఎంపిక చేసుకుని సబ్మిట్ చేయాలి.

మిగిలిన ఏడు రోజులూ నేరుగా దర్శనాలు

వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి మూడు రోజులూ ఉచిత దర్శనాలకు కేటాయించగా, జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చు. ఇవి గాకుండా ఈ రోజుల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను రోజుకు 15 వేల చొప్పున డిసెంబరు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. అలాగే ఉదయం 10 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతలకు రోజుకు వెయ్యి చొప్పున టికెట్లను విడుదల చేస్తారు. ఈ పది రోజులు ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించే శ్రీవాణి, ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని పూర్తిగా రద్దు చేశారు. కాగా, రూ.కోటి ఆపైగా విరాళం ఇచ్చిన దాతలు వారి కుటుంబ సభ్యులకు రోజుకు 125 మందికి, రూ.లక్ష నుంచి రూ.99 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు ఏకాదశి, ద్వాదశి రోజుల్లో రోజుకు వెయ్యి మందికి, మిగిలిన ఎనిమిదిరోజులకు రోజుకు 2వేల మందికి టికెట్లు జారీ చేస్తారు. వీరికి ప్రత్యేక అప్లికేషన్ రూపొందించి డిసెంబరు 5వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేస్తారు.

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు తప్పనిసరి

- సంబంధిత మంత్రులు, అధికారులు తమ విధి నిర్వహణలో భాగం చేసుకోవాలి
- విద్యార్థులకు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు
- వారిలో ఆత్మస్థైర్యం పెరిగేలా కౌన్సెలింగ్ నిర్వహించాలి
- సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష


సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో వసతులపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో తనిఖీలను మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నీటి సరఫరా, పారిశుధ్యం, ఇతర సదుపాయాలపై మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో పారిశుధ్యాన్ని నూటికి నూరుశాతం నిర్వహించాలన్నారు. చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో హాస్టళ్లలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకూడదని ఆదేశించారు. ఒకవేళ మళ్లీ జరిగితే.. ఏం జరిగిందనేది తెలుసుకోవడం ఉండదని, నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 20 శాతం హాస్టళ్లలో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరగాల్సి ఉందని, వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్లు ఉండటం సరికాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయన్నారు. ప్రతి హాస్టల్, ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలోనూ ఆర్వో ప్లాంట్ ఉండాల్సిందేన్నారు. విద్యార్థులకు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించాలని అధికారులకు సూచించారు. హాస్టళ్లలోని 4.17 లక్షల మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి, సమస్యలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలని నిర్దేశించారు. బడుగు విద్యార్థులకు చేసే సాయాన్ని బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో హాస్టళ్లు పెట్టారని, దీనికి విఘాతం కలిగించేలా అలసత్వం వహిస్తే ఊరుకొనేది లేదని తేల్చిచెప్పారు. హాస్టళ్లలో పరిస్థితి పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టడంతో పాటు పరిస్థితులపై నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలని అధికారులకు సూచించారు.

సంక్షేమ శాఖలకు ప్రత్యేకంగా కంట్రోల్ రూం

సంక్షేమ రంగానికి చెందిన శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఓ కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. అన్ని హాస్టళ్లలోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేలా ఆత్మస్థైర్యం పెరిగేలా నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో నీటి సరఫరా విషయంలో పంచాయతీరాజ్, మున్సిపల్, సంక్షేమ, వైద్యారోగ్య శాఖలు కలిసి పనిచేయాలని అధికారులకు సూచించారు. అన్ని హాస్టళ్లలో నీటి నమూనాలు సేకరించాలన్నారు. ఎనిమియా, సికెల్‌సెల్ వ్యాధులపై అవగాహన కల్పించే బాధ్యత అధికారులపై ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఐదు పెళ్లిళ్లు!

- నిత్య పెళ్లికొడుకు అరెస్టు


సురేంద్ర

భువనగిరి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లలో ఐదుగురిని వివాహమాడి మోసం చేసిన నిత్య పెళ్లి కొడుకును తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. భువనగిరి పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడపకు చెందిన సోమవరపు సురేంద్ర 2021లో మ్యాట్రిమోని ద్వారా భువనగిరికి చెందిన ఓ యువతికి పరిచయమయ్యాడు. మైనింగ్ వ్యాపారం చేస్తున్నానని, కన్సల్టెన్సీ నడుపుతున్నానని, తనకు పెట్రోల్ బంక్ ఉందని నమ్మబలికి రూ.15 లక్షల నగదు, 30 తులాల బంగారం తీసుకుని వివాహం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో కాపురం పెట్టిన సురేంద్ర తరచూ డబ్బులు, ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెట్టేవాడు. భర్త ప్రవర్తనపై విసుగు చెందిన ఆమె 2023 సెప్టెంబరు 14న ప్రశ్నించటంతో నీతో సంబంధం లేదని మెసేజ్ పెట్టి ఆమె నంబర్‌ను బ్లాక్ చేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె భువనగిరిలోని పుట్టింటికి చేరుకుంది. సురేంద్ర అప్పటికే కృష్ణవేణి అనే యువతిని వివాహం చేసుకుని రూ.12 లక్షలు కట్నంగా తీసుకుని మోసం చేసి రూ.7 లక్షలకు రాజీ చేసుకున్నాడు. భర్త కోసం కృష్ణవేణి భువనగిరిలోని యువతి ఇంటికి రావడంతో ఆమె తల్లిదండ్రులు రూ.6 లక్షలు చెల్లించారు. ఈ ఘటనపై గతేడాది ఆగస్టు 6న భువనగిరి యువతి ఫిర్యాదు చేయటంతో పోలీసులు ప్రత్యేక బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. సురేంద్ర ఐదుగురిని వివాహం చేసుకున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. మధ్యవర్తి జూపల్లి కిరణ్‌కుమార్ ద్వారా శైలజ అనే మహిళను వివాహం చేసుకుని రూ.2.50 లక్షలు తీసుకున్నాడని, విజయవాడకు చెందిన రత్నకు వారిని వివాహం చేసుకుని రూ.2 లక్షలు తీసుకున్నాడని, 2017లో కరీంనగర్‌కు చెందిన మరో యువతిని వివాహం చేసుకుని 2020లో ఆమెకు విడాకులు ఇచ్చినట్టు పోలీసులు గుర్తించారు. మంగళవారం భువనగిరికి వచ్చిన సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ రమేశ్ తెలిపారు.

కాంపౌండర్ వికృత చేష్టలు!

- దుస్తులు మార్చుకుంటున్న వైద్య సిబ్బంది వీడియో చిత్రీకరణ
- కాటూరి వైద్యశాలలో ఘటన.. పోలీసుల అదుపులో నిందితుడు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పరిధిలోని నడింపాలెం వద్ద గల కాటూరి వైద్యశాలలో కాంపౌండర్ వికృత చేష్టలు కలకలం రేపాయి. సోమవారం వైద్యశాలలోని ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహించే సిబ్బంది దుస్తులు మార్చుకుంటున్న సమయంలో ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన కాంపౌండర్ థియేటర్ గోడపై నుంచి వీడియోలు చిత్రీకరించాడు. ఈ విషయం గ్రహించిన మహిళా ఉద్యోగులు ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడు వెంకటసాయిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ భానోదయ ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహిళా ఉద్యోగుల వీడియోలను చిత్రీకరించిన వెంకటసాయిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అతని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ఫోన్‌లో ఉన్న సిబ్బందికి సంబంధించిన వీడియోలను డిలీట్ చేయడంతో పాటు ఫోన్‌ను ఫోరెన్సిక్‌కు పంపించినట్టు వెల్లడించారు. వెంకటసాయి నెలరోజుల క్రితమే వైద్యశాలలో విధుల్లో చేరడాని డీఎస్పీ తెలిపారు. కాగా.. నిందితుడు ఈ విధంగా చాలా వీడియోలు తీశాడనే ప్రచారం అవాస్తమని డీఎస్పీ స్పష్టంచేశారు.

రికార్డ్ స్థాయిలో మల్లన్న హుండీ ఆదాయం

- 33 రోజుల్లో రూ.7,27,26,400 రాబడి

శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్నకు కార్తీకమాసంలో రికార్డ్ స్థాయిలో హుండీ ఆదాయం సమకూరింది. మంగళవారం జరిగిన హుండీ లెక్కింపులో రూ.7,27,26,400 ఆదాయం వచ్చింది. గత సంవత్సరం కంటే ఇది రూ.1.30 కోట్లు అధికం కావడం విశేషం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అమెరికాలేని జీ20!

జీ20 సదస్సు నిర్వహణ ఎంతో కష్టమని మాతో ఓ మాట ముందే చెప్పవచ్చు కదా... అని భారత ప్రధాని నరేంద్ర మోదీతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా అన్నారట. సదస్సు నిర్వహణలో భారత్ సహకారం మరువలేనిదని కూడా ఆయన మోదీతో అన్నారట. రెండేళ్ళక్రితం జీ20 సదస్సును ఘనంగా నిర్వహించిన అనుభవం భారత్‌కు ఉన్నది కనుక, రామ్‌ఫోసా సరదాగా ఈ మాటలు అనివుంటారు. నిజానికి, ఆఫ్రికాఖండంలో జరిగిన ఈ తొలి జీ20 సదస్సు కూడా చక్కగా జరిగింది. దక్షిణాఫ్రికామీద అప్పటికే కక్షకట్టివున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు రాకపోవచ్చునన్న అంచనాలు ఎప్పటినుంచో ఉన్నవే. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతివారిని నల్లవారు ఊచకోత కోస్తున్నారంటూ ఆర్నెల్లక్రితం శ్వేతసౌధం సమావేశంలో, అంతర్జాతీయ మీడియా సమక్షంలో రామ్‌ఫోసాను ట్రంప్ తీవ్రంగా అవమానించిన ఆ దృశ్యం విస్మరించలేనిది. వందలమంది శ్వేతజాతీయులు హత్యలకు గురైనారంటూ ట్రంప్ మీడియాకు చూపిన ఆ చిత్రాలు సైతం అసత్యాలని అమెరికా పత్రికలే అప్పట్లో విమర్శించాయి. సోషల్ మీడియా ప్రచారాన్ని శ్వేతసౌధం అధికారికం చేస్తున్నదని తప్పుబట్టాయి. ఈ ఆరోపణలను సిరిల్ ఖండిస్తూ, తనది పేదదేశమని, అమెరికా అధ్యక్షుడికి ఖరీదైన విమానాలను బహుమతిగా ఇచ్చుకోలేనంటూ ఓ నర్మగర్భమైన వ్యాఖ్య కూడా చేశారు. ఖతార్ మాదిరిగా బోయింగ్ ఇచ్చి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోగల ఆర్థికస్తోమత తనకు లేదన్న ఆ వ్యాఖ్యలో హాస్యం కంటే అదిమిపట్టిన ఆగ్రహమే అధికం. శ్వేతజాతి పరిరక్షకుడుగా అవతారమెత్తి, దక్షిణాఫ్రికామీద కాలుదూస్తున్న ట్రంప్ ఈ జీ20 సదస్సుకు రాకపోవడం ఒకందుకు మనకూ మంచిదైంది. ట్రంప్‌తో దోస్తీ పూర్తిగా చెడి, ఎడమొఖం పెడమొఖంగా ఉన్న తరుణంలో, ట్రంప్‌కు ఎదురుపడకూడదన్న ఉద్దేశంతో ఇప్పటికే నరేంద్రమోదీ పలు అంతర్జాతీయ సదస్సులను వదులుకున్నారు. ఇలా వరుసబెట్టి ప్రపంచవేదికల మీద కనిపించకుండా పోవడం దేశానికి మంచిదికాదని విపక్షాలు సైతం వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో, ట్రంప్ గైర్హాజరీతో అందివచ్చిన జీ20 అవకాశాన్ని మోదీ సద్వినియోగం చేసుకున్నారు. దేశాధినేతలతో ఆయన చిరునవ్వులు, కరచాలనాలు, హాస్య సంభాషణలు మన మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. సదస్సుకు సంబంధించిన అన్ని సెషన్స్‌లోనూ మోదీ పాల్గొనడమే కాక, అద్భుతమైన ప్రసంగాలు, అనేక వినూత్న ప్రతిపాదనలు చేశారు.

ప్రధానంగా వాతావరణ మార్పులమీద చర్చించనున్న జొహెన్నెస్‌బర్గ్ సదస్సుకు ట్రంప్ రాకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ శిలాజ ఇంధనాలను తవ్విపోసే పనిలో ఆయన ఉన్నాడు. వాతావరణ మార్పు, పర్యావరణ క్షీణత, భూగోళం వేడెక్కడం వంటి మాటలకు చెవొగ్గితే ఈయన వంటి పారిశ్రామికవేత్తలకు మనుగడ ఉండదు కనుక, ఈ తరహా సదస్సులకు ట్రంప్ రారు. ఎజెండా మార్చుకోమని ట్రంప్ ఒత్తిడిచేశారని, అది సాధ్యపడకపోడంతో రావడమే మానుకున్నారని కొందరు అంటారు. శిఖరాగ్ర సదస్సు సంయుక్త ప్రకటన విషయంలోనూ అమెరికా అడ్డుపడినా దక్షిణాఫ్రికా లొంగలేదు. ట్రంప్ కోసం కేటాయించిన కుర్చీ ఖాళీగా కనిపించడం రామ్‌ఫోసాకు బాగా చిరాకు కలిగించినట్టు ఉంది, అధ్యక్షపదవి బదిలీకి సైతం దక్షిణాఫ్రికా నిరాకరించింది. అమెరికా ఈ సదస్సుల్లో పాల్గొనకపోయినా జీ20 కొనసాగుతుందని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వ్యవహారాల మంత్రి చేసిన వ్యాఖ్య వినడానికి బాగుంది. కానీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాత్రం జీ20 ప్రమాదపుటంచుల్లో ఉన్నదని హెచ్చరిస్తున్నారు. అమెరికా గైర్హాజరీతో ప్రధాన సంక్షోభాల పరిష్కారానికి సమష్టిపోరాటం కష్టమవుతుందన్న ఆయన అంచనా కొట్టిపారేయలేనిది. వాతావరణ సమస్యలు, అసమానతల పరిష్కారాలు ఇత్యాది కీలకాంశాలమీద జీ20 ఒక్కమాటగా ఉండటం బాగుంది. ఉగ్రవాద చర్యలను ముక్తకంఠంతో ఖండించడం ఎర్రకోట దాడి నేపథ్యంలో భారత్‌కు మంచి ఊరట. మాదకద్రవ్యాలపై పోరాటం వంటి భారత్ ప్రతిపాదిత అనేక అంశాలకు డిక్లరేషన్‌లో స్థానం దక్కింది. కృత్రిమమేధ దుర్వినియోగం మీద దృష్టిపెట్టాలంటూ మోదీ చేసిన హెచ్చరికలు సముచితమైనవి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇండియాలో జరగబోయే ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు జీ20 దేశాలను ఆహ్వానించడమూ బాగుంది. అనేకానేక అంశాలపై గ్లోబల్ సౌత్ ఘోషను వినిపిస్తున్న ఈ ముప్పై పేజీల ప్రకటన అమెరికా భాగస్వామ్యం లేకుండా ముందుకు తీసుకువెళ్లడం నిజంగా సాధ్యమేనా? అన్నది విలువైన ప్రశ్న, సరైన అనుమానం.

> **మదీన పుణ్యక్షేత్రంలోని జన్నతుల్ బఖీ అనే స్మశానవాటికలో ఖననం చేయాలని విశ్వాసులు ప్రగాఢంగా అభిలషించడం కద్దు. సాధారణంగా ఇక్కడ ఖననానికి అనుమతులు ఇవ్వరు. అయితే మన అధికారుల కృషి ఫలితంగా హైదరాబాద్ మృతులందరికీ జన్నతుల్ బఖీలో అంతిమక్రియలు నిర్వహించేందుకు సౌదీ అధికారులు అనుమతించారు.**

మదీనా మృతులకు గౌరవ వీడ్కోలు

గల్ఫ్ లేఖ

ప్రమాదవశాత్తు జరిగే దుర్ఘటనల్లో ప్రాణాలు ఎవరు కోల్పోయినా బాధకరమే. ఆ ప్రమాద ఘటన వారి స్వస్థలానికి దూరంగా అందునా విదేశీగడ్డపై సంభవించడం మరింత దుఃఖదాయకం. ఇటీవల హైదరాబాద్ నుంచి ఉమ్రా (ఇస్లామిక్ తీర్థయాత్ర)కు సౌదీ అరేబియాకు వెళ్లిన (చిన్నారులు, మహిళలతో సహా) 45 మంది తీర్థయాత్రికులు ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ దుర్ఘటన పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీఘ్రగతిన స్పందించిన తీరు అభినందనీయం. ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధతో అధికారిక లాంఛనాలు అన్నీ సత్వరమే పూర్తయి, మృతులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మదీన పుణ్యక్షేత్రంలో అంతిమక్రియలు నిర్వహించారు. ప్రమాదం చోటుచేసుకున్న వెన్వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మృతులకు అయిదు లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెందిన వారిని డి.యన్.ఎ పరీక్షల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సౌదీ అరేబియాకు పంపించారు. రేవంత్ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మోహమ్మద్ అజ్హరోద్దీన్ సారథ్యంలో ఒక అధికారిక బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సౌదీ అరేబియాకు వచ్చింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి బృందం ఒకటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్వర్యంలో సౌదీ అరేబియాకు వచ్చి సౌదీ అధికారిక వర్గాలతో సమావేశమై మృతదేహాల అప్పగింత విషయమై చర్చించింది. భారతీయ రాయబారితో సహా సమస్త దౌత్యవేత్తలు మదీన పుణ్యక్షేత్రంలో మకాం వేసి మృతదేహాల అప్పగింత, అంతిమక్రియల ఏర్పాట్లను సమన్వయం చేసారు. మదీన పుణ్యక్షేత్రంలోని జన్నతుల్ బఖీ అనే స్మశానవాటికకు ఇస్లాంలో ప్రాముఖ్యత ఉంది. తమను ఈ స్మశానవాటికలో ఖననం చేయాలని విశ్వాసులు ప్రగాఢంగా అభిలషించడం కద్దు. సాధారణంగా ఇక్కడ ఖననానికి అనుమతులు ఇవ్వరు. అయితే భారతీయ అధికారుల కృషి ఫలితంగా హైదరాబాద్ మృతులందరికీ



జన్నతుల్ బఖీలో అంతిమక్రియలు నిర్వహించేందుకు సౌదీ అధికారులు అనుమతించారు. ఇదీ ఒక గొప్ప విషయమే, సందేహం లేదు.

తీర్థ యాత్రలలో మరణించిన వారికి రూ.5 లక్షల నష్ట పరిహారం చెల్లించింది. ముస్లింలైనా, ఇతర మతస్తులైనా తీర్థ లేదా విహార యాత్రలకు వెళ్లేవారు సాధారణంగా మధ్య తరగతి లేదా ఉన్నత వర్గానికి చెందిన వారై ఉంటారు. పైగా సౌదీ అరేబియాలో తాజాగా అమలులో ఉన్న నిబంధన ప్రకారం, భారత్‌తో సహా విదేశాల నుంచి వచ్చే ఉమ్రా యాత్రికులకు బీమా తప్పనిసరి. బీమా పాలసీ లేకుండా వీసా ఎండార్స్ చేయరు. ప్రమాదవశాత్తు మరణించిన ఉమ్రా యాత్రికులకు ఒక్కొక్కరికి ఒక లక్ష రియాళ్ళు అంటే సుమారు రూ. 23.77 లక్షలు చొప్పున లభిస్తాయి. అయినా, రాష్ట్రప్రభుత్వం కూడా నష్టపరిహారం ప్రకటించడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

హైద్రాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రాబల్యాన్ని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు, నగరంలోని కొన్ని ప్రాంతాలలో బలీయమైన శక్తిగా ఉన్న మజ్లిస్ పార్టీ మద్దతు అవశ్యకత ఉందనే విషయం ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో అవగతమైంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవడమనేది అటు కాంగ్రెస్‌కు, ఇటు మజ్లిస్‌కు ఒక రాజకీయ అనివార్యత. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మదీన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక చర్యలను కొందరు ఈ కోణంనుంచే చూస్తున్నారు. ఒక అధికారిక బృందంలో మజ్లిస్ పార్టీ శాసనసభ్యుడిని రాష్ట్ర ప్రభుత్వం సౌదీ అరేబియాకు పంపించింది. అతడు దాన్ని పూర్తిగా ఓవైసీ ఖాతాలో వేస్తూ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహాయంతో చేసిన సహాయక చర్యలన్నీ కూడా మజ్లిస్ తన ఖాతాలోకి జమ చేసుకోగా కాంగ్రెస్ నిస్సహాయంగా చూస్తుండిపోయింది. ఈ రకమైన బుజ్జగింపు చర్యల వల్లే, అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా సరే హైద్రాబాద్ నగరంలో స్థానికంగా బలోపేతం కాలేకపోతోంది. అందుకు కాంగ్రెస్ సైతం మినహాయింపు కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'భారతి' ఆరాధకులు కానరారే?!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'నేను ఎవరి కోసం తీయని రాగాల్ని పాడాలి?.. మన కనుల ముందే దేశం ఆకలితో కుమిలిపోతున్నప్పుడు. దేశమంతా విషాన్ని మథిస్తుంటే, ఢిల్లీ మద్యం సేవిస్తోంది. దేశమంతా చీకటి నిండితే ఢిల్లీ మెరిసిపోతోంది..' అని హిందీ కవి రాంధారీ సింగ్ దినకర్ (1908–74) ఆక్రోశించారు. ఆయన బిహారీ. కాంగ్రెస్‌వాది. జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దినకర్‌ను మూడుసార్లు రాజ్యసభకు ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పుడే ఆయన ఈ కవిత రాశారు. దినకర్ కవితలు ప్రజల వెతలను ప్రభావవంతంగా వ్యక్తం చేశాయి. కనుకనే వాటిని జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే కాదు, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ సైతం అమితంగా అభిమానించారు. ఈ బిహారీ కవి కవితల్ని వాజపేయి అనేక సందర్భాల్లో ఉటంకించేవారు. మోదీ సైతం తరచూ ఉటంకిస్తూ దినకర్ పట్ల తన అభిమానాన్ని చాటుతుంటారు. కాంగ్రెస్‌వాది అయిన ఈ కవి తల్లజుని శతజయంత్యుత్సవాలను భారతీయ జనతా పార్టీ ఘనంగా నిర్వహించింది. అధికార పీఠాలు గుర్తించినా, గుర్తించకపోయినా కవులు, రచయితలు తమ మనసు కలచివేసిన వాస్తవాల గురించి రచిస్తూనే ఉంటారు. చాలామంది జర్నలిస్టులు రాయలేని నిజాలు కవులు, రచయితల రచనల్లో తచ్చాడుతుంటాయని అంగీకరించక తప్పదు.

బిహార్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోలిస్తే నేరచరితులు 68 నుంచి 53 శాతానికి తగ్గిపోవడం ఒక శుభపరిణామం. గతంలో బిహార్‌లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు క్రియాశీలంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేవారు. తర్వాతి కాలంలో వారి స్థానంలో నేర చరితులు ప్రవేశించారు. రామకృష్ణ బేణిపురి, లక్ష్మీనారాయణ సుధాంశు, ఫణీశ్వర్‌నాథ్ రేణు వంటి రచయితలు 1950వ దశకంలో ఎన్నికల బరిలో నిలిచి పోరాడారు. బేణిపురి, సుధాంశు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుపాలయ్యారు. ఆ స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు కూడా. దళితుల హక్కుల పరిరక్షణ, రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన ఫణీశ్వర్‌నాథ్ రేణు (1921–77) అరారియా జిల్లాలోని ఫోర్బ్స్‌గంజ్ నియోజకవర్గం నుంచి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కబీర్ గీతాల్ని, రామాయణ శ్లోకాల్ని, అమీర్ ఖుస్రో పర్షియన్ కవితల్ని ఉటంకిస్తూ ఆయన ప్రచారం చేశారు. ఎందరో రచయితలు, కళాకారులు ప్రచారం చేసినా ఆయన కేవలం 5వేల ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. 'తీస్రీ కసమ్' లాంటి కళాత్మక సినిమాలకు ప్రేరణనిచ్చిన రేణు ఎన్నికల ఓటమి తర్వాత 'కాగజ్ కీ నావ్' (కాగితపు పడవ) అనే నవల రచించారు. అప్పటికి దేశంలో ఎన్నికల వాతావరణం సంపన్నులకు, నేర చరితులకు అనుకూలంగా మారిపోయింది. ఆ తర్వాతి కాలంలో దేశంలో రచయితలు, కళాకారులకూ– రాజకీయ వ్యవస్థకూ దూరం రోజురోజుకూ పెరిగిపోయింది. రేణు సృజించిన సాహిత్యంలోని స్ఫూర్తిదాయక మాటలను మోదీ, నితీశ్‌కుమార్ మొదలైన నేతలు తరచూ ఉటంకిస్తూ ఉంటారు.

> **రచయితలు, కళాకారులను వారి భావజాలంతో నిమిత్తం లేకుండా గౌరవించి అక్కున చేర్చుకున్న ప్రభుత్వాలే చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. రాజరాజనరేంద్రుడు, మనుమసిద్ధి, శ్రీకృష్ణ దేవరాయలు మనకు ఇంకా ఎందుకు గుర్తున్నారు?**

బిహార్‌లోని మధుబని ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల గాయని మైథిలీ ఠాకూర్– మైథిలీ, భోజ్‌పురి, హిందీ భాషల్లో స్వంత గీతాలతో పాటు భక్తి గీతాలూ ఆలపిస్తుంటారు. గాయనిగా సామాజిక మాధ్యమాలలో ఆమె బహుళ ప్రచారం పొందారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో అలీనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆమె విజయం.. ఉక్కబోస్తున్న వాతావరణంలో ఒక మలయానిలం వీయడం లాంటిదే. మైథిలిని తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టడం ఆ పార్టీ ఆలోచనా విధానానికి యుక్తమైన నిర్ణయమే. అయితే దేశంలో తమ పార్టీ భావజాలంతో సంబంధం లేకపోయినా ప్రముఖ రచయితలను, కళాకారులను చట్టసభలకు, ముఖ్యంగా పార్లమెంటు ఎగువసభ అయిన రాజ్యసభకు ఎంపిక చేయడమనే ఒక మంచి సంప్రదాయాన్ని జాతీయ స్థాయిలో కొనసాగించిన నేతలు ఉన్నారు. నెహ్రూ నుంచి వాజపేయి దాకా ఈ సంప్రదాయాన్ని పాటించారు. నెహ్రూ తరచూ రచయితలను తీన్‌మూర్తి భవన్‌కు పిలిచి మాట్లాడడమే కాక గేటు వరకూ వచ్చి వారికి వీడ్కోలు చెప్పేవారు. మైథిలీ శరణ్ గుప్తా, కెఎం.పణిక్కర్, తారాశంకర్ బందోపాధ్యాయ, హరివంశరాయ్ బచ్చన్, జి.శంకర్ కురూప్, ఉమాశంకర్ జోషి, అబూ అబ్రహం, హబీబ్ తన్వర్, భగవతి చరణ్ వర్మ, కుష్వంత్ సింగ్, అమృతా ప్రీతమ్, ఆర్‌కె.నారాయణ్, కర్తార్‌సింగ్ దుగ్గల్, సి.నారాయణరెడ్డి, విద్యానివాస్ మిశ్రా, జావేద్ అఖ్తర్ తదితరులు రాజ్యసభకు నామినేట్ అయిన వారే. సినారెను రాజ్యసభకు నామినేట్ చేసిన సాహిత్య సహృదయుడు వాజపేయి. సినారెను చూడగానే వాజపేయి కవిత్వ పిపాసి అయిపోయేవారు. ఇరువురూ పార్లమెంటు నడవాల్లో ఉర్దూ కవితలను గుర్తు చేసుకుంటూ నడిచేవారు. తర్వాతి కాలంలో పెద్దల సభకు కవులు, రచయితలను ఎంపికచేయడం క్రమంగా తగ్గిపోయింది. ఒకవేళ ఒకరిద్దరిని ఎంపికచేసినా నాటి ప్రమాణాలు వారిలో కనపడడం తక్కువే. ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?

నిజానికి యూరోపియన్ ప్రమాణాలతో పోలిస్తే మన దేశంలో రచయితలను, కళాకారులను గౌరవించిన సందర్భాలు చాలా తక్కువే. ఇటీవల ఐర్లాండ్‌ను సందర్శించినప్పుడు అక్కడ రహదారుల కూడళ్లలోనూ, మార్కెట్ ప్రాంతాల్లోనూ, పార్కుల్లోనూ ఎక్కడ చూసినా రచయితల, కళాకారుల విగ్రహాలే కనపడ్డాయి. డబ్లిన్ నడిబొడ్డున మ్యూజియమ్ ఆఫ్ లిటరేచర్‌లో ఐరిష్ రచయితలు, వారి రచనలను ప్రదర్శించిన తీరు ఎవరికైనా అచ్చెరువు కలిగిస్తుంది. విఖ్యాత నవలా రచయిత జేమ్స్ జాయిస్ (1882–1941) రచనలు మనను చుట్టుముడతాయి. మహాకవి విలియం బట్లర్ యేట్స్



(1865–1939) పేరిట నిర్మించిన మ్యూజియంలో ఆయనకు సంబంధించిన వస్తువులు, రచనలు, పుస్తకాలను ప్రదర్శించడమే కాక, అడుగడుగునా ఆయన కవితల మధ్య మనం నడుస్తున్నట్లు వాతావరణాన్ని, దృశ్యాల్ని కల్పించారు. గాల్వేలో ప్రముఖ రచయిత ఆస్కార్ వైల్డ్ (1854–1900) ఆయన సోదరుడు, కవి విలియమ్ వైల్డ్ విగ్రహాలు కూర్చుని సంభాషిస్తున్నట్లుంటాయి. యేట్స్‌తో పాటు ఎందరో కవులు, రచయితలు ఐరిష్ పార్లమెంట్‌లో సభ్యులు అయ్యారు. ఐర్లాండ్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో కీలకపాత్ర పోషించిన రచయిత డగ్లస్ హైడ్ ఐర్లాండ్ తొలి అధ్యక్షుడయ్యారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి అనీబిసెంట్ లాంటి నేతలను అందించడమే కాదు, మాలపల్లి రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణ, రాష్ట్రపతి వీవీ గిరి లాంటి వారికి ఎంతో ప్రేరణ కలిగించిన దేశం ఐర్లండ్. అంతే కాదు, బ్రిటిష్ వారి పాలనలో మనుగడ కోల్పోయిన ఐరిష్ భాషను మళ్లీ పునరుజ్జీవింపచేసిన ఐర్లండ్, భాషా సంస్కృతుల పరిరక్షణ విషయంలో మనకు ప్రేరణగా నిలుస్తుందని డబ్లిన్‌లో మన రాయబారి అఖిలేశ్ మిశ్రా చెప్పారు. నదులు, సంస్కృతులను కాపాడుకునే విషయంలో మనం యూరప్ నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి.

మన దేశంలో ఎల్లెడలా రాజకీయ నాయకుల విగ్రహాలే కనిపిస్తాయి. మన ప్రసిద్ధ రచయితలు, కవుల స్మృతులను మనం భద్రపరచగలిగామా? కనీసం ప్రేమ్‌చంద్, గురజాడ, నిరాలా వంటి కవులు, రచయితల ప్రాధాన్యం గురించి ఈ తరం వారికి చెప్పగలుగుతున్నామా? కాళిదాసు కాలం నుంచీ సుసంపన్నమైన మన సాహిత్య కళాసంస్కృతి యూరోపియన్ సాహిత్య, కళాసంస్కృతి కంటే ఎంతో ప్రాచీనమైనదని వారికెలా తెలుస్తుంది? ఇటీవల ఢిల్లీలోని ఏపీ భవన్‌లో 'గుర్జాల హాలు'లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మంత్రి ఆహ్వానం పంపారు. అది 'గుర్జాల హాలు' కాదని, 'దేశమును ప్రేమించుమన్నా' అన్న గీతాన్ని రచించిన ప్రముఖ కవి గురజాడ అప్పారావు పేరును ఆ హాలుకు నందమూరి తారకరామారావు పెట్టారని ఎవరు చెప్పాలి?

'రాజు జీవించు రాతి విగ్రహములందు, సుకవి జీవించు ప్రజల నాలుకల యందు..' అని గుర్రం జాషువా; 'నీ కవిని బతికించుకోవాలిరా, నీవు మనిషి వనిపించుకోవాలిరా' అని తెన్నేటి సూరి; 'గాయపడిన కవి గుండెల్లో రాయబడని కావ్యాలెన్నో..' అని దాశరథి లాంటి కవులు ఉన్న మన నేలపై రాజకీయ నేతల, సంపన్నుల, అధికారుల, దళారుల దుష్టసంస్కృతి సాహిత్య, కళా వాతావరణంపై చీకటి నీడలా పరుచుకుంది. అయినప్పటికీ కొన్ని పరిణామాలు ఎంతో ఊరట కలిగిస్తాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సునీల్ గంగోపాధ్యాయ మరణించినప్పుడు ఆయన అంతిమయాత్రకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా సారథ్యం వహించారు. ఉత్కళ సాహితీవేత్తలు రమాకాంత్‌రథ్, మనోజ్‌దాస్‌లకు ఒడిషా ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రజాకళాకారుడు అందెశ్రీ పార్థివ దేహాన్ని మోసి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అందెశ్రీ ప్రతిధ్వనించిన 'మాయమైపోతున్నడమ్మా' అన్న ఒక్క గీతం చాలు ఆయన స్మృతిని గుండెలో పదిలం చేసుకునేందుకు. ధిక్కార స్వరాన్ని వినిపించిన బమ్మెర పోతన నుంచి కాళోజీ దాకా తెలంగాణ జన జీవన సంస్కృతిలో రచయితలు, కళాకారులు పోషించిన పాత్రను తక్కువ అంచనా వేయలేము. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా నన్నయ్య నుంచి శ్రీశ్రీ దాకా తెలుగు సంస్కృతిని సమున్నతం చేసిన వారిని మరిచిపోగలమా?

కవులు, రచయితలను గౌరవించడంలో తమిళనాడు అగ్రగామిగా, ఆదర్శప్రాయంగా ఉన్నదని చెప్పక తప్పదు. పార్లమెంటులో రవికుమార్, కనిమొళి, సల్మా, సుమతి, జ్యోతిమణి, వెంకటేశన్ వంటి తమిళ రచయితలు ఎందరో మనకు తటస్థపడతారు. జర్మనీలోని 'ఫ్రాంక్‌ఫర్ట్ ప్రపంచ పుస్తక ప్రదర్శన'లో తమ స్వంత స్టాల్‌ను నిర్వహించేది తమిళనాడు ప్రభుత్వం ఒక్కటే. రచయితల పుస్తకాలు ప్రచురించి, తామే కొనుగోలు చేసి, రాయల్టీలు ఇవ్వడమే కాదు, కేంద్ర సాహిత్య అకాడమీ విజేతలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత తమిళనాడు సర్కార్‌కే దక్కుతుంది. కర్ణాటకలో కూడా రచయితలు, కళాకారులను గౌరవించేందుకు పింఛన్లతో పాటు ఎన్నో చర్యలు చేపట్టారు. రచయితలు, కళాకారులను వారి భావజాలంతో నిమిత్తం లేకుండా గౌరవించి అక్కున చేర్చుకున్న ప్రభుత్వాలే చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. రాజరాజనరేంద్రుడు, మనుమసిద్ధి, శ్రీకృష్ణ దేవరాయలు మనకు ఇంకా ఎందుకు గుర్తున్నారు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

జాతి ఆత్మ మన రాజ్యాంగం

భారత రాజ్యాంగం మన దేశపు ఆత్మ, అది మన ప్రజాస్వామ్యం ఇచ్చిన అమూల్యమైన వారసత్వం. రాజ్యాంగం కేవలం పరిపాలనా నియమాల పుస్తకం కాదు; అది న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు మార్గదర్శక దీపస్తంభం. అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, వర్గాలతో కూడిన మన దేశాన్ని ఒక గూటిగా నిలిపేందుకు రాజ్యాంగమే అసలైన బలసారం. వందలాది అధికరణలు, భాగాలు, షెడ్యూళ్లు, సవరణలతో కూడిన ఈ పత్రం రూపుదిద్దుకోవడానికి రాజ్యాంగ సభ నిరంతరం శ్రమించింది. రాజ్యాంగ రూపకల్పనలో కనిపించిన ఆలోచనల వైవిధ్యం, సఖ్యత, చర్చ–సమ్మతి సంస్కృతి మన ప్రజాస్వామ్య పరిపక్వతకు చిరస్మరణీయ నిదర్శనం.



రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులను అందించడమే కాదు, బాధ్యతలను కూడా స్పష్టంగా నిర్ధారించింది. హక్కుల పట్ల ఎంత అప్రమత్తంగా ఉంటామో, అలాగే కర్తవ్యాల పట్ల జాగ్రత్తగా, నిబద్ధతతో ఉన్నపుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో దేశ నిర్మాణానికి బాటలు వేసిన డా. రాజేంద్ర ప్రసాద్, బాబాసాహెబ్ డా. భీమ్‌రావ్ అంబేడ్కర్ వంటి మహానుభావుల త్యాగం, దూరదృష్టి వల్లే సమాన అవకాశాల సమాజం దిశగా మన ప్రస్థానం ప్రారంభమైంది.

అయితే ఈ మహత్తర రాజ్యాంగాన్ని కాలక్రమేణా అనేక సంఘటనలు అవహేళన చేశాయి. అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ) విధించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో అతి చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ప్రాథమిక హక్కులను తొక్కిపెట్టి, భిన్నాభిప్రాయాలకు సంకెళ్ళు వేసే పాలన ఆ కాలంలో నెలకొంది. కానీ ఎమర్జెన్సీ అనంతరం ప్రజలు తమ తీర్పుతో ఆ నిరంకుశ ధోరణికి చెక్ పెట్టారు. ఇది భారత రాజ్యాంగ బలాన్ని మరోసారి ప్రపంచానికి చాటింది. తరువాత 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇలాంటి దుర్వినియోగాలకు అడ్డుకట్ట వేయడానికి మార్పులు జరిగాయి. రాజ్యాంగానికి స్వయంగా తనను తాను సరిదిద్దుకునే శక్తిని ఉన్నదని ఇది నిరూపిస్తుంది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజ్యాంగ గౌరవం, ప్రాముఖ్యతకు కొత్త ఊపిరి లభించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు, రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ స్థాయిలో జరుపుకోవడం వంటి ప్రయత్నాలు రాజ్యాంగ విలువలను ప్రజల దైనందిన జీవితంతో మరింత దగ్గర చేశాయి. ఆర్థిక రంగంలో కేంద్ర–రాజ్యాల సమన్వయాన్ని బలోపేతం చేసే జీఎస్టీ వంటి సంస్కరణలు కూడా రాజ్యాంగ స్ఫూర్తితోనే అమలైనవి.

జమ్మూ కశ్మీర్‌పై అమలులో ఉన్న ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని మరో మైలురాయిగా చూడవచ్చు. తాత్కాలిక ప్రత్యేక హోదాగా ప్రవేశపెట్టిన ఆ అధికరణం కాలక్రమంలో రాష్ట్ర సమగ్ర సంలీనానికి అడ్డంకిగా మారింది. దీన్ని తొలగించడం ద్వారా జమ్మూ కశ్మీర్ ప్రజలకు ఇతర రాష్ట్రాల పౌరుల్లానే సమాన హక్కులు, సమాన అభివృద్ధి అవకాశాలు కల్పించడం రాజ్యాంగ న్యాయాన్ని, సమానత్వ ఆత్మను బలపరిచిన నిర్ణయం. తరువాత సుప్రీంకోర్టు ఈ చర్యను రాజ్యాంగబద్ధమని నిర్ధారణ చేసింది.

రాజ్యాంగం ఒక స్థిర పత్రం మాత్రమే కాదు, కాలానుగుణంగా మార్పులు, సవరణల ద్వారా సజీవంగా ఉండే జీవగ్రంథం. సామాజిక–రాజకీయ అవసరాలు మారుతున్న కొద్దీ అనేక సవరణలు చేయబడతాయి. అయితే ఏ మార్పు చేసినా ప్రాథమిక నిర్మాణం (Basic Structure) దెబ్బతినకూడదనే భావన న్యాయవ్యవస్థ గీసిన మార్గదర్శక సూత్రం. ప్రజాస్వామ్య స్వరూపం, న్యాయపాలన, మౌలిక హక్కులు వంటి విలువలను కాపాడే ఈ సూత్రం రాజ్యాంగ స్థిరత్వానికి భరోసా ఇస్తోంది.

ఈ నేపథ్యంతో ప్రతీ ఏడాది రాజ్యాంగ దినోత్సవాన్ని కేవలం ఫార్మాలిటీగా కాకుండా, ఒక ప్రతిజ్ఞగా భావించాలని మనస్ఫూర్తిగా కోరాలి. హక్కులు మాత్రమే కాదు, కర్తవ్యాలను కూడా గౌరవించాలి. సామాజిక న్యాయం, సమానత్వం, జాతీయ ఏకత్వం దిశగా ప్రతీ రోజు ఒక్కో అడుగు వేస్తూ ఉంటేనే రాజ్యాంగ స్ఫూర్తి నిజంగా నిలుస్తుంది. పుస్తకాలలో పరిమితమై ఉన్న పత్రంగా కాకుండా, మన వ్యవహారాల్లో, పాలనలో, ప్రజా జీవితాల్లో ప్రతిబింబించే జీవ శక్తిగా రాజ్యాంగాన్ని మనం చూడాలి.

రాజ్యాంగ రక్షణ మన చేతుల్లోనే ఉంది. ఈ పత్రాన్ని దేశ స్వరూపానికి ప్రతీకగా, మన ఉమ్మడి బాధ్యతకు చిహ్నంగా, ప్రజాస్వామ్య గర్వానికి నిదర్శనంగా భావించి, భవిష్యత్ తరాలకు మరింత బలమైన, న్యాయసమాజాన్ని అందించే దిశగా మనందరం కట్టుబడి పనిచేయాలి.

● డా. కె.లక్ష్మణ్
రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు
(నేడు రాజ్యాంగ దినోత్సవం)

పెచ్చరిల్లుతున్న ఫేక్ న్యూస్

సోషల్ మీడియా వచ్చాక న్యూస్, సమాచారం క్షణాల్లో యూజర్‌కు చేరిపోతోంది. సోషల్ మీడియా ద్వారా వార్తల వినియోగం పెరిగింది. ఇదే అదనుగా యూట్యూబ్ చానెళ్లు, వెబ్ పోర్టళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

వ్యూస్, డబ్బు కోసం యూట్యూబ్ చానెళ్లు పెడుతున్నవారి సంఖ్య పెరిగిపోతోంది. ఫేక్ న్యూస్, అశ్లీలత కంటెంట్‌తో వీడియోలు రూపొందిస్తున్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. దీనిపై ఎలాంటి నియంత్రణ, కంప్లైంట్ వ్యవస్థ లేకపోవడంతో వీరు చెలరేగిపోతున్నారు. క్రింజ్ వీడియోలు చేసే వారితో ఇంటర్వ్యూలు చేయడమేకాదు, ఆయా వీడియోల్లో అశ్లీలత, సమాజంలోని కొందరిపై విద్వేషం పెంచేలా వీడియోలు రూపొందించడం సర్వసాధారణమైపోయింది.




ఫేక్ న్యూస్ ఘటనలు కోకొల్లలు. ఈ మధ్య టాటా బైక్ విడుదలైనట్లు ఫొటోలు వైరల్ అయ్యాయి. అలాగే, ఓ పులి మనిషిని లాక్కుపోతున్న వీడియో కూడా. ఇదంతా ఫేక్ న్యూసే. పైరసీ పోర్టల్‌లో వచ్చే సినిమాలపై ఓ వెబ్ పోర్టల్ అప్డేట్స్ ఇస్తూ దానిని ప్రమోట్ చేస్తున్నది. 'రూ. 56వేలు తగ్గిన బంగారం ధర!' వంటి తప్పుడు వార్తల క్లిప్, బైట్ హెడ్‌లైన్స్ పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. 'మీ దగ్గర పాత నోట్లు ఉంటే రూ.30–40 లక్షలు సంపాదించవచ్చు' అంటూ ఓ వెబ్ పోర్టల్ అదే పనిగా వార్తలను పబ్లిష్ చేసింది. వైరల్ వీడియోలను నమ్ముకుని, అది ఎంతవరకు నిజమనేది రూఢీ చేసుకోకుండానే కొన్ని వెబ్‌పోర్టళ్లు వాటిని ప్రచారం చేస్తున్నాయి. వెబ్ పోర్టళ్లు, యూట్యూబ్ చానెళ్లలో వచ్చే వార్తల్లో నిజమెంత? అని ఫ్యాక్ట్ చెక్ చేసుకునే అవకాశం సాధారణ ప్రజలకు లేదు. ఆ వార్తలు నిజమే అని నమ్మేవారి సంఖ్యే ఎక్కువ. ఫేక్ న్యూస్ వల్ల సమాజంలో గందరగోళం, ద్వేషం, అపనమ్మకం పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ప్రధాన మీడియాపై పడడం ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకర పరిణామం. మీడియా మీద నమ్మకం కోల్పోతే, ప్రజల్లో నిజాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. భారత రాజ్యాంగంలోని 19(1)(a) అధికరణ ప్రకారం 'వ్యక్తి స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని వ్యక్తపరచవచ్చు.' కానీ తప్పుదారి పట్టించే సమాచారానికి అదే కవచం కాకూడదు. ఐటీ చట్టం 69A, 79వ సెక్షన్లు ఫేక్ న్యూస్, మిస్‌లీడింగ్ కంటెంట్‌పై చర్యలు తీసుకునే అధికారం ఇస్తున్నప్పటికీ వాటి అమలు, ఫిర్యాదు వ్యవస్థలు అందుబాటులో లేవు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న ఈ తరుణంలో ప్రజలను తప్పుదోవ పట్టించే యూట్యూబ్ చానెళ్లు, వెబ్ పోర్టళ్లపై మానిటరింగ్ వ్యవస్థ రావాలి. ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసే వారిపై సులభంగా కంప్లైంట్ చేసేలా ఓ వ్యవస్థను రూపొందించాలి. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి.

సమాచారం శక్తిమంతమైనది. కానీ తప్పుడు సమాచారం విధ్వంసం సృష్టిస్తుంది. ప్రజలు నమ్మకంగా ఉండాలంటే, సోషల్ మీడియా బాధ్యతాయుతంగా ఉండాలి. వ్యూస్ కోసం ఫేక్ న్యూస్ ప్రసారం చేసే ఈ డిజిటల్ చానెళ్లను అరికట్టాలంటే ప్రభుత్వం, మీడియా, ప్రజలు ముగ్గురూ కలసి నడవాల్సిందే. నిజాలు తెలుసుకోవడం ప్రజల హక్కు. ఫేక్ న్యూస్ వల్ల వారు ఆ హక్కును కోల్పోకూడదు.

○ వంగరి రవిరాజు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



అమరావతిలో ఆర్థికం

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సీఆర్డీఏ శ్రీకారం



- కార్యాలయాలు, నివాసాలకు 27.855 ఎకరాలు కేటాయింపు
- 28న బ్యాంకు, ఎల్ఐసీ, ఆదాయపు పన్ను కార్యాలయాలకు శంకుస్థాపన
- హాజరు కానున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ప్రజారాజధాని అమరావతి ముస్తాబవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) రాజధాని అమరావతిలో ప్రతిపాదిత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటును వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఇన్‌కం టాక్స్ వంటి పలు ప్రభుత్వ అనుబంధ ఆర్థిక కార్యాలయాల శంకుస్థాపన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంస్థల కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలకు అవసరమైన స్థలాల కేటాయింపును పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న ఆయా కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్నట్లు సీఆర్డీఏ కార్యాలయం తాజాగా ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు సీఆర్డీఏ చేస్తోంది. అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలోని బ్లాక్- 1 వద్ద జరిగే కార్యక్రమంలో, రాజధానిలో ఏర్పాటు కానున్న పలు బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

మూడు విభాగాలుగా స్థలాల కేటాయింపు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు పనుల్లో భాగంగా బ్యాంకులు, ఆర్థిక అనుబంధ సంస్థలకు కేటాయించిన స్థలాలను కార్యాలయాలు, సిబ్బంది వసతి, అనుబంధ సంస్థలు అనే మూడు విభాగాలుగా స్థలాలు కేటాయించారు. బ్యాంకులు, కార్యాలయ భవనాల నిర్మాణం కోసం 9.695 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. భారతీయ స్టేట్ బ్యాంకు, కెనరా, నాబార్డు, యూనియన్ బ్యాంకు సహా 12 బ్యాంకులు ఇక్కడ కార్యాలయాలను నిర్మించుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), ఆదాయపు పన్నుశాఖ వంటి కీలకమైన అనుబంధ సంస్థల కోసం 5.80 ఎకరాలు కేటాయించారు. సిబ్బంది వసతి, సంస్థాగత టౌన్‌షిప్ అభివృద్ధిని సులభతరం చేయడానికి వీలుగా నివాస స్థలాలకు 7.02 ఎకరాలు, ఆర్బీఐ వంటి అనుబంధ సంస్థల ఉద్యోగుల నివాసాలకు 4.54 ఎకరాలు, మొత్తంగా 11.56 ఎకరాలు నివాసస్థలాలను కేటాయించారు. మొత్తంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటులో భాగంగా అమరావతిలో మొత్తం 27.855 ఎకరాల స్థలం కేటాయించారు.

కేటాయింపు రకం	స్థలం (ఎకరాల్లో)
ప్రభుత్వ రంగ బ్యాంకులు	9.695
ప్రైవేటు బ్యాంకులు	0.80
అనుబంధ సంస్థలు	5.80
నివాస స్థలాలు(బ్యాంకు)	7.02
ఆర్బీఐ, ఎన్ఐఏసీఎల్	4.54

సాగు సిరులు

అన్నదాతల్లో ఆనందం

- ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు
- మూడు జిల్లాల్లో 13.69 లక్షల టన్నుల అంచనా
- మద్దతు ధర ప్రకారం సుమారు రూ.3,243 కోట్ల ఉత్పత్తి

దిగుబడి ఇలా..

- పల్నాడు జిల్లాలో 1,40,643 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలో 3,48,090 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా.
- బాపట్ల జిల్లాలో 2,57,828 ఎకరాల్లో వరి సాగు కాగా 6,38,124 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది.
- గుంటూరు జిల్లాలో 1,55,005 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,83,637 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో వరి సాగు సిరులు కురిపిస్తోంది. సకాలంలో సాగర్, డెల్టా ఆయకట్టుకు ప్రభుత్వం పుష్కలంగా కృష్ణా జలాలను సరఫరా చేసింది. దీంతో గతంలో కంటే ఈసారి ముందస్తుగా రైతులు వరి సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అంచనాలకు మించి వరి సాగైంది. ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 5.53 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు ధాన్యం 30 నుంచి 35 బస్తాలకు వరకు దిగుబడి కానున్నది. సగటు దిగుబడి 33 బస్తాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ప్రకారం మూడు జిల్లాలో 13,69,851 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది. ఈ దిగు బడుల ఆధారంగా ప్రభుత్వ మద్ద తు ధర క్వింటాల్‌కు రూ.2,369 ప్ర కారం లెక్కిస్తే దాదాపు రూ.3,243 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ధాన్యం కొనుగోలు లక్ష్యాలు మొత్తం దిగు బడిలో 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. పల్నాడు జిల్లాలో వరి నూర్పిళ్లు పూర్తి చేసిన రైతులు దాళ్వాలో వరి సాగుకు సమాయత్తమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు నారుమళ్లు సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా రబీలో వరి సాగు పెరుగు తుందని అంచనా.





ధాన్యం బస్తాలు

నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తి..

ప్రస్తుతం ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. అయితే తుపానుపై వాతావరణశాఖ హెచ్చరిక అన్నదాతలను వణికిస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో యంత్రాలతో రైతులు నూర్పిళ్లు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఎక్కడికక్కడ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాతావరణం అనుకూలిస్తే రానున్న నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తియ్యే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ధాన్యం దిగుబడి అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వస్తుండగా మరి కొన్ని ప్రాంతాల్లో 35 బస్తాలకు పైగా వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్

బైక్‌లు చోరీ.. గంజాయి అమ్మకం

- ఓ బాలుడు సహా నలుగురి ముఠా అరెస్టు
- 19 వాహనాలు.. మూడు కిలోల గంజాయి స్వాధీనం

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న నలుగురి నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 19 ద్విచక్ర వాహనాలు, మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్లో మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పొన్నూరు రోడ్డులోని ఐపీడీకాలనీ ఒకటోలేన్‌కు చెందిన ఖాజావలి అంకమ్మ నగర్‌కు చెం దిన మిస్నీని పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో మిస్నీకి బంధువైన ఓ బాలుడు తరచూ ఖాజావలి ఇంటికి వస్తుండేవాడు. అయితే ఈ బాలుడు ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడేవాడు. బాలుడు తమ బంధువులైన రేణుక, మిస్నీలతో పాటు ఖాజావలిని కూడా ద్విచక్ర వాహన దొంగ తనాలకు పురిగొల్పాడు. ఈ క్రమంలో ఖాజావలి, ఆయన భార్య, అత్త రేణుక కలిసి ద్విచక్ర వాహన చోరీలు ప్రారంభించారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 11 ద్విచక్రవాహనాలు అపహరించారు. మేడికొండూరు పరిధిలో మూడు, ఫిరంగిపురం, యడ్లపాడు, నకరికల్లు, తాడికొండ, పెదకాకాని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 19 ద్విచక్ర వాహనాలు చోరీ చేశారు. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను తాకట్టు పెట్టేవారు. దాసరిపాలెంలో ఒకేరోజు మూడు ద్విచక్ర వాహన చోరీలతో అప్రమత్తమైన పోలీసు ల విచారణలో ఈ ముఠా కార్యకలాపాలు వెలుగు చూశాయి. దాసరిపాలెంలో ద్వి చక్ర వాహనాన్ని ఖాజావలి, బాలుడు కలిసి అపహరించి లంబసింగి తీసుకువెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చి సుమారు ఐదుకిలోల గంజాయి కొనుగోలు చేసి లారీలో గుంటూరు చేరుకున్నారు. కొరిటెపాడుకు చెందిన గోపి అనే వ్యక్తికి కొంత ఇచ్చి విక్రయించాలని చెప్పారు. మిగిలిన గంజాయిని 10 గ్రాముల చొప్పున ప్యాకెట్లుగా చేసి విక్ర యించి జల్సాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. జన్మభూమినగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఖాజావలితో పాటు బాలుడ్ని అదుపులోకి తీసుకుని మూడుకిలోల 120 గ్రాముల గంజాయితో పాటు వారు చోరీ చేసిన 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకు న్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన నల్లపాడు సీఐ కే వంశీ ధర్, ఎస్ఐ మహేష్‌కుమార్, హెడ్ కాని స్టేబుల్ కే సుబ్బారావు, కానిస్టేబుళ్లు కే భిక్షనాయక్, షేక్ మస్తాన్‌వలి, టీ సాంబశివరావులను అభినందించి రివార్డులు అందించారు.

రైతులు తెచ్చిన పత్తిని వెనక్కి పంపొద్దు

- సీసీఐ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచన
- అధైర్య పడొద్దు పంట మొత్తం కొనుగోలు చేస్తామని హామీ

మేడికొండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన పత్తి పంటను నిబంధనల పేరుతో వెనక్కి పంపవద్దని సీసీఐ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మండలంలోని పేరేచర్లలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంత్రి స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో ఆయన మాట్లాడారు. సీసీఐ కేంద్రాలలో సరైన ఆదరణ లభించడం లేదని, తేమ ఎక్కువగా ఉందన్న సాకుతో పత్తి లోడు బండ్లను తిరిగి పంపిస్తున్నారని రైతులు మంత్రి ఎదుట వాపోయారు. వ్యాపారులు, బయ్యర్లు కుమ్మక్కై నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి సీసీఐ అధికారులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే మీరు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12 నుంచి 18 శాతానికి తేమను పెంచే విధంగా కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒప్పిస్తామని చెప్పారు. సమస్యలపై కేంద్ర పెద్దలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. డిసెంబరు 1 నుంచి అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభ మవుతాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచిం చారు. రైతులు కూడా వీలైనంత వరకు పత్తిని ఆరబెట్టి సీసీఐ కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వెంటనే స్పందించి పరిష్కరిస్తారని చెప్పారు. డ్రోన్, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో అనేక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల ఆపలేకపోయినా వాటి కారణంగా రైతులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ అధికారులు వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు శ్రీనివాసరావు, పాములపాటి శివన్నారాయణ, వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మేడికొండూరు సమీపంలో ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.



సీసీఐ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



ఏపీ ఈడబ్ల్యుఐడీసీ కార్యాలయం

పర్సంటేజీలు.. పనులు

- ఏపీఈడబ్ల్యుఐడీసీలో రింగ్‌మాస్టర్లు
- రూ.4.18 కోట్ల పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం
- కార్యాలయ గోడలకే పనుల ప్రకటనలు పరిమితం

గుంటూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షల విలువ చేసే పనులు చేపడుతున్నారు. కానీ వాటి గురించి ఇతరులకు తెలియదు. కేవలం తమకు కావాల్సిన వారికి మాత్రమే తెలుస్తాయి.. వారికే పనులు దక్కుతాయి. ఆ తర్వాత పనులు మాటేమో కానీ నిధులు మాత్రం ఖర్చవుతాయి. ఇదీ ఆం ధ్ర ప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యు ఐడీసీ) పనితీరు. జిల్లాలోని కొంతమంది ఉన్నతాధికారుల ప్రోత్సాహం, అండ తో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ సంస్థ ఆధ్వర్యంలో సంక్షేమ శాఖల (ఎస్సీ, ఎస్టీ, బీసీ)తోపాటు, సాంకేతిక విద్యా శాఖ, పాఠశాల విద్య, ఇంటర్ బోర్డు, కళాశాల విద్య శాఖల భవనాలు, ప్రహ రీల నిర్మాణం, మరమ్మతులు, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్, మరుగుదొడ్ల నిర్మాణం, వాటర్ పైపులైన్లు, గదులకు డోర్లు, పెయింటింగ్ తదితర పనులు జరుగు తాయి. ఆయా పనులకు సంబంధించిన వివరాలు నోటీసు బోర్డుకే పరిమితమవుతాయి. కొంతమంది రింగ్ మాస్టర్ల కనుసన్నల్లోనే పనులు కేటాయింపులు జరిగిపోతాయి. పర్సంటేజీలు ముందుగానే మాట్లాడుకుని కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తారు. ఈ ప్రకారం గత ఏడాది 24 హాస్టళ్లలో రూ.4.18 కోట్ల పనులు జరిగాయి. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్‌లో రూ.50 లక్షల పనులు చేశారు. అయినా ఇంకా పూర్తిస్థాయిలో సమస్యలు తీరలేదని ఇటీవల ఇక్కడికి వచ్చిన కలెక్టర్ ఎదుట విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పెయింటింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, సివిల్ వర్క్స్‌లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వస్తువుల నాణ్యత సరిగా లేదని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో బీసీ, గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లలో జరిగిన మరమ్మతులు కూడా టెండర్లు లేకుండా చేసినట్లు సమాచారం. తాజాగా గుంటూరు గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాత భవనాల తొలగింపునకు సంబంధించి రూ.10 లక్షల పనులను కూడా పర్సంటేజీలు ఇచ్చిన వారికే అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పాతుకుపోయిన సిబ్బంది..

ఈ సంస్థలో కొంతమంది సిబ్బంది కొన్నేళ్లుగా పాతుకుపోయారు. బదిలీలు లేకుండా అక్కడే ఉంటూ చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కీలక స్థానంలో ఉన్న సాంకేతిక సిబ్బంది అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిం దని విమర్శలు ఉన్నాయి. ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే పనులపై ఉన్నతాధికారు లు దృష్టి సారించకుంటే ప్రభుత్వ పనితీరుపై తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది.

ఏపీ సీఆర్‌డీఏపై.. ఆసక్తి
- రెవెన్యూ ఉద్యోగుల డిప్యూటేషన్‌కు తెరిచిన తలుపులు
- ఇక్కడి కంటే 30 శాతం అదనపు జీతభత్యాలు
- విజ్ఞాపన లేఖలు పెట్టుకుంటోన్న సిబ్బంది

రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలి
డీసీసీబీ ఛైర్మన్ మక్కెన 6

పీఏసీఎస్‌ల అక్రమాల బాధ్యులపై చర్యలకు ప్రతిపాదనలు 8

నేటి నుంచి 20 బోగీలతో వందేభారత్ రాకపోకలు

నేడు గుంటూరు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

లింగ సమానత్వంతోనే మహిళా సాధికారిత

మహిళలపై హింస వ్యతిరేక దినం ర్యాలీలో డీఆర్వో ఖాజావలి

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. మహిళలపై హింస వ్యతిరేక దినం సందర్భంగా డీఆర్డీఏ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. కలెక్టరేట్ వద్ద ర్యాలీని ప్రారంభించిన ఆయన ప్రసంగించారు. మహిళలపై వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. స్త్రీ, పురుషులు సమానమని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వివరించాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోను రాణిస్తున్నారన్నారు. మహిళలపై దాడులు అరికట్టడంతో పాటు వారికి స్వేచ్ఛ, సురక్షిత వాతావరణం కల్పించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ లింగ వివక్షను అరికట్టడానికి సమాజంలో అవగాహన కోసం ప్రతి రోజు ఒక అంశంతో జిల్లా, మండల, గ్రామస్థాయిలో వివిధ రకాల కార్యక్రమాలను నెల పాటు నిర్వహిస్తున్నామన్నారు. నగరంపాలెం సెంటర్లో మానవహారం నిర్వహించి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుక ఐసీడీఎస్ పీడీ ప్రసూన, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు చెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీనబేగం, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఆర్వో, డీఆర్డీఏ పీడీ, జిల్లా స్థాయి అధికారులు

పారా వెటర్నరీ చట్టం పై ప్రభుత్వానికి నివేదిక

● వృత్తిపర సమన్వయ సమావేశంలో నిర్ణయం

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య విద్యను భ్రష్టు పట్టించే పారా వెటర్నరీ అండ్ అల్లైడ్ కౌన్సిల్ చట్టం- 2023 పై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య అధ్యక్షతన మంగళవారం వివిధ విభాగాలు, సంఘాల ప్రతినిధులతో జరిగిన వృత్తిపర సమన్వయ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య మాట్లాడుతూ, అప్పటి ప్రిన్సిపాల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్ ఉద్దేశం ప్రత్యేక కౌన్సిల్ స్థాపన కాదని, విశ్వవిద్యాలయంపై భారాన్ని తగ్గించే విధంగా సిలబస్ తయారీ, కోర్సుల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ కోసం సహాయక బోర్డ్ మాత్రమే అన్నారు. బోర్డు ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ పరిధిలోనే పనిచేయాలన్నారు. దాని కూర్పులో పశుసంవర్ధక శాఖ చెందిన అధికారులు, వైస్ చాన్సలర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఉండాలని తెలిపారు. ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని సమావేశం నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జె.వి.రమణ మాట్లాడుతూ వెటర్నరీ ప్రొఫెషనల్ సంఘాల నేతలు, వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఏ ఈశ్వర్‌రావు, పారా వెటర్నరీ కౌన్సిల్ కార్యదర్శి బీబీ రాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సంఘం, పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘం, వెటర్నరీ అసిస్టెంట్స్ సంఘం, పారా వెటర్నరీ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు

రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు శాఖల్లో రైతులకు రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలని మాజీ ఎమ్మెల్యే, చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సూచించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్ లో మంగళవారం డీసీసీబీ శాఖల మేనేజర్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మల్లికార్జునరావు ఆయా శాఖల్లో బకాయిలు, డిపాజిట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్యాంకులో డిపాజిట్లను పెంచేలా కృషి చేయాలని కోరారు. రైతులకు రుణాల మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. బకాయిల వసూళ్లలో మరింత దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో సీఈవో వీవీఎస్ వేణుకుమార్, పలువురు మేనేజర్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

ఏఎన్‌యూలో వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న హ్యాండ్సన్ పవర్ బీఐ వర్క్ షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ వర్క్ షాప్ ఈ నెల 26 నుండి 29 వరకు నాలుగు రోజుల పాటు జరుగుతుందని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ వర్క్ షాప్‌కు గ్లోయింగ్ సొల్యూషన్స్, మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ గోపికృష్ణ డాక్టర్ డి.చంద్రమౌళి, డేటా సైన్స్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.చైతన్య సీఎస్ఈ ఎంబీఏ కోఆర్డినేటర్ డాక్టర్ యస్.సతీష్ కుమార్, సైన్స్ కళాశాల సీఎస్ఈ కోఆర్డినేటర్ డాక్టర్ కె.లావణ్య స్టాటిస్టిక్స్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఎగ్జామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు, మహాత్మ జ్యోతిరావు పూలే చైర్ పర్సన్ త్రిమూర్తి రావు తదితరులు పాల్గొన్నారు.



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు తదితరులు

నిర్దేశించిన తేదీల్లోగా జీపీఎఫ్ వివరాలివ్వాలి

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాలు డీడీవోలు నిర్దేశించిన తేదీలోగా జడ్పీలో అందజేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీవోలు 2022 జనవరిలో తమ కార్యాలయంలో పనిచేసిన జడ్పీపీఎఫ్ చందా దారుల పే స్లిప్పులను అటెస్టేషన్ చేసి గూగుల్ ఫారంలో అప్‌లోడ్ చేసి, కవరింగ్ లెటర్ ద్వారా జిల్లా ప్రజా పరిషత్ పీఎఫ్ విభాగంలో అందజేయా లని సూచించారు. పే స్లిప్పులను సొంతగా తయారు చేయరాదని చెప్పారు. నిధి పోర్టల్ నుంచి ఉద్యోగి ద్వారా డౌన్‌లోడ్ చేసే పే స్లిప్పులనే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. పే స్లిప్పుల్లో ఉన్న వివరాలను గూగుల్ షీట్లో పొందుపరచాలని సూచించారు. ప్రతి జడ్పీపీఎఫ్ ఉద్యోగి, తన సీఎఫ్ఎంఎస్ నంబర్ ద్వారా నిధి పోర్టల్‌లో జనవరి 2022 పే స్లిప్పులు డౌన్లోడ్ చేసి అప్పటి డీడీవోలకు పంపాలని సూచించారు. నిర్దేశించిన తేదీలోగా ఆయా వివరాలు అందించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డ ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

నేడు గుంటూరు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావచ్చని వెల్లడించారు. ఇతర వివరాలకు 9866366187 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల సందడి మొదలైంది. మంగళవారం పలువురికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈవో వీర్ల జ్యోతి బసు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ఉద్యోగాల్లో చేరే వాళ్లు సీసీఏ నిబంధనలు తెలుసుకొని పనిచేయాలని అన్నారు. సీఈవో జ్యోతి బసు మాట్లాడుతూ, కష్టపడి పనిచేస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా క్రోసూరు ఎంపీపీ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ కార్య క్రమం లో అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్‌పాల్, ఎ సెక్షన్ ఏవో రాజా రత్నబాబు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈవో వీర్ల జ్యోతి బసు

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రధాన కార్యాలయం : లెవెల్ - 3, ఓక్‌హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, (బాంద్రా ఈస్ట్), ముంబాయి - 400051. ఫోన్ : 022-42410400, 022-40603100, వెబ్‌సైట్ : http://www.shriramfinance.in./auction
జోనల్ కార్యాలయ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ - 520002 మరియు బ్రాంచ్ ఆఫీస్ : విజయవాడ - 2

అనుబంధం - IV-A (రూల్ 9(1) యొక్క నిబంధనను చూడండి) స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) r/w 9(1) నందలి నిబంధనతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు తెలియజేయునది ఏమనగా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడిన / ఛార్జి చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ "(గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనపర్చుకోబడినవి మరియు పట్టికలో ఇవ్వబడిన విధంగా సదరు రుణగ్రహీతలు మరియు గ్యారంటర్ల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క మిగతా బకాయిని రాబట్టుకొనుటకు తేది.30-12-2025న ఉ॥ 11.00 గం. నుండి మ.1.00 గం. మధ్య ఇ-వేలంలో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే" ప్రాతిపదికన విక్రయించబడును. రుణగ్రహీతలు మరియు గ్యారంటర్ల వివరాలు, బకాయి సొమ్ము, స్థిరాస్తి సంక్షిప్త వివరం మరియు తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు, స్వాధీనత రకం, రిజర్వు ధర మరియు ధరావతు మరియు పెంపుదల దిగువనీయబడినవి :

ఋణగ్రస్తులు/సహ ఋణగ్రస్తులు / గ్యారంటీదారులు / మార్టిగేజిదారుల పేరు	తేది & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	స్వాధీనం తేది & విధం	ఆస్తి వివరాలు (శ్రీమతి వడ్లపూడి గ్లోరీ మంజు గారికి చెందినది)	ఎర్నెస్టు మనీ డిపాజిట్ వివరాలు (ఇఎండి) వివరాలు	వేలం జరిగే తేది & సమయం	సంప్రదించబడాల్సిన వ్యక్తి మరియు తనిఖీ తేది
1) విజయ్ కుమార్ వడ్లపూడి, తండ్రి : శంకరరావు, డి.నెం.50-8-12, అయ్యప్ప నగర్, గంగిరెడ్డుల దిబ్బ, విజయవాడ, కృష్ణాజిల్లా - 520004. 2) వడ్లపూడి గ్లోరీ మంజు, భర్త : విజయ్ కుమార్, డి.నెం.50-8-12, అయ్యప్ప నగర్, గంగిరెడ్డుల దిబ్బ, విజయవాడ, కృష్ణాజిల్లా - 520004. 3) నగిడి రఘునాథ్, తండ్రి : పండు, డి.నెం.21-13-21, నేతాజీ వీధి, మధురా నగర్, సత్యనారాయణపురం, విజయవాడ, కృష్ణాజిల్లా - 520011	చెల్లించాల్సిన మొత్తం రూ.75,53,628/- (అక్షరాల డెబ్బై ఐదు లక్షల యాభై మూడు వేల ఆరు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) (27.01.2023 వరకు వడ్డీ చార్జీ చేయబడింది) తో పాటు రుణ ఒప్పందం నెం. VIJA2TF1511240002 ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడిన తదుపరి వడ్డీ ప్లస్ చార్జీలు డిమాండ్ నోటీసు తేది : 27-01-2023	05-06-2024 భౌతిక స్వాధీనం ఏవైనా ఎన్‌కంబరెన్స్‌లు : తెలీదు ఉద్దేశించిన అమ్మకం ప్రకటన తేది : 18.10.2024	గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, తెనాలి (వెస్ట్) సబ్ డిస్ట్రిక్ట్, అంగలకుదురు గ్రామ పంచాయితీ ఏరియా, అంగలకుదురు గ్రామం డి.నెం.283 లోని ఎ.2.32 సెంట్ల మొత్తంలో ఎ.1.16 సెంట్ల భూమి ఇంటి ప్లాట్లుగా విభజించబడినది, దీనిలో 228.68 చ॥గ॥లు లేదా 191.18 చ॥మీ॥ల ఖాళీ ఇంటి స్థల విస్తీర్ణంతో గల ప్లాట్ నెం.18. హద్దులు : సమీప డి.నెం.3-2: తూర్పు : 20 అ॥ల వెడల్పు రోడ్డు - 42.0 అ॥లు, దక్షిణం : ప్లాట్ నెం.19 లోని స్థలం - 49.0 అ॥లు, పడమర : ప్లాట్ నెం.13 లోని స్థలం - 42.00 అ॥లు, ఉత్తరం : 24 అ॥ల వెడల్పు రోడ్డు - 49.0 అ॥లు., పైన తెలిపిన 228.66 చ॥గ॥లు లేదా 191.18 చ॥మీ॥ల ఖాళీ ఇంటి స్థల విస్తీర్ణంతో గల ప్లాట్ నెం.18 మాత్రమే. (ఈ ఆస్తి తెనాలి (వెస్ట్) ఎస్.ఆర్.ఓ. యొక్క డాక్యుమెంట్ నెం.1231/2014 ప్రకారం కలదు). రిజర్వు ధర మొత్తం : రూ.31,39,200/- ఇఎండి మొత్తం : రూ.3,13,920/- బిడ్ పెంపుదల : రూ.25,000/- మరియు అలాంటి గుణిజాల్లో గల పెంపుదల. ఇఎండి సమర్పించుటకు చివరి తేది : 29-12-2025, సమయం : ఉ॥ 10.00 గం॥ల నుంచి సా॥ 5.00 గం॥ల వరకు	క్రింద ఇక్కడ వివరించిన ఖాతా వివరాలకు RTGS/ NEFT ద్వారా జమ చేయాల్సిన ఇఎండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట బ్యాంకు పేరు : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, ముంబయి (MH). ఖాతా నెం: 230010200005265, IFSC కోడ్ : UTIB0000230	30 డిసెంబర్, 2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుంచి మ॥ 1.00 గం॥ వరకు	అధీకృత అధికారి శ్రీ లక్ష్మి నారాయణ చిరకాల, 8367466865. కె.సిహెచ్. శ్రీనివాసరావు +91 9989338862 కస్టమర్ కేర్ : 022 -40081572 ఆస్తి తనిఖీ చేయు తేది : 27-12-2025, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు

ఇ-వేలం తేది అనగా ఇ-వేలం ప్రక్రియ ప్రారంభమైనప్పుడు లేదా ముందు తేది. 30-12-2025లోగా పైన తెలిపిన మొత్తముతోపాటు చెల్లింపు తేదీనాటికి వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవల్సిందిగా లేని యెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని తెలియజేస్తున్నాము.
ఆసక్తి గల బిడ్డర్‌లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి అసద్ ఖాన్, మొబైల్ నెం.: 7128695102, శ్రీ గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం.9833922941, Mr. GAURAV NAMBOODIRI <gaurav.n@samil.in> మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, శ్రీ లక్ష్మి నారాయణచిరకాల, మొబైల్ నెం.8367466865 నందు సంప్రదించగలరు.
బకాయి శేషం ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అదీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ "శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్" యొక్క వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడండి.
గమనిక : "ఇందుమూలముగా తెలియజేయునదేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" లో విలీనమైనది. తర్వాత 30-11-2022 తేదీనాటి పేరు మార్పుననుసరించి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది.
ప్రదేశం : విజయవాడ, తేది : 25-11-2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఏ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు - 522034. మరియు బ్రాంచి ఆఫీస్ మెయిన్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు-2.

శ్రీ చల్లా అచ్చి రెడ్డి గారికి చెందిన స్థిరాస్తుల వేలం అమ్మకపు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) నందలి నిబంధనలతో చదువకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ, ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడిన / ఛార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు 'శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్' (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీన పర్చుకోబడినవి మరియు పట్టికలో ఇవ్వబడిన విధంగా సదరు ఋణగ్రహీతలు మరియు హామీదారుల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క మిగతా బకాయిని రాబట్టుకొనుటకు ది.26-12-2025న ఉ॥ 11-00 గం. నుండి మ. 1.00 గం. మధ్య ఈ-వేలంలో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది లానే" ప్రాతిపదికన విక్రయించబడును. ఋణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి సొమ్ము, స్థిరాస్తి సంక్షిప్త వివరం మరియు తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు, స్వాధీనత రకం, రిజర్వు ధర మరియు ధరావత్తు మరియు పెంపుదల దిగువనీయబడినవి.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదారులు /తనఖాదారుల పేరు	తేదీ & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	స్వాధీనం తేది & విధం	శ్రీ చల్లా అచ్చి రెడ్డి గారికి చెందిన ఆస్తి వివరాలు	ఎర్నెస్టు మనీ డిపాజిట్ వివరాలు (ఇఎండి) వివరాలు	వేలం జరిగే తేది & సమయం	సంప్రదించవలసిన వ్యక్తి మరియు తనిఖీ తేది
1). చల్లా అచ్చి రెడ్డి, తండ్రి: రామ కృష్ణ రెడ్డి, డి.నెం. సి6, జిల్లా పరిషత్ క్వార్టర్స్, డి.ఐ.జి. బంగ్లా రోడ్డు, నగరంపాలెం, గుంటూరు - 522004. 2). చల్లా అన్నం జానకి దుర్గా భవాని, భర్త: చల్లా అచ్చి రెడ్డి, డి.నెం. సి6, జిల్లా పరిషత్ క్వార్టర్స్, డి.ఐ.జి. బంగ్లా రోడ్డు, నగరంపాలెం, గుంటూరు - 522004. 3). మైనేని బాల కోటేశ్వర రావు, తండ్రి: జయ రామయ్య, ఫ్లాట్ నెం. బి1, జెడ్.పి. క్వార్టర్స్, ఎన్.వి. బంగ్లా రోడ్డు, నగరంపాలెం, గుంటూరు - 522004.	చెల్లించాల్సిన మొత్తం రూ. 46,34,282/- (అక్షరాలా నలభై ఆరు లక్షల ముప్పై నాలుగు వేల రెండు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు, చట్టపరమైన మరియు అన్ని ఇతర ఖర్చులతో సహా. క్రింద లోన్ అకౌంట్ నెం. GNTR4TF1803260003 డిమాండ్ నోటీసు తేదీ.24.01.2023.	10-05-2023 భౌతిక స్వాధీనం ఏవైనా ఎన్‌కంబ్రెన్స్‌లు: లేవు ఆస్తుల అమ్మకానికి ఉద్దేశించిన ప్రకటన తేదీ: 06.09.2025	గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, గతంలో చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ ఏరియా, అంకిరెడ్డిపాలెం హెచ్/ఓ. మరియు ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ పరిమితులల్లో ఉన్న అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం. 892/2సి, రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం. 892-2/సి1 లోని మొత్తం ఎకరా 1.32 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో దక్షిణ వైపున ఉన్న ఎకరా 0.31436 సెంట్ల విస్తీర్ణం నుండి పశ్చిమ వైపున గల 600 చదరపు గజాలు లేదా 501.66 చదరపు మీటర్ల ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: చల్లా వెంకట సత్యనారాయణ రెడ్డి గారి భూమి-50 అడుగులు, దక్షిణం: 25 అడుగుల వెడల్పు రోడ్డు-108 అడుగులు, పడమర: నవులూరి వెంకట రత్నం గారి భూమి-50 అడుగులు, ఉత్తరం: రావిళ్ళ వెంకటయ్య మరియు దొడ్డ రత్నం గారి భూమి-108 అడుగులు. పైన పేర్కొన్న విధంగా, 600 చదరపు గజాలు లేదా 501.66 చదరపు మీటర్ల ఖాళీ స్థలం మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. నల్లపాడు వారి డాక్యుమెంట్ నెం. 6829/2017 కి అనుగుణంగా ఉంది.)	క్రింద ఇక్కడ వివరించిన ఖాతా వివరాలకు DD ద్వారా జమ చేయాల్సిన ఇఎండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట బ్యాంక్ పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి: బాంద్రా, కుర్లా కాంప్లెక్స్, ముంబాయి -400710 అకౌంట్ నెం. 230010200005265 IFSC కోడ్ : UTIB0000230	26.12.2025 సమయం: ఉ. 11.00 గం.ల నుండి మ. 1.00 గం.ల వరకు	అధీకృత అధికారి: శ్రీ ఎం. కాశీవీరాంజనేయులు, సెల్ నెం: 9885888929. పి. బాషా సెల్ నెం: 9059819351. కస్టమర్ కేర్: 022-40081572 ఆస్తి తనిఖీ చేయు తేది: 23.12.2025, సమయం: ఉ.11.00 గంల నుండి సా. 5.00 గం. వరకు

రిజర్వ్ ధర: రూ. 54,00,000/- ధరావత్తు మొత్తం: రూ. 5,40,000/-
బిడ్ పెంపుదల: రూ. 25,000/- మరియు అలాంటి గుణిజాలలో గల పెంపుదల, ధరావత్తు సమర్పించుటకు చివరి తేది: 24.12.2025, సమయం : ఉ. 10 గం నుండి సా. 5 గం.ల వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద చట్టబద్ధ ప్రకటన

ఈ-వేలం తేది అనగా ఈ-వేలం ప్రకియ ప్రారంభమైనప్పుడు లేదా ముందు తేది. 26-12-2025 లోగా పైన తెలిపిన మొత్తములో పాటు చెల్లింపు తేదీ నాటికి వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవాల్సిందిగా లేని యెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులకు తెలియజేస్తున్నాము.
ఆసక్తిగల బిడ్డర్‌లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఈ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి. మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి శ్రీ గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం. 9833922941, శ్రీ గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, ఎం. కాశీవీరాంజనేయులు, సెల్ నెం: 9885888929 నందు సంప్రదించగలరు.
మరే ఇతర ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ "శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్" యొక్క వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింక్ https://www.shriramfinance.in/auction ను చూడండి.
ప్రదేశం : గుంటూరు, తేదీ: 25.11.2025. సం/- (అధీకృత అధికారి)

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఏ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు - 522034. మరియు బ్రాంచి ఆఫీస్ మెయిన్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు-2.

శ్రీమతి చిక్కం చిన్నమ్మ గారికి చెందిన స్థిరాస్తుల 2వ వేలం అమ్మకపు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) నందలి నిబంధనలతో చదువకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ, ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడిన / ఛార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు 'శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్' (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీన పర్చుకోబడినవి మరియు పట్టికలో ఇవ్వబడిన విధంగా సదరు ఋణగ్రహీతలు మరియు హామీదారుల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క మిగతా బకాయిని రాబట్టుకొనుటకు ది.26-12-2025న ఉ॥ 11-00 గం. నుండి మ. 1.00 గం. మధ్య ఈ-వేలంలో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది లానే" ప్రాతిపదికన విక్రయించబడును. ఋణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి సొమ్ము, స్థిరాస్తి సంక్షిప్త వివరం మరియు తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు, స్వాధీనత రకం, రిజర్వు ధర మరియు ధరావత్తు మరియు పెంపుదల దిగువనీయబడినవి.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదారులు /తనఖాదారుల పేరు	తేదీ & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	స్వాధీనం తేది & విధం	చిక్కం చిన్నమ్మ గారికి చెందిన ఆస్తి వివరాలు	ఎర్నెస్టు మనీ డిపాజిట్ వివరాలు (ఇఎండి) వివరాలు	వేలం జరిగే తేది & సమయం	సంప్రదించవలసిన వ్యక్తి మరియు తనిఖీ తేది
1). చిక్కం శ్రీనివాస రావు, తండ్రి: కోటేశ్వర రావు, డి.నెం. 26-47-423, నల్లకుంట మెయిన్ రోడ్డు, నల్లపాడు రోడ్డు, గుంటూరు - 522004. 2). చిక్కం చిన్నమ్మ, భర్త: శ్రీనివాస రావు, డి.నెం. 26-47-423, నల్లకుంట మెయిన్ రోడ్డు, నల్లపాడు రోడ్డు, గుంటూరు - 522004. 3). పడిగి చరణ్ తేజ, తండ్రి: నాగరాజు, డి.నెం. 3-24, నారాకోడూరు క్వారీ దగ్గర, జి.డి. ఆయిల్ ఫ్యాక్టరీ, నారాకోడూరు, తెనాలి (పోస్ట్), గుంటూరు జిల్లా.	చెల్లించాల్సిన మొత్తం రూ. 30,67,676/- (అక్షరాలా ముప్పై లక్షల అరవై ఏడు వేల ఆరు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే) వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు, చట్టపరమైన మరియు అన్ని ఇతర ఖర్చులతో సహా. క్రింద లోన్ అకౌంట్ నెం. GNTR4TF2103240007 డిమాండ్ నోటీసు తేదీ.24.01.2023.	19-05-2023 భౌతిక స్వాధీనం ఏవైనా ఎన్‌కంబ్రెన్స్‌లు: లేవు ఆస్తుల అమ్మకానికి ఉద్దేశించిన ప్రకటన తేదీ: 11.09.2025	గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, కొత్త గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా లిమిట్స్, నల్లపాడు గ్రామం, డి.నెం. 152/1 లోని మొత్తం 155 చదరపు గజాలలో పశ్చిమ వైపున గల 77.7 చదరపు గజాలు లేదా 64.96 చదరపు మీటర్ల ఇంటి స్థలం. ఆ స్థలంలో ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు, అలాగే ఏ.సి.సి. షీట్ రెండవ అంతస్తు తో కూడిన భవనం, డోర్ నెం. 26-47-254 మరియు అసెస్మెంట్.నెం. 1021120129. హద్దులు: తూర్పు: చిక్కం రాఘవయ్య గారి ఆస్తి-25.6 అడుగులు, దక్షిణం: రోడ్డు-27.6 అడుగులు, పడమర: బబ్బూరి రామయ్య మొదలైన వారి ఆస్తి-25.6 అడుగులు, ఉత్తరం: బాతుల అంకమ్మ రావు గారి ఆస్తి-27.6 అడుగులు. పైన పేర్కొన్న విధంగా, 77.7 చదరపు గజాలు లేదా 64.96 చదరపు మీటర్ల ఇంటి స్థలం, దానిపై ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు, ఏ.సి.సి. షీట్ రెండవ అంతస్తు భవనం, డోర్ నెం. 26-47, 254 మరియు అసెస్మెంట్ నెం. 1021120129 మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. నల్లపాడు వారి డాక్యుమెంట్ నెం. 4421/2020 కి అనుగుణంగా ఉంది.)	క్రింద ఇక్కడ వివరించిన ఖాతా వివరాలకు DD ద్వారా జమ చేయాల్సిన ఇఎండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట బ్యాంక్ పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి: బాంద్రా, కుర్లా కాంప్లెక్స్, ముంబాయి -400710 అకౌంట్ నెం. 230010200005265 IFSC కోడ్ : UTIB0000230	26.12.2025 సమయం: ఉ. 11.00 గం.ల నుండి మ. 1.00 గం.ల వరకు	అధీకృత అధికారి: శ్రీ ఎం. కాశీవీరాంజనేయులు, సెల్ నెం: 9885888929. పి. బాషా సెల్ నెం: 9059819351. కస్టమర్ కేర్: 022-40081572 ఆస్తి తనిఖీ చేయు తేది: 23.12.2025, సమయం: ఉ.11.00 గంల నుండి సా. 5.00 గం. వరకు

రిజర్వ్ ధర: రూ. 33,30,720/- ధరావత్తు మొత్తం: రూ. 3,33,072/-
బిడ్ పెంపుదల: రూ. 10,000/- మరియు అలాంటి గుణిజాలలో గల పెంపుదల, ధరావత్తు సమర్పించుటకు చివరి తేది: 24.12.2025, సమయం : ఉ. 10 గం నుండి సా. 5 గం.ల వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద చట్టబద్ధ ప్రకటన

ఈ-వేలం తేది అనగా ఈ-వేలం ప్రకియ ప్రారంభమైనప్పుడు లేదా ముందు తేది. 26-12-2025 లోగా పైన తెలిపిన మొత్తములో పాటు చెల్లింపు తేదీ నాటికి వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవాల్సిందిగా లేని యెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులకు తెలియజేస్తున్నాము.
ఆసక్తిగల బిడ్డర్‌లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఈ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి. మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి శ్రీ గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం. 9833922941, శ్రీ గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, ఎం. కాశీవీరాంజనేయులు, సెల్ నెం: 9885888929 నందు సంప్రదించగలరు.
మరే ఇతర ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ "శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్" యొక్క వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింక్ https://www.shriramfinance.in/auction ను చూడండి.
ప్రదేశం : గుంటూరు, తేదీ: 25.11.2025. సం/- (అధీకృత అధికారి)

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అంతర్గత డ్రైయిన్‌లను శుభ్రం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల వారీగా ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో ఖచ్చితంగా తమకు కేటాయించిన ప్రాంతంలో అంతర్గత డ్రైయిన్లను శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మంగళవారం బ్రాడీపేట, లక్ష్మీపురం, అరండల్‌పేట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రైయిన్లలో పూడిక తీయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి సచివాలయం పరిధిలో డ్రైయిన్ల శుభ్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే ఎస్ఎస్ వారీగా 5 గ్రాస్ కటింగ్ మెషిన్లను కేటాయించామని, వాటి ద్వారా డ్రైయిన్ల వెంట గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. లాడ్జి సెంటర్ నుంచి బ్రాడీపేట 14వ అడ్డరోడ్ వరకు రోడ్డుకి ఇరువైపులా నూతన డ్రైయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అరండల్‌పేట మెయిన్ రోడ్డులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణ పనులను పరిశీలించి, రోడ్డు విస్తరణకు అంగీకారం తెలిపిన భవనాలను తొలగించాలన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇన్‌ఛార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, డీఈఈ సతీష్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ ప్రసాద్, కార్పొరేటర్ ఈ.వెంకటకృష్ణ, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



బ్రాడీపేటలో మురుగు కాలువలో తీస్తున్న పూడికను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

విద్యలో కళలు కూడా భాగం కావాలి

● డాక్టర్ నన్నపనేని మంగాదేవి

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒక్కటే కాదని, కళలు కూడా అందులో భాగం కావాలని శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి అన్నారు. శ్యామలనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి లలిత కళ ఉత్సవ పోటీలు ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులకు కవిత, కథ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ బాలలు సున్నిత భావాలతో ఎదిగి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. వచ్చే నెల 10వ తేదీన రాష్ట్ర స్థాయి బృందగానం, గాత్రం, వాయిద్య పోటీలు నిర్వహిస్తామని విజేతలకు డిసెంబరు 28వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

లయోలా స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని లయోలా స్కూలుకు ఎంతో ఘన చరిత్ర ఉందని పలనాడు డైలీ పాస్టోరల్ సర్వీస్ వ్యవస్థాపకుడు, అమరావతి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాస్ అన్నారు. అటువంటి చరిత్ర కలిగిన పాఠశాలలో విద్యను అభ్యసించటం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. మంగళవారం నల్లపాడు లయోలా స్కూల్లో బాలల దినోత్సవం, పాఠశాల 60వ సంవత్సర వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈదర శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, ఉన్నత స్థాయికి ఎదిగి స్కూలుకు గుర్తింపు తేవాలన్నారు. గౌరవ అతిథి రామనాథ్ పఠాని అప్పన్ మాట్లాడుతూ దేశాన్ని నడిపించే బాధ్యత భావి భారత పౌరులైన విద్యార్థులపై, వారికి విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులపైనే ఉందని నా దృఢ విశ్వాసం అన్నారు. కార్యక్రమంలో ఈదర శ్రీనివాస్ సతీమణి ఈదర గీత లక్ష్మి, రామనాథ్ పఠాని అప్పన్ సతీమణి కళ్యాణి పఠాని అప్పన్, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఈదర శ్రీనివాస్ తదితరులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పికిల్ బాల్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ సభ్యులు

గుంటూరు (తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో జిల్లా పికిల్ బాల్ సంఘం సహకారంతో డిసెంబరు 6, 7 తేదీల్లో పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనూరాధ, కార్యదర్శి ఎస్.వాణిశ్రీమారి తెలిపారు. స్థానిక జేకేసీ రోడ్డులోని క్లబ్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. స్థానిక హనుమాన్ నగర్, వీవీపీ 'పికిల్ హబ్'లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. అండర్ 14, 16, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో మిక్స్‌డ్, సింగిల్, డబుల్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను డిసెంబరు 2వ తేదీలోపు 95533 35375 అనే నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి సందీప్, శ్రీధర్, టి.హరికిషన్, జేవీఎస్ ప్రసాద్, సుస్మిత, అశోక్, అరుణ్‌కుమార్, హనుమంతరావు, మధు స్మిత, అనిల్‌కుమార్, రవి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల అమలును ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. స్థానిక అరండల్‌పేట, కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను అడ్డుపెట్టుకుని మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లపై ఫార్మా యజమానులు పనిభారం మోపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ అబ్దుల్ సలీం మాట్లాడుతూ రానున్న రోజుల్లో కార్మికులందరూ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎం.వెంకటరత్నం, జె.అనిల్‌కుమార్, కే.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీల ఆర్థిక స్థిరత్వం, సమగ్రాభివృద్ధి, జీవనోపాధి మెరుగుదల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి పార్థసారథి, పీఎంజేవీకే అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పీఎంజేవీకే ద్వారా ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. మైనారిటీ మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించామని చెప్పారు. చౌత్రా సెంటర్‌లోని పాల ఆస్పత్రి వద్ద ఉమెన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలు లేదా మైనారిటీ బాలుర హాస్టల్ నిర్మాణానికి ప్రతిపాదించామని తెలిపారు. ఆటోనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, బొంగరాలబీడులోని వెల్ఫేర్ సెంటర్‌లో జీజీహెచ్‌కు అనుసంధానంగా భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. సద్భావన మండల్ ద్వారా కమ్యూనిటీ భవనం, గ్రంథాలయం వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ముందడుగు వేస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పీఎంజేవీకే కార్యక్రమం ద్వారా పనులు ప్రారంభించేందుకు తగిన రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని మైనారిటీ వెల్ఫేర్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

టౌన్ ప్లానింగ్ విభాగాన్ని క్రమబద్ధీకరించండి

● ఫిష్ ఆల్ట్రా మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయండి

● కమిషనర్‌కు వినతిపత్రం అందించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో టౌన్ ప్లానింగ్ విభాగాన్ని క్రమబద్ధీకరించాలని, సచివాలయ వ్యవస్థపై పటిష్ట చర్యలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులును తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. కమిషనర్ ఛాంబర్ లో మంగళవారం ఈ మేరకు ఎమ్మెల్యే నసీర్ వినతి పత్రం అందించారు. అక్రమ కట్టడాలు, అనుమతులు లేని భవనాలు, ఖాళీ స్థలాల విషయంలో మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పొన్నూరు రోడ్డులో ఏర్పాటు చేయదలచిన డాగ్స్ స్టెరిలైజేషన్ సెంటర్‌పై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తూర్పు నియోజకవర్గంలో ఫిష్ అల్ట్రా మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం నిర్వహిస్తోన్న ఫిష్ మార్కెట్లో సరైన స్థలం లేక ప్రజలతోపాటు వ్యాపారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. తాను సచివాలయ ఆకస్మిక తనిఖీకి వెళ్ళినప్పుడు రిజిస్టర్ల నిర్వహణ లోపం, సిబ్బంది అలసత్వం గుర్తించామని తెలిపారు. సచివాలయ వ్యవస్థ లోపాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సరిదిద్దాలని కోరారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ వి అనురాధ తదితరులు

యువజనోత్సవాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రాడీపేట లోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేదీన జరిగిన యువజన ఉత్సవాల్లో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనూరాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రథమ స్థానం, విజ్ఞానం, సాంకేతికత ప్రాజెక్టుల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. చిత్రలేఖనంలో ప్రథమ స్థానం పొందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ యశ్వంత్ తదుపరి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో మేఘన తదితరులు అభినందించారు.

బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గుంటూరు(క్రీడలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, పార స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ ఎంపికలు జరగనున్నాయి. ఆసక్తి గల క్రీడాకారులు 26న బీఆర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి అఫ్రోజ్‌ఖాన్, శిక్షకుడు లోహిత్‌కుమార్‌ను సంప్రదించాలని కోరారు.

శ్రీమద్భగవద్గీతపై ప్రవచనాలు



ప్రవచనం చేస్తున్న చిన్మయమిషన్ సువీరానందస్వామి

గుంటూరు(తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం శ్రీమద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్షసన్యాస యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయమిషన్ సువీరానందస్వామి ప్రవచిస్తూ అగ్ని పొగచే ఆవహించబడినట్లు కర్మలన్ని ఏదైనా ఒక దోషంతో కూడి ఉంటాయని, ప్రాపంచిక విషయాలపై ఆసక్తి లేనివారు, స్పృహరహితులు, అంతఃకరణాన్ని జయించిన వారు సాంఖ్యాయోగం ద్వారా పరమశ్రేష్ఠమైన నైష్కర్మ సిద్ధిని పొందుతారని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి తెలిపారని అన్నారు.

సీఐ సతీశ్ మృతి కేసు విచారణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హనుమంతరావు, పాల్గొన్న బీసీ, ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు (తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ మృతి కేసు విచారణను వేగవంతం చేయాలని యునైటెడ్ బీసీ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు డిమాండ్ చేశారు. స్థానిక అమరావతి రోడ్డు, ఎస్టీ, ఎస్సీ కమ్యూనిటీ భవన్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాయితీ కలిగిన అధికారి అనుమానాస్పదంగా చనిపోవడం బాధాకరమన్నారు. సతీశ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. యునైటెడ్ బీసీ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి లలిత్ కుమార్ మాట్లాడుతూ బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మదాసు రంగనాయకులు, చిరతనగండ్ల వాసు, జయసుధ, ఎంప్లాయీస్ జేఏసీ కార్యదర్శి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలు నాశనం చేసుకోవద్దు

● జోనల్ కో-ఆర్డినేటర్ కవిత

గుంటూరు విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ ఎం.కవిత విజ్ఞప్తి చేశారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర నగర్‌లోని ప్రభుత్వ మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాలు-ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గంజాయి, బ్రౌన్‌షుగర్, హెరాయిన్, కొకైన్ వంటి వాటికి బానిసలై కొంతమంది తమ జీవితాలను దుర్భరంగా మార్చుకొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం

● 1న పోలీసు అధికారులతో సమీక్ష

● నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే రామాంజనేయులు తనిఖీ

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేవని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన నల్లపాడు సీఐ వంశీధర్‌తో సమావేశమై స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల సమస్యలపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారన్నారు. ఆస్తుల విధ్వంసం, కబ్జాలు వంటి నేరాలతో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో గడిచిన 17 నెలల్లో శాంతిభద్రతలన్నీ అదుపులోకి వచ్చాయన్నారు. వచ్చేనెల 1న సాయంత్రం నాలుగు గంటలకు తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నల్లపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు సీఐలతో శాంతి భద్రతలతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్లో పెండింగ్ కేసులు దర్యాప్తులో ఉన్న కేసులు వంటి వాటి గురించి ఆయా సీఐలతో సమీక్షించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వెంగళాయపాలెం, అడవి తక్కెళ్ళపాడు గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పక్కన సీఐ వంశీధర్, వెంకటేశ్వరరావు తదితరులు

కూతురు సహా తల్లి అదృశ్యం



నాగమణి (ఫైల్)

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వసంత రాయపురం దీన్ దయాల్ కాలనీకి చెందిన సిరిగిడి నాగమణి(33) అనే మహిళ తన కూతురుతో సహ అదృశ్యమైంది. భర్త వెంకట్‌తో విభేదాల కారణంగా నాగమణి కొంతకాలంగా తన తల్లి చిలకా ఆంధోనమ్మ వద్ద తన కూతురుతో కలసి ఉంటోంది. తల్లితోపాటు పూల వ్యాపారం చేస్తోంది. అయితే ఈనెల 18న అర్ధరాత్రి నాగమణి తన కూతురు లక్ష్మీ ప్రియ(15)ను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తల్లి ఆంధోనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి ఎస్ఐ నరసింహ దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగిని వేధించిన హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్‌పై కేసు

తన కింద పని చేసే మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురి చేసిన మేనేజర్‌పై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. లక్ష్మీపురంలో గల స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో షరీఫ్ అనే వ్యక్తి మేనేజర్‌గా పని చేస్తుంటాడు. అందులో పని చేసే దివ్య అనే ఉద్యోగిని నెలరోజులుగా షరీఫ్ వేధిస్తున్నాడు. దీంతో ఆమె పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోగస్ బిల్లులపై విచారణ

● సాంఘిక, సంక్షేమశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ

గుంటూరు (విద్య) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళాశాల వసతి గృహాల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకుండా బోగస్ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల ఆరో తేదీన ఆంధ్రజ్యోతిలో "తినకుండానే కడుపు నిండింది"అనే శీర్షికతో కథనం వెలువడిన విషయం తెలిసిందే. మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లా సమీపంలో ఉన్న రెండు కళాశాలల హాస్టల్‌లో ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బోగస్ బిల్లులు పెట్టి రూ.45లక్షల నిధులు డ్రా చేశారని, దీనికి సాంఘిక సంక్షేమశాఖలోని ఉన్నతాధికారి ఒకరు సహకారం అందించారని ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఏడో తేదీన "సంక్షేమంలో సంక్షోభం" అనే శీర్షికన సాంఘిక సంక్షేమ శాఖలో అక్రమాలపై, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నిర్లక్ష్యంపై ఆంధ్రజ్యోతిలో మరో కథనం వెలువడింది. ఆయా కథనాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నివేదిక అందజేయాలని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్య నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి కె.శ్రీనివాస శిరోమణికి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సంక్షేమంలో సంక్షోభం
● విద్యార్థులను పట్టించుకోని అధికారులు
● ఓ విద్యార్థిని అదృశ్యం..
● నెలరోజుల తర్వాత గుర్తింపు
వసూళ్లు.. వేధింపులు
సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



దివ్యాంగ బాధితుల వద్దకు వెళ్లి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మహిళల సమస్యలు పరిష్కారమైతేనే సంతృప్తి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలోని మహిళల సమస్యలు పరిష్కారమైనప్పుడే తనకు సంతృప్తి అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రతి మహిళతో ఎమ్మెల్యే విడివిడిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఆరు వారాలలో మొత్తం 300కు పైగా మహిళల నుంచి వినతులు స్వీకరించగా, వాటిలో దాదాపు 200 వినతులకు ఇప్పటికే సమాధానాలు ఇవ్వడం, సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార దిశగా తీసుకెళ్లడం జరిగినట్లు తెలిపారు. మిగిలిన పెండింగ్ గ్రీవెన్సులను కూడా క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేసుకుంటూ మహిళల కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వేదికగా గ్రీవెన్స్ డే ఒక మంచి ఆదరణ లభిస్తోందని అన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులతో ఈయూ రాష్ట్ర నేతలు దామోదరరావు, నరసయ్య తదితరులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండాగా కృషి

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. యూనియన్ గుంటూరు-1 డిపో కార్యదర్శి రత్నాకర్ ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నుంచి రాష్ట్ర కార్యదర్శి కడియాల లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు కేడీ ఈశ్వర్, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి కేవీఎస్ నరసింహారావు, మాజీ జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు (టోపి శ్రీను) ఆధ్వర్యంలో 70 మంది ఉద్యోగులు ఎంప్లాయిస్ యూని యన్‌లో మంగళవారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో జరిగిన సమావేశంలో ఈయూలో చేరారు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య సమక్షంలో చేరారు. అనంతరం కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లం లింగయ్య భవన్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం యాజ మాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరింపచేస్తున్న ఏకైక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్, జిల్లా ముఖ్య ఉపాధ్య క్షుడు డీవీ స్వామి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శులు ఎన్‌వి కృష్ణారావు, బిటి వల్లి, జోనల్ అధ్యక్షులు వాకా రమేష్, మేడా హనుమంతరావు తదితరులున్నారు.

నవశక్తి అమ్మవారి దేవాలయంలో చోరీ

● అమ్మవారి బంగారు ఆభరణాలు, హుండీలో నగదు అపహరణ

పెదకాకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని సమీపంలోని నవశక్తి అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగింది. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెదకాకాని సమీపంలోని నవశక్తి అమ్మవారు దేవాలయంలో సోమవారం రాత్రి యథావిధిగా ఆలయానికి ఆలయ పూజారి బాలాజీశర్మ తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆయన తిరిగొచ్చి చూసేసరికి ఆలయ ప్రధాన తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా నవశక్తి అమ్మ వారి మెడలో నల్లపూసల గొలుసు, మంగళ సూత్రాలు, ముక్కుపుడకలు ఇలా మొత్తం 50 గ్రాములు బంగారాన్ని చోరీ చేసినట్లు గుర్తించారు. అలాగే హుండీలోని నగదు అపహరణకు గురైనట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. క్లూస్ టీం అధికారులు వేలిముద్రల సేకరించారు.

కళా రంగానికి వెంకటరత్నం చేసిన సేవలు స్ఫూర్తిదాయకం

● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు

గుంటూరు(తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రంగ స్థల కళా రంగానికి ఆచంట వెంకటరత్నం చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు అన్నారు. ఆచంట వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక అమరావతి రోడ్డు, అన్నదాన సమాజంలో ఉభయ రాష్ట్రాల మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆంధ్ర దేశాన దుర్యోధనుడి పాత్రకు వెంకటరత్నం పర్యాయపదంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. నాటక సమాజాన్ని ఏర్పాటు చేసి అనేక మంది కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చారని అన్నారు. అనంతరం పౌరాణిక నటులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, ఉప్పలపాటి సైదులును ఆయన ఘనంగా సత్కరించారు. ఆచంట ఆర్ట్స్ అకాడమీ, రావి నాంచారయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబటి మధుమోహన్ కృష్ణ, కంది గంగాధర్‌రావు, జూనియర్ డివి సుబ్బారావు, జవాజి వెంకటరావు, సీతారామయ్య అన్నదాన సమాజం కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు

29 వరకు రైతుల కోసం ప్రత్యేక సర్వే

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ అనుబంధ శాఖ సిబ్బందితో ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగే ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి సూచించారు. రైతన్న మీ కోసం కార్యక్రమం రెండో రోజు మంగళవారం వివిధ గ్రామాల్లో జరిగింది. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రైతులు మొబైల్లో యాప్‌లో చేసే విధానంను పరిశీలించారు. రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధితో అంచనావేసి రైతుల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం రైతన్న ఇంటింటా మీకోసం సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు.

హైడ్రోఫోనిక్స్ సాగుతో అధిక పోషకాలు

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్



ప్రసంగిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మట్టి లేకుండా హైడ్రోఫోనిక్స్ సాగు ద్వారా అధిక పోషకాలు పొందవచ్చని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ తెలిపారు. కళాశాలలో మంగళవారం హైడ్రోఫోనిక్స్ సాంకేతిక సాగు, పరికరాల వినియోగంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. మట్టి లేకుండా కేవలం నీటితో పంటలు పండించే విధానాలైన హైడ్రోఫోనిక్స్, ఏరోఫోనిక్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.డి.స్మిత్ మాట్లాడుతూ నీరు, ఎరువులు, పురుగుమందులు తక్కువగా వాడి పోషకాలు అధికంగా ఉండే ఆహారం పొందవచ్చన్నారు. ఇంటి ఆవరణలో చిన్న హైడ్రోఫోనిక్స్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసి మొక్కలు పెంచవచ్చని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఉన్న ఈ ఆధునిక టెక్నాలజి గురించి రైతులు తెలుసుకుని లబ్ధి పొందాలన్నారు. నీరు-నేల విభాగాధిపతి డాక్టర్ జి.రవిబాబు మాట్లాడుతూ హైడ్రోఫోనిక్స్‌లో ఆకుకూరలు, ఔషధమొక్కలు, కూరగాయలకు ఉపయోగించవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా ఇంటి బాల్కని, పెరటితోట, మిద్దెపైన, పాలీహౌస్‌లో కూడా పంటలు పండించవచ్చని తెలిపారు. హైడ్రోఫోనిక్స్ పరికరాలు, పంటలు పండించే విధానం, అనువైన పంటలు, మెలకువల గురించి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృపావతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి.ఎస్.రామిరెడ్డి, డాక్టర్.బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, ఎం.కారుణ్య, ఏవో పద్మతులసి పాల్గొన్నారు.

నేటి నుంచి 20 బోగీలతో వందేభారత్ రాకపోకలు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో గుంటూరు మీదుగా రాకపోకలు సాగించే సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి 20 బోగీలతో ప్రయాణించనుంది. ఇప్పటి వరకు ఈ రైలు 14 చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలతో ప్రయాణిస్తోంది. అయితే ప్రయాణికుల నుంచి లభిస్తోన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని రైల్వే శాఖ 20 భోగీలకు అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఇకపై 18 ఏసీ చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలతో రాకపోకలు సాగించనుంది. దీని వల్ల 312 ఏసీ చైర్‌కార్ సీట్లు అదనంగా ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి.

కామేశ్వరరావుకు భారతజ్యోతి పురస్కారం

రేపు ప్రదానం చేయనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తెనాలి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాలు సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం సేవలు అందించిన డాక్టర్ పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావుకు తెనాలి ప్రచురణలు సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్తంగా గురువారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా భారతజ్యోతి పురస్కారం అందించనున్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభలో శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్‌బాబు పాల్గొంటారు. విజయవాడలో 1940లో జన్మించిన కామేశ్వరరావు భౌతిక విజ్ఞాన శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్, ప్రఖ్యాతిగాంచిన సహా ఇనిస్టిట్యూట్‌లో న్యూక్లియర్ ఫిజిక్స్ అభ్యసించారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్శిటీలో బోధకునిగా పని చేసి, న్యూజెర్సీ రట్గెర్స్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. అక్కడ నల్లజాతీయుల హక్కుల కోసం ఉద్యమబాట పట్టిన ఆయనకు స్వదేశంలో బలహీన వర్గాల ప్రజలు పడుతున్న బాధలు గుర్తొచ్చాయి. జన్మభూమికి తిరిగి వచ్చిన ఆయన అప్పటి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ మోహన్‌కందా సలహాతో, విజయనగరం జిల్లాలోని గరివిడి, చీపురుపల్లి మండలాలను ఎంచుకున్నారు. ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా వారి కోసం నిరంతరం సేవ చేశారు. బడుగులు చదువు లేక మోసపోతున్నారని గ్రహించి వయోజన విద్యను చేపట్టి అక్షరాస్యులను చేశారు. ఆయన బడిలో ఎలాంటి పుస్తకాలు, హోమ్ వర్క్‌లు లేకుండా ఆటపాటలతో పాటలు నేర్పారు. ఆయన స్థాపించిన బాలబడి ఒడిస్సా రాష్ట్రంలో కూడా విస్తరించింది. పొదుపు సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఆయన ఆలోచన నుంచి అమలులోకి వచ్చినవే. రజకులు, క్షురకుల నివాసం కోసం కృషి చేసి వారి ఇళ్లకు విజయకాలనీ పేరు పెట్టి సంఘ సేవకుడు వావిలాల గోపాలకృష్ణయ్య చేత ప్రారంభించారు. ఆయన సేవలు తెలిసిన అప్పటి ఐఎఎస్ ఐఆర్ శంకరన్ కూడా సహకారం అందించి ఎక్కడా ఎలాంటి ప్రతిబంధకాలు ఎదురు కాకుండా చూశారు. పురస్కార సభకు డబుల్ హార్స్ సంస్థ ఎండి మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, కుమార్ పంప్స్ ఎండి కొత్త సుబ్రహ్మణ్యంలు చేయూత అందించారని క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కామేశ్వరరావు సేవల డాక్యుమెంటరీ వీడియో, పరిచయ సంచికను సభలో ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు

● అంతర్జాతీయ క్రీడాకారుడు భరత్ మహిపతి



వినుకొండటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆసక్తి కనబరిచిన విద్యార్థులకు ఎన్‌డీఏ ప్రభుత్వంలో బంగారు భవిష్యత్తు ఉంటుందని అంతర్జాతీయ క్రీడాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు భరత్ మహిపతి అన్నారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాల నందు 69వ ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ గేమ్స్ స్టేట్ మీట్ అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులతో వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటించారు. నెల్లూరు జిల్లాలోని గోనపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న ఆయన త్వరలో సౌత్ కొరియాలో జరగనున్న హేమర్త్రో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో 15, జాతీయ స్థాయిలో 40 పతకాలు సాధించానని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 3 శాతం క్రీడల్లో రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో క్రీడలకు ప్రాధాన్యం లేక పోవడంతో సుమారు 1,500మంది విద్యార్థులు పీఈటీ కోర్సులు పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. లోకేశ్ చొరవతో ఇటీవల జరిగిన డీఎస్సీ, పోలీస్ ఖాళీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందారన్నారు. ఇటీవల ప్రతి పాఠశాలకు సుమారు 67 క్రీడా సామగ్రి కిట్లను పంపిణీ చేయడంతో విద్యా ర్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు.. అవకాశం కలుగుతుందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తే రూ.5కోట్లు నగదు, ప్రభుత్వ భూమితో పాటు నివాస స్థలాన్ని ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం శుభపరిణామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు స్పాన్సర్ ఎంతో అవసరం ఉందని, దీంతో క్రీడల్లో అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు.

స్తంభాలు ఉన్నా రోడ్డేశారు



● అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించకుండా రోడ్డు వేస్తున్న దృశ్యం



స్తంభం ఉన్నచోట ఖాళీ వదిలేసి ఇలా రోడ్డు వేస్తున్నారు..

రోడ్డు వేస్తున్నప్పుడు మధ్యలో స్తంభాలు ఉంటే వాటిని తొలగించాలి. కానీ ఇది అందరూ చేస్తారు. కానీ గుంటూరు నగర పాలక సంస్థ అధికారులు అందుకు విరుద్ధంగా చేశారు. రోడ్డు వేయమన్నారు.. వేశాం.. అన్నట్లుగా పనులు పూర్తి చేశారు. సిమెంట్ రోడ్డు వేస్తున్నారని తెలిసినా స్తంభాలు తొలగించకపోవడం విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కాగా.. స్తంభాలు ఉన్నా కూడా సిమెంట్ రోడ్డు వేస్తూ పోవడం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి మరో నిదర్శనం. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెం వరకు వేస్తున్న సిమెంట్ రోడ్డులో ఇటువంటి ఈ పరిస్థితి నెలకొంది. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉన్నా వాటిని తొలగించకుండానే నగర పాలక సంస్థ అధికారులు సిమెంట్ రోడ్డు వేయడం ప్రజల్ని విస్మయానికి గురిచేస్తుంది.

-గుంటూరు
-ఆంధ్రజ్యోతి



ప్రకృతి సాగులో దిట్ట

● రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న నాగేశ్వరరావు



పంట గురించి కలెక్టర్ కృతికా శుక్లాకు తెలియజేస్తున్న రైతు నాగేశ్వరరావు

నాగిరెడ్డిపాలెం (బెల్లంకొండ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేని ఉత్పత్తులు అందిస్తూ, ప్రకృతి సాగువైపు రైతులను చైతన్య పరుస్తున్నారు రైతు కొత్తపల్లి నాగేశ్వరరావు. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడంలో ఆయన విజయం సాధించారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఒకే పొలంలో కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, పూల సాగు సాగు చేస్తూ ఏడాది పొడవునా ఆదాయాన్ని అర్జిస్తున్నారు. ఆవు ఆధారిత జీవామృతం, ఘనజీవామృతం, నేమస్త్రంను స్వయంగా తయారు చేసుకుంటూ వాటిని పంటలకు వినియోగిస్తూ మంచి దిగుబడులను సాధిస్తున్నారు. అయన పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకి ఉండటం గమనార్హం. ఢిల్లీ, పుణె, హైదరాబాద్ ప్రాంతాలను నుంచి పరిశోధకులు, రైతులు బృందాలు వచ్చి నాగేశ్వరరావు చేపట్టిన ప్రకృతి సాగు క్షేత్రాన్ని సందర్శిస్తూ సాగులో మెళకువలను తెలుసుకుంటున్నారు. అయన సూచనలతో ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడం అయన సాధించిన విజయంగా అధికారులు పేర్కొంటున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నాగేశ్వరరావు రైతులకు ప్రేరణ ఇవ్వడంతో పాటు వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు.

● ప్రకృతి ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ

ప్రకృతి విధానంలో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రత్యేకంగా మార్కెట్‌లో విక్రయిస్తుండటమే ఇందుకు నిదర్శనం. ఈ ఉత్పత్తులకు మంచి ధర కూడా మార్కెట్‌లో లభిస్తుండటం ఈ సాగును ప్రోత్సహించేదిగా ఉంది. 2016లో నేను ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయం నా జీవితాన్నే మార్చేసింది. మా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం నాకు పెద్ద బలం. ఇకపై మరిన్ని విజయాలు సాధించాలని లక్ష్యంగా పని చేస్తున్నాను.

- రైతు నాగేశ్వరరావు





రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అనంతపురం, గుంటూరు జట్లకు కప్‌లు అందజేస్తున్న జంగా కృష్ణమూర్తి

ఎన్డీయే ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యం : జంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో గుంటూరు జిల్లా ఫస్ట్

వినుకొండటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ లయోలా పాఠశాలలో జరుగుతున్న 69వ అండర్ -17 బాలబాలికల అంతర జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 18 విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఓవలాల్ ఛాంపియన్ షిప్ బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు, బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించాయి. ఇదిలా ఉండగా అథ్లెటిక్స్‌లో మొత్తం 7 విభాగాల్లో పోటీలు నిర్వహించగా గుంటూరు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

ముగింపు కార్యక్రమానికి టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి నారా లోకేశ్ చొరవతో క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని విజయం వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, లగడపాటి వెంకట్రావు, డీసీ గంగినేని రాఘవ, జనసేన పార్టీ నాయకుడు నిశ్శంకర శ్రీనివా సరావు, ఫాదర్ అవినాష్, సిస్టర్ సిస్లీ, రాణితో పాటు పీఈటీ నాయ కులు శివశంకర్, చిరంజీవి, రాజేష్, కొండలు, అనంతపురం ఛాంపి యన్ షిప్ మేనేజర్ ఓబులేసు, కోచ్ నారాయణ పాల్గొన్నారు.

ఏపీ సీఆర్‌డీఏపై.. ఆసక్తి

● రెవెన్యూ ఉద్యోగుల డిప్యూటేషన్‌కు తెరిచిన తలుపులు
● ఇక్కడి కంటే 30 శాతం అదనపు జీతభత్యాలు
● విజ్ఞాపన లేఖలు పెట్టుకుంటోన్న సిబ్బంది

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయమైన జీతభత్యాలు... వారంలో ఐదు రోజుల పనిదినాలు... ఎనిమిది గంటల పని వేళలతో రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగులకు ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ) ఆహ్వానం పలుకుతోన్నది. ప్రస్తుతం జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో పని చేస్తూ పొందుతోన్న జీతం కంటే 30 శాతం అదనంగా శాలరీ వస్తుంది. దీంతో చాలామంది ఉద్యోగులు సీఆర్‌డీఏకి ఫారెన్ సర్వీసు కింద డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ప్లాన్ చేసుకొంటున్నారు. ఇప్పటికే కొంతమంది విజ్ఞాపన లేఖలు పెట్టుకొని ఇక్కడి నుంచి రిలీవింగ్ అయి రాజధానిలో నూతనంగా నిర్మించిన సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి జాయినింగ్ అయ్యారు. త్వరలో మరి కొంతమంది కూడా డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు సంసిద్ధమౌతోన్నారు.

ఏపీసీఆర్‌డీఏలో భూ విభాగం ఉన్నది. అలానే తుళ్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ యూనిట్లు ఉన్నాయి. మరో వైపు సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో అడ్మిన్ సెక్షన్ ఏర్పాటైంది. వీటన్నింటిలో డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులకు దాదాపుగా 30 వరకు పోస్టుల ఖాళీలున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ల్యాండ్ పూలింగ్ యూనిట్లు దాదాపుగా ఖాళీ అయ్యాయి. అప్పటివరకు ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహించిన అధికారులంతా వేరే జిల్లాలకు వెళ్లిపోయారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఆర్‌డీఏలో కార్యకలాపాలు జోరందుకొన్న తర్వాత మళ్లీ ఫారెన్ సర్వీసు కింద డిప్యూటేషన్‌పై వచ్చేందుకు రెవెన్యూలోని వివిధ హోదాలు కలిగిన అధికారులు ఆసక్తి చూపుతున్నారు.

ఇటీవల గ్రామ/వార్డు సచివాలయాల్లో రీ వ్యాపింగ్ జరిగినప్పుడు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కార్యదర్శులను సీఆర్‌డీఏ డిప్యూటేషన్‌పై తీసుకొన్నది. అలానే సర్వే విభాగం నుంచి కూడా కొందరిని నియమించుకొని పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇప్పుడు రెవెన్యూ నుంచి ప్రధానంగా డీటీ, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారులను ఆహ్వానిస్తోన్నది. లేఅవుట్ల అభివృద్ధి పనులు, రోడ్లు, నిర్మాణ రంగం ఊపందుకోవడం, మిగిలిపోయిన భూముల సేకరణ తదితర పనుల కోసం రెవెన్యూ అధికారుల అవసరం ఏర్పడింది. దీంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్ చేయాలని విజ్ఞాపనలు సీసీఎల్‌ఏకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏకి వెళ్లదలచిన అధికారులు కలెక్టర్లకు లేఖలు పెట్టుకొంటున్నారు. అక్కడి నుంచి ఫైలు సీసీఎల్‌ఏకి వెళ్లి ఆమోదం పొందిన తర్వాత ఇక్కడ రిలీవింగ్ అయి సీఆర్‌డీఏలో చేరాల్సి ఉన్నది. సీఆర్‌డీఏ ఆఫీసులో కార్పొరేట్ కార్యాలయాల తరహాలో క్యాబిన్‌లు, వాతావరణం ఉంటుంది. దీంతో రెవెన్యూ ఉద్యోగులు అక్కడికి వెళ్లి పని చేసేందుకు ఆసక్తి కనబరుస్తోన్నారు.

పీఏసీఎస్‌ల అక్రమాల బాధ్యులపై చర్యలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అక్రమాలు ప్రాథమిక విచారణలో తేలినట్లు జిల్లా సహకార అధికారి వీరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో మంగళవారం ప్రచురితమైన 'రైతుల సొమ్ము స్వాహా' పేరుతో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేయటంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 51 కింద విచారణ ఉత్తర్వులు అనుమతి కోసం కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ , కమిషనర్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలానే కురగల్లు పీఏసీఎస్‌లో 75 మంది డిపాజిట్‌లకు సంబంధించి రూ 8.50 కోట్లు , మంగళగిరి పీఏసీఎస్‌లో ఆరుగురి డిపాజిట్‌లకు రూ. కోటి 25 లక్షలు అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలినట్లు ప్రకటనలో వివరించారు. అయితే ఈ డిపాజిట్ల వివరాలు సంఘ ఆర్థిక లావాదేవీల పరిధిలోకి రానట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు.

పొగమంచు.. గమనించు



● జాతీయ రహదారులపై అధికంగా ప్రమాదాలు
● పరిమిత వేగం.. అధికారుల సూత్రం

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శీతాకాలం ప్రారంభమైంది. జనవరి ఉష్ణోగ్రతల గణాంకాలు.. ఈ ఏడాది నవంబరులోనే నమోదవుతున్నాయి. రహదారులను పూర్తిగా పొంగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటలైనా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ సమయంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుంది. డ్రైవర్లు అప్రమత్తంగా లేకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. రాష్ట్ర రోడ్డు భద్రతా విభాగం సైతం నవంబర్ - ఫిబ్రవరి మధ్య పొగమంచు కారణంగా ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ఇటీవల వెల్లడించింది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు సూచనలిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణం కలిసోస్తుందన్న.. కారణంగా వేకువ జామున 2 నుంచి ఉదయం 7 గంటల మధ్యలో.. వేగంగా వాహనాలను నడుపుతుంటారు. ఈ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని.. కుదిరితే వాహనదారులు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిలో గతేడాది నవంబరు - ఫిబ్రవరి మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేకువ జామున జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 18 మంది చనిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

వాహనాల నుంచి వెలుపడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా మారుతోంది. రహదారి ఐదారు మీటర్ల దూరం వరకు కనిపించని పరిస్థితి. దుమ్మూధూళి రేణువులపై గాలిలోని తేమ సాంద్రీకరణ చెంది.. పేరుకుపోయి అత్యధికంగా కనిపిస్తుంది. క్రషర్లు, పరిశ్రమలు, రైస్ మిల్లులు ఉన్న ప్రాంతాలతో పాటు ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల పరిసర ప్రాంతాలు మసకబారుతాయి. ఈ క్రమంలో

జాతీయ రహదారిలో జిల్లా వెంబడి దాదాపు 25పైగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సీసీ కెమెరాలు, శక్తివంతమైన లైటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

వేగ నియంత్రణ పాటిస్తూ.. వాహనదారులు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పొగమంచులో.. డ్రైవింగ్ చేసేప్పుడు వాహనాల హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, బ్రేక్ లైట్లు వేసుకోవాలి. స్పీడు కాదు ప్రాణాలే ముఖ్యమని ప్రతి వాహనదారుడు గుర్తించాలని సూచిస్తున్నారు.

వేగం, నిద్రమత్తు వీడాలి

రాత్రిళ్లు వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం, ఉదయం డ్రైవర్ల నిద్రమత్తు ప్రమాదాలకు కారణాలు.

డ్రైవింగ్‌లో నిద్ర వస్తే వాహనాన్ని ఆపి, కాస్త కునుకు తీస్తే సరిపోతుంది. టీ, గోరువెచ్చిన నీరు తాగి ముఖాన్ని శుభ్రంగా నీటితో కడుక్కోవాలి. కాసేపు ఇతరులతో మాట్లాడి నిద్ర మత్తును దూరం చేసుకోవాలి. టోల్ ప్లాజ్‌ల సమీపంలో ఉన్న విశ్రాంత గదులను డ్రైవర్లు వినియోగించుకోవాలి. జాతీయ రహదారి వెంబడి రోడ్డు సేఫ్టీ సిబ్బంది చేపట్టిన డ్రైవర్లకు ముఖం కడిగే కార్యక్రమంలో భాగం కావాలి.

గస్తీ పెంచుతున్నాం

శీతాకాలంలో రాత్రిళ్లు రహదారుల వెంబడి గస్తీ పెంచుతున్నాం. రోడ్ సేఫ్టీ సిబ్బందితో డ్రైవర్ల ముఖం శుభ్రం చేయిస్తున్నాం. తక్కెళ్లపాడు, మానససరోవరం వద్ద ఉన్న స్పీడ్ గన్‌లను అందుబాటులోకి తీసు కొస్తున్నాం. డీజీపీ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారిస్తాం.

- కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు

ఇవి పాటిద్దాం..

- మంచు తగ్గిన తరువాతే ప్రయాణించాలి.
- మరో డ్రైవరును ఉంచుకోవాలి.
- డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనం ఇవ్వొద్దు
- ఇంజిన్, టైర్లు కండిషన్‌లో ఉంచుకోవాలి
- ముందు అద్దాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- సర్వీస్ రోడ్లలో వేగాన్ని పూర్తిగా నియంత్రించాలి.
- రాత్రిళ్లు రహదారిపై సరుకు దిగుమతి, ఎగుమతి చేయకూడదు.
- అధికారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, ఇతర చిహ్నాలను గమనించాలి.
- జీబ్రా లైన్లను పరిశీలించాలి.
- మలుపుల్లో విధిగా హారన్ మోగించాలి.
- ఫాగ్ ల్యాంప్‌లను ఆన్ చేసుకోవాలి.

ఫ్యాషన్



వేడుకల్లో లెహంగా, శారీస్‌ను ఎంచుకోడానికి వెనకాడేవారు నిరభ్యంతరంగా షరారాలను ఎంచుకోవచ్చు. సౌకర్యం, స్టైల్‌కు పెద్ద పీట వేసే డిజైనర్ షరారాలు అన్ని వేడుకలకూ అనువుగా ఉంటాయి. తాజాగా ట్రెండ్ అవుతున్న వాటి మీద ఓ లుక్కేద్దాం!

షరారా షరారా



పండుగలు, పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు.. ఇలా అన్ని రకాల వినోదాల్లో ధరించడానికి వీలుండే దుస్తులు.. డిజైనర్ షరారాలు. ప్రస్తుతం ఇవి ట్రెండ్‌గా మారాయి. డిజైనర్లు ఆధునికత ఉట్టిపడే డిజైనర్ వెర్షన్లను రూపొందిస్తూ ఉండడంతో, కొత్త కొత్త హంగులతో, ఫ్యూజన్ స్టైల్స్‌తో షరారాలు మహిళల మనసులను దోచుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా వధువులు కూడా రిసెప్షన్స్, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్ల కోసం డిజైనర్ షరారాలనే ఎంచుకుంటూ ఉండడం చెప్పుకోదగిన విశేషం. జారుతున్నట్టు క నిపించే మెటీరియల్స్, రిల్యాక్స్‌డ్ ఫిట్టింగ్స్‌తో రూపొందుతున్నాయి కాబట్టి వీటిని ధరించడమూ సులభమే! ప్రత్యేకించి లెహంగాలతో పోలిస్తే షరారాలతో రెట్టింపు సౌకర్యం ఉంటుంది.

తాజా ట్రెండ్స్ ఇవే!

- ఎంబ్రాడిరీ, అద్దం పనితనం: సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీ, అద్దం పనితనంతో కూడిన షరాలు తాజా ట్రెండ్‌గా మారాయి
- ప్రింటెడ్ డిజైన్లు కూడా బాగా ఆదరణ పొందుతున్నాయి
- చందేరి, ఇతరత్రా తక్కువ బరువుండే వస్త్రాలతో రూపొందే షరారాలు ప్రత్యేకించి వేసవి వస్త్రాలుగా పేరు తెచ్చుకుంటున్నాయి
- సంప్రదాయ, సమకాలీన స్టైల్స్‌ను మేళవించి, రూపొందిస్తున్న డిజైనర్ షరారాలు ఆధునిక ఫ్యూజన్ ఛాయిస్‌గా పేరు తెచ్చుకుంటన్నాయి.



అదనపు హంగులు జోడించి...

షరారాలతో భారీ ఆభరణాలు చాలా బాగా నప్పుతాయి. ఈ దుస్తుల కోసం చాంద్‌బాలీ, కంగన్ లేదా కడా లాంటి ఆభరణాలు ఎంచుకోవచ్చు. చమ్కీ పనితనానికి రాళ్ల నగలు చక్కగా నప్పుతాయి. హైహీల్స్ లేదా బ్లంట్ హీల్స్ ధరించాలి.

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు చాకలి అనురాధ. నంద్యాల జిల్లా చింతకుంటలో జూనియర్ వెటర్నరీ అధికారి అయిన ఆమె.. తన సేవలకు గుర్తింపుగా 'జాతీయ గోపాలరత్న' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి నేడు అందుకోబోతున్నారు. "పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల్లో చైతన్యమే మార్గం" అంటున్న అనురాధను 'నవ్య' పలకరించింది.

ఈ అనురాధ గోపాల మిత్ర



"నా స్వస్థలం ప్రస్తుత నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామం. నా తల్లిదండ్రులు చాకలి లక్ష్మీదేవి, సుబ్బారాయుడు. వారిది రజక వృత్తి. పేదరికం వల్ల మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నేను పదో తరగతి వరకూ మా ఊరిలోనే చదువుకున్నాను. నంద్యాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. నా మేనమామ రవిశంకర్‌తో నా వివాహం అయింది. మాకు ఇద్దరు పిల్లలు... రిషిత, యోగీశ్వర్. నా భర్త ప్రోత్సాహంతో 2004లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాశాను. సుమారు 350 మంది పోటీ పడితే... ఎంపికైన ఆరుగురిలో నేనొకరిని. శిక్షణ తరువాత, 2006లో... బండి ఆత్మకూరులో కాంట్రాక్ట్ విధానంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. రెండేళ్ల తరువాత ఉద్యోగం రెగ్యులర్ అయింది. ఆ తరువాత గడివేముల మండలం బిలకలగూడూరులోని రూరల్ లైవ్ స్టాక్ యూనిట్‌లో (ఆర్ఎల్‌యూ) లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేశాను. 2019లో జూనియర్ పశువైద్యాధికారి (జేవీఓ)గా పదోన్నతి పొందాను. ఆరేళ్లపాటు మహానంది మండలం గోపవరంలో పని చేశాను.

'ట్రిపుల్-ఎస్ అనురాధ' అంటారు

ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'సెక్స్-సోర్టెడ్ సెమెన్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్' (ట్రిపుల్ ఎస్ఏఐ)' విధానాన్ని అమలు చేసింది. ఈ విధానం పాడి రైతులకు ఉపయోగకరం. దాని గురించి రైతుల్లో అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాను. ఎన్నో పశువులకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహించాను. మూడేళ్లలో 345 వరకూ మేలు జాతి ఆడ దూడలు నా పర్యవేక్షణలో జన్మించాయి. ఎక్కువ కృత్రిమ గర్భధారణలు నిర్వహించడంతో నన్ను మా శాఖలో 'ట్రిపుల్ ఎస్ అనురాధ' అంటారు. నేను అందించిన సేవలకు ఇలాంటి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. అలాగే... పశువులను సమయానుగుణంగా వాక్సినేషన్ లాంటి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టాను. ఈ ఏడాది జూన్ నెలలో గోస్పాడు మండలం చింతకుంటకు బదిలీపై వచ్చాను. విధుల్లో నేను అందించిన సేవలకు గుర్తింపుగా... 2021లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో, 2023లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాలను, ఈ ఏడాది ఆగస్టు 15న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు అందుకోబోతున్నాను.

వారి ప్రోత్సాహంతో...

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 'జాతీయ గోపాలరత్న' అవార్డులు ప్రదానం చేస్తుంది. మూడు కేటగిరీల్లో... ఒక్కొక్క దానికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది వీటికోసం 2,018 మంది పోటీ పడ్డారు. 'ఉత్తమ కృత్రిమ గర్భధారణ నిపుణుల విభాగం'లో నాకు మూడో స్థానం లభించినట్టు ఈ నెల 17న ప్రకటించారు. దాన్ని నేడు (బుధవారం) ఢిల్లీలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో అందుకోబోతున్నాను. ఈ పురస్కారంతో నంద్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని అందరూ చెబుతూ ఉంటే సంతోషంగా అనిపిస్తోంది. చదువులో నా తల్లిదండ్రులు, ఉద్యోగ ప్రయత్నంలో నా భర్త సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. ఉద్యోగపరంగా వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు ఎంతగానో ప్రోత్సహించడంతో.. విధుల్లో చురుకుగా పని చేసి, రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించగలిగాను. ఎక్కువ సంఖ్యలో కృత్రిమ గర్భధారణలకు దోహదం చేశాను. వాటన్నిటి ఫలితమే ఈ పురస్కారం. ఇదే స్ఫూర్తితో... భవిష్యత్తులో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాను."

• చదువుల గోపాలకృష్ణ
నంద్యాల

విజేత

సవాళ్లను స్వీకరించడం... అపజయాలను పాఠాలుగా మలుచుకోవడం... లక్ష్యం చేరేవరకు పట్టుదలగా ప్రయత్నించడం... ఇవే ఒక యోధుడిని తయారు చేస్తాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం... అనుపమా రామచంద్రన్. కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు వెనకడుగు వేయకుండా... క్లిష్ట సమయాల్లో ఒత్తిడికి చిత్తవకుండా... ఆత్మస్థైర్యంతో అందలాన్ని అందుకుంది. ఇటీవల ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్ గెలిచిన 23 ఏళ్ల అనుపమ... ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించి... నవ శకానికి నాంది పలికింది.



ఆమె సంకల్పం.. 'అనుపమా'నం

ఖతర్ రాజధాని దోహా... ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్... అంతిమ సమరం... ప్రత్యర్థి ఎంగ్‌ఆన్ యీ... మూడుసార్లు ప్రపంచ చాంపియన్. ఎన్నో ఏళ్లగా నెంబర్ వన్ ర్యాంకర్. కేవలం నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా ధైర్యాన్ని పరీక్షించే మ్యాచ్. చివరి ఫ్రేమ్. 2-2 వద్ద విజయం ఊగిసలాడుతోంది. అనుపమా రామచంద్రన్ చేతిలో క్యూ. నవచరిత రాయడానికి షాట్ దూరం. ఒక్క క్షణం ఆగి... ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒత్తిడిలోకి వెళ్లకుండా తనను తాను స్థిమితంగా ఉంచుకుంది. ఏకాగ్రతతో, పూర్తి నమ్మకంతో షాట్ కొట్టింది. బంతి పాకెట్‌లోకి దూసుకుపోయింది. ఆ ప్రాంతమంతా చప్పట్లు, జయజయ ధ్వానాలతో మార్మోగింది. భారత్‌లో మొట్టమొదటిసారి ఒక మహిళ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌గా అవతరించింది. అయితే ఈ గెలుపు అనుపమకు అంత సులువుగా దక్కలేదు. దీని వెనుక నిరంతర కృషి ఉంది. సడలని సంకల్పం ఉంది. దీనికి బలమైన పునాది 2015లో పడింది.

వేసవి క్యాంపుతో...

చెన్నైలో పుట్టి పెరిగిన అనుపమ కోరి స్నూకర్‌ను ఎంచుకోలేదు. ఆట మొదలుపెట్టేవరకూ దానిపై అసలు దాని గురించి తెలియదు. "అప్పుడు నాకు పదమూడేళ్లు. మా ఇంటికి దగ్గర్లో 'మైలాపూర్ క్లబ్' ఉంది. సెలవులు కావడంతో క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అక్కడ చెస్, స్నూకర్ మాత్రమే ఉన్నాయి. చెస్ ఇంట్లో ఆడుతూనే ఉంటాను కాబట్టి, స్నూకర్ నేర్చుకోవాలని అనుకున్నా. అంతే కాదు... ఆకుపచ్చని బోర్డు, రంగురంగుల బాల్స్, చేతిలో క్యూ... చూడగానే నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఎలా ఆడతారో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువైంది. క్యాంపులో చేరాక అందులో లీనమైపోయాను. కోచ్ లో... నా ప్రతిభను చూసి స్నూకర్ కొనసాగించమని చెప్పారు" అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న అనుపమ... వేసవి శిబిరం పూర్తవగానే ప్రొఫెషనల్ కోచింగ్‌లో చేరింది.

అందుకే ప్రత్యేకం

చిన్నప్పుడు కోచ్‌లు అనుపమలో గుర్తించినవి... సడలని ఏకాగ్రత, ఓపిక. సాధారణంగా ఆ వయసు పిల్లల్లో ఈ లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. వీటిని అలవర్చుకోవడానికి చాలామంది ఆటగాళ్లకు సంవత్సరాలు పడుతుందనేది శిక్షకుల మాట. అందుకే ఆమెను ప్రత్యేక ప్రతిభ గల అమ్మాయిగా పరిగణించారు. ఆ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు.



స్పోర్ట్స్ పెర్ఫార్మెన్స్ స్పెషలిస్టు, తన మామయ్య అయిన కె.నారాయణన్ మార్గదర్శకత్వంలో అనుపమ ఆటలో మరింత పరిణతి సాధించింది. ఆయన నేతృత్వంలో సాంకేతిక అంశాలను ఆకళింపు చేసుకుంది. వ్యూహాలు నేర్చుకుంది. క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎలా జయించాలో, మనోధైర్యంతో అడుగులు ముందుకు ఎలా వేయాలో తెలుసుకుంది. నిరంతర సాధనతో పరిపూర్ణ క్రీడాకారిణిగా తనను తాను తీర్చిదిద్దుకుంది.

మలుపు తిప్పిన గెలుపు

స్నూకర్, ఇంగ్లీష్ బిలియర్డ్స్‌లో ఎంతో పరిణతి సాధించిన అనుపమ... జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ అదరగొట్టింది. ఏకంగా ఎనిమిది జాతీయ జూనియర్ టైటిల్స్ నెగ్గిన ఆమె కెరీర్‌ను 2017లో రష్యాలో జరిగిన 'వరల్డ్ ఓపెన్ అండర్-16 స్నూకర్ చాంపయిన్‌షిప్' మలుపు తిప్పింది. అంచనాలు తలకిందులు చేస్తూ విజేతగా నిలిచింది. దాంతో అనుపమ సీనియర్ విభాగంపై కూడా దృష్టి పెట్టింది. 2023లో 'ప్రపంచ మహిళల అండర్ 21 స్నూకర్ టైటిల్ సాధించింది. మరుసటి ఏడాది 'యూఎస్ ఉమెన్స్ ఓపెన్'లో రన్నరప్‌గా నిలిచి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దాంతో ఈ ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. ఆమె కెరీర్ ఇదే అత్యున్నత ర్యాంక్.

ప్రపంచ చాంపియన్...

చిన్న వయసులోనే ఎన్నో మైలురాళ్లను అధిగమించిన అనుపమ... చదువును అశ్రద్ధ చేయలేదు. చెన్నైలోని 'విద్యామందిర్ సీనియర్ సెకండరీ స్కూల్'లో చదివిన ఆమె, ప్రస్తుతం వైష్ణవ్ మహిళా కళాశాలలో పబ్లిక్ పాలసీలో పీజీ చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీపడుతూనే... అటు ఆటను, ఇటు చదువును సమన్వయం చేసుకొంటోంది. ఇక ఈ నెల రెండో వారంలో దోహాలో జరిగిన 'ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్'లో టాప్ ర్యాంకర్‌ను ఓడించి నవ శకానికి నాంది పలికింది. భారత్‌ను చాంపియన్‌గా నిలబెట్టింది. ఈ గెలుపు ఆమెది మాత్రమే కాదు... ఈ క్రీడలో రాణించాలని కలలు కనే అమ్మాయిలు అందరిదీ. భారతీయ స్నూకర్‌ది. నిశ్శబ్దంగా, ఓపికగా, పట్టుదలగా, ఒక్కో అడుగు ముందుకు వేస్తూ... శిఖరాగ్రానికి చేరిన దృఢ సంకల్పానిది.

ముఖానికి నెయ్యి రాస్తే...

ఆరోగ్యంతోపాటు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖానికి నెయ్యి రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...



- వయసు పెరిగే కొద్దీ ముఖం మీద ముడుతలు, గీతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించేందుకు యాంటీ ఏజింగ్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు వాడేబదులు ముఖానికి నెయ్యి రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు చర్మానికి పోషణను అందించే ఎ, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం మృదువుగా కాంతివంతంగా మారుతుంది.
- నెయ్యిని ముఖానికి పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా వృత్తాకారంలో మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. చర్మకణాలు వృద్ధి పొందుతాయి. దీంతో చర్మానికి సహజసిద్ధమైన మెరుపుదనం చేకూరుతుంది. ముఖానికి మేకప్ అవసరం రాదు.
- వాతావరణ కాలుష్యం, ఎండ, దుమ్ము, ధూళి వల్ల ముఖం మీద మొటిమలు, మచ్చలు, దద్దులు, ట్యానింగ్ లాంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడు బయటి నుంచి రాగానే ముఖాన్ని గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుని కొద్దిగా పేరిన నెయ్యి రాసుకుంటే చాలు. మునుపటి నిగారింపు వచ్చేస్తుంది. నెయ్యిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి.
- రోజూ రాత్రి పడుకునేముందు ముఖానికి నెయ్యి రాసుకుంటూ ఉంటే చర్మం తేమతో నిండుతుంది. ముఖం ఛాయగా మెరుస్తుంది కూడా.
- చిన్న గిన్నెలో ఒక చెంచా నెయ్యి, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

విభిన్నం

87 ఏళ్ల వయసులో స్కూటర్ నడపడమే కాదు, షోలే సినిమాను తలపించేలా చెల్లిని వెంటేసుకుని మరీ రయ్యిన దూసుకుపోతున్నారు అహ్మదాబాద్‌కు చెందిన మందాకినీ షా. మహిళా మండళ్లు, పంచాయితీ సమావేశాలతో నిరంతరం బిజీ బిజీగా ఉండే మందాకిని, సమాజ సేవ గురించీ, స్కూటర్‌తో ఏర్పడిన అనుబంధం గురించి ఇలా వివరిస్తున్నారు...

బైకర్ బామ్మ..!

"నా పేరు మందాకినీ షా. నాకు 87 ఏళ్లు. చెల్లెలు ఉషతో కలిసి, స్కూటర్ మీద చక్కర్లు కొట్టడమంటే నాకు చాలా ఇష్టం. నేను అహ్మదాబాద్‌లోనే పుట్టి పెరిగాను. మేం ఐదుగురం అక్కాచెల్లెళ్లం. మాకొక తమ్ముడు కూడా ఉన్నాడు. అందర్లోకీ నేనే పెద్దదాన్ని కాబట్టి జీవితపాఠాలను ఎంతో ముందుగానే నేర్చేసుకున్నాను. స్వాతంత్రసమరయోధుడైన నాన్న, నా చిన్నతనంలో ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడాలని పరితపించేవారు. కానీ అందుకు సరిపడా డబ్బు మా దగ్గర ఉండేది కాదు. దాంతో వ్యాపారం చేయలేకపోయారు. అమ్మ ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఆమె కష్టాన్ని చూస్తూ పెరిగానేమో, వీలైనంత త్వరగా నా కాళ్ల మీద నేను నిలబడాలని నిర్ణయించుకున్నాను. అందుకే కాలేజీ చదువు వద్దనుకుని, బడి చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరిపోయాను. అలా 16వ ఏట బాలమందిర్‌లో టీచర్‌గా పని చేయడం మొదలుపెట్టాను.

సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ..

నాకు ఇంగ్లీషు అంతగా రాదు. కానీ జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల బలంగా ఉండేది. దాంతో సమాజ సంక్షేమ పథకాల్లో చేరిపోయాను. మహిళా మండళ్లను కలుస్తూ, పంచాయితీ సమావేశాల్లో పాల్గొంటూ మహిళా హక్కుల గురించి బోధించడం మొదలుపెట్టాను. అలా దుమ్ము లేచే రోడ్ల మీద వేర్వేరు చోట్లకు ప్రయాణాలు చేసే క్రమంలో, స్కూటర్, జీప్ నడపడం నేర్చేసుకున్నాను. ఆ తర్వాత ఒక సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనుక్కున్నాను. స్కూటర్ చేతిలో ఉంటే, ప్రయాణాలకు వెనకాడే పరిస్థితి ఉండదు. అయితే పెద్ద వయసులో ఒక మహిళ స్కూటర్ నడపడమన్నది ఆశ్చర్యకరమైన విషయమే! అందరూ వింతగా చూసేవారు. అక్కడితో ఆగితే ఫరవాలేదు. చాలా ఏళ్ల పాటు నన్నొక ప్రశ్నతో ఇబ్బంది పెట్టారు.

16 ఏళ్ల యువతిలా...

'మీకు పెళ్లి కాలేదా? మీరు విధవా?" అనే వాళ్ల ప్రశ్న నన్ను చాలా కాలం ఇబ్బంది పెట్టింది. వాళ్లకు.. ఒక ఒంటరి మహిళ, ముగియని కథ లాంటిది. కానీ నిజానికి నా కథ కాస్త ఆలస్యంగా మొదలైందనే విషయం వాళ్లకు తెలియదు. ఒకానొక సందర్భంలో నేను కూడా పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ మనం అనుకున్నట్టు సాగితే అది జీవితం ఎలా అవుతుంది? అందుకే జీవితంతో రాజీ పడిపోయాను. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికీ... 'అమ్మా మీరు స్కూటర్ ఎందుకు నడుపుతున్నారు?' అని అడుగుతూ ఉంటారు. ఆ ప్రశ్నకు చిరునవ్వే నా సమాధానం. స్కూటర్ నడుపుతున్నప్పుడు ముఖాన్ని స్పృశించే గాలి, నన్ను 16 ఏళ్ల యువతిననే భావనకు లోను చేస్తుందని ఎంతమందికి చెప్పను? వయసు నాలో సత్తువను తగ్గిస్తూ ఉండవచ్చు. కానీ మనసులో పట్టుదలను సడలించలేకపోయింది. నేనిప్పటికీ చెల్లి ఉషను వెంటబెట్టుకుని వేర్వేరు ఊర్లు తిరుగుతూ ఉంటాను. ప్రతిరోజూ స్నేహితులను కలుసుకుంటూ ఉంటాను. ఆటపాటలతో కాలక్షేపం చేస్తూ ఉంటాను. 80ల్లో ఉన్నాను కాబట్టి ఇక్కడితో నా కథ కంచికే అనుకుంటే పొరపాటు, సమాజం ఊహించని జీవితం జీవించాను. నా కథ ముగియడానికి ఇంకా ఎంతో సమయం మిగిలిఉంది."



బిజినెస్

గుంటూరు ● బుధవారం 26 నవంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,040 ▲	1,16,450 ▲	1,74,000 ▲
విజయవాడ	1,29,000 ▲	1,21,000 ▲	1,60,000 ▲
విశాఖపట్నం	1,29,090 ▲	1,14,700 ▼	1,74,000 ▲
రాజమండ్రి	1,27,040 ▲	1,16,450 ▲	1,57,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▼	1,15,830 ▼	1,61,600 ▼
ముంబై	1,25,120 ▲	1,14,610 ▲	1,56,320 ▲

మలబార్ గోల్డ్ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లిమిటెడ్ 15వ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. కంపెనీ మార్కెట్లోకి తెచ్చిన బ్రైడల్ రేంజి నగలు వైవిధ్యభరితమైన వివాహ సాంప్రదాయానికి అద్దం పడతాయి. ఈ ఏడాది కార్యక్రమం 10 మంది సెలబ్రిటీలు, 22 మంది వధువులను ఒకే వేదిక పైకి తెస్తుందని కంపెనీ చైర్మన్ ఎంపీ అహ్మద్ చెప్పారు. ఈ ఎడిషన్‌లో దేశానికి చెందిన భిన్న ప్రాంతాల వివాహ సాంప్రదాయాలకు అనుగుణమైన డిజైన్లున్నట్టు ఆయన చెప్పారు. అన్ని డిజైన్లు అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండడం కూడా ప్రత్యేకత అని, దీని వల్ల చెన్నైలో ఉన్న వధువు రాజస్తాన్ సాంప్రదాయానికి చెందిన పోల్కీ సెట్, ఢిల్లీకి చెందిన వధువు దక్షిణాదిలోని ఆలయ సాంప్రదాయానికి చెందిన డిజైన్లు ఎంపిక చేసుకోగలుగుతారని పేర్కొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ

హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	95
కర్నూలు	100	నెల్లూరు	100
విశాఖపట్నం	100	అనంతపురం	100
గోదావరి	103		

బంగారం రుణాలకు భారీ డిమాండ్

రూ.14.5 లక్షల కోట్లకు చేరిన మార్కెట్

కొత్తగా 3,000 ఎన్‌బీఎఫ్‌సీల బ్రాంచ్‌లు



న్యూఢిల్లీ: చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా, చిన్నమెత్తు బంగారం ఉంటే చాలు. ఏదో ఒక బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ దగ్గర కుదువ పెట్టి నాలుగు రాళ్లు అప్పుగా తీసుకుని సమస్య నుంచి బయటపడవచ్చు. బంగారం ధరల పెరుగుదలతో గత ఏడాది కాలంగా దేశంలోని గోల్డ్ లోన్ కంపెనీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా పెరిగిపోతోంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశంలోని గోల్డ్ లోన్ ఎన్‌బీఎఫ్‌సీలు బంగారం ఆభరణాలు, బంగారాన్ని హామీగా పెట్టుకుని ఇచ్చిన రుణాల విలువ రూ.14.5 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 36% ఎక్కువ. వచ్చే ఏడాది మార్చి నాటికి పసిడి రుణాల మార్కెట్ రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని ప్రముఖ పరపతి రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా.

మరింత డిమాండ్: మన దేశంలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు పసిడి ధర 60% పెరిగింది. ఇదే సమయంలో సూక్ష్మ రుణ సంస్థలు హామీ లేని రుణాలు ఇచ్చేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజలు, రైతులు, చిరు వ్యాపారులు గోల్డ్ లోన్ కంపెనీల వైపు చూస్తున్నారు. బంగారం ధర కూడా పెరగడంతో కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు బంగారం లేదా ఆభరణాల విలువలో 70 నుంచి 80% వరకు రుణాలుగా ఇస్తున్నాయి. వచ్చే ఏడాదీ ఇదే ట్రెండ్ కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం గోల్డ్ లోన్ మార్కెట్ ఎంత లేదన్నా 30 నుంచి 35% వరకు పెరుగుతుందని ఇక్రా అంచనా.

కొత్త శాఖలకు కసరత్తు

పసిడి రుణాలకు గిరాకీ పెరగడంతో ఎన్‌బీఎఫ్‌సీలు, గోల్డ్ లోన్ కంపెనీలు వచ్చే ఏడాది దాదాపుగా 3,000 వరకు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో 1,800 బ్రాంచ్‌లను ముత్తూట్ ఫైనాన్స్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, బజాజ్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి అగ్రశ్రేణి ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలే ఏర్పాటు చేయనున్నాయి. పెరుగుతున్న మార్కెట్ అవకాశాలను దొరకపుచ్చుకునేందుకు ఇపుడు ఎల్ అండ్ టీ ఫైనాన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్ వంటి ఎన్‌బీఎఫ్‌సీలూ సిద్ధమవుతున్నాయి. జియో ఫైనాన్స్ కూడా త్వరలో గోల్డ్ లోన్స్ మార్కెట్‌లో పాదం మోపుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద బులియన్ మార్కెట్ ర్యాలీ గోల్డ్ లోన్ కంపెనీల వ్యాపార విస్తరణకూ తోడ్పడుతోంది.



30 డాలర్లకు ముడిచమురు?

- డిమాండ్‌ను మించిపోనున్న సరఫరా
- జేపీ మోర్గాన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ: రాబోయే సంవత్సరాల్లో ముడిచమురు దిగుమతుల భారం నుంచి భారత్‌కు, ఇంధన ధరల పోటు నుంచి వాహనాదారులకు భారీ ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో 60 డాలర్ల ఎగువన కదలాడుతున్న బ్యారెల్ ముడిచమురు ధర.. క్రమంగా తగ్గుముఖం పట్టనుందని, 2027 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 30 డాలర్ల స్థాయికి దిగిరావచ్చని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ తాజా నివేదిక అంచనా వేసింది. వచ్చే రెండేళ్లలో ప్రపంచ మార్కెట్లోకి ముడిచమురు సరఫరా గణనీయంగా పెరగనుందని, మార్కెట్ డిమాండ్‌ను మించిపోనుందని పేర్కొంది. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, గుయానా వంటి ఒపెక్ (పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య) ప్లస్ యేతర దేశాలు చమురు ఉత్పత్తిని భారీగా పెంచవచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఒపెక్ ప్లస్ దేశాలు ఉత్పత్తిని యథాతథంగా కొనసాగిస్తే, రెండేళ్లలో ఇంధన సరఫరా మిగులు రోజుకు 30 లక్షల బ్యారెళ్లకు చేరుకోవచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. దాంతో ధరలు ప్రస్తుత స్థాయితో పోలిస్తే, దాదాపు సగానికి తగ్గేందుకు అవకాశాలున్నాయని అంటోంది.

మనకు అన్ని విధాలా ప్రయోజనకరమే : ప్రపంచంలో అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. పైగా, దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. కాబట్టి, ముడిచమురు ధరలు తగ్గుదల భారత్‌కు అన్ని విధాలా ప్రయోజనకరమే. దేశ దిగుమతుల వ్యయంతో పాటు కరెంట్ ఖాతా లోటు తగ్గుదలకు ఇది దోహదపడుతుంది. వాహనదారులపై పెట్రోల్, డీజిల్ కొనుగోలు భారం తగ్గుతుంది. సరుకు రవాణా వ్యయం కూడా తగ్గి ధరలు మరింత దిగివచ్చేందుకు తోడ్పడుతుంది. ఎయిర్‌లైన్స్, కెమికల్స్, టాన్స్‌పోర్ట్ రంగ వ్యాపార నిర్వహణ వ్యయమూ గణనీయంగా తగ్గుతుంది.

వచ్చే ఏడాది చివరికి వెండి 6 లక్షలు!

- స్టాక్ మార్కెట్లలో మహాపతనానికి బీజాలు
- బులియన్, క్రిప్టోలతోనే పెట్టుబడులు సేఫ్
- రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత అంచనా

న్యూఢిల్లీ: ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో కనీవిని ఎరుగని మహా పతనం ఇప్పటికే ప్రారంభమైందని ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన పుస్తకాల్లో ఒకటైన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత, అమెరికన్ బిజినెస్‌మెన్ రాబర్ట్ కియోసాకి ఇన్వెస్టర్లను హెచ్చరించారు. అమెరికా మార్కెట్లో మొదలైన ఈ పతనం క్రమంగా యూరప్, ఆసియా మార్కెట్లకు వ్యాపించనుందని అన్నారు. పెట్టుబడులను రక్షించుకునేందుకు ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను సర్దుబాటు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు. ఈ కష్టకాలంలో బంగారం, వెండితోపాటు బిట్ కాయిన్, ఎథిరియం వంటి క్రిప్టోకరెన్సీలే పెట్టుబడుల విలువను పెంచగలవని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు.

రియల్టీ మార్కెట్టూ క్రాష్.. : కృత్రిమ మేధ (ఏఐ) కంపెనీల షేర్లలో ఏర్పడిన భారీ బుడగ ఎప్పుడైనా పేలవచ్చన్న ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు ఇప్పటికే ఒత్తిడికి లోనవుతున్నాయని కియోసాకి పేర్కొన్నారు. ఇందుకు తోడు ఏఐ టెక్నాలజీ దెబ్బకు ఉద్యోగాల ఊచకోత కూడా ఇప్పటికే మొదలైందని, రాబోయే సంవత్సరాల్లో ఇది తారాస్థాయికి చేరుకోనుందని ఇప్పటికే పలువురు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. లక్షల్లో ఉద్యోగాలు హరించుకుపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ కూడా కుప్పకూలుతుందని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ మార్కెట్లో 200 డాలర్లకు వెండి..: ఆర్థిక సంక్షోభ సమయాల్లో భద్రమైన పెట్టుబడి సాధనాలుగా పేరున్న బంగారం, వెండి ధరలు ముమ్మందు భారీగా పెరగనున్నాయని కియోసాకి అంటున్నారు. ప్రస్తుతం 50 డాలర్ల స్థాయిలో ఉన్న ఔన్స్ సిల్వర్.. త్వరలోనే 70 డాలర్లకు ఎగబాకవచ్చని.. వచ్చే ఏడాది చివరినాటికి 200 డాలర్లకు చేరుకోవచ్చని కియోసాకి అంచనా వేశారు. ప్రస్తుతం ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి రూ.1.55 లక్షలు పలుకుతోంది. కియోసాకి అంచనాల ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి 200 డాలర్లకు పెరిగితే.. దేశీయంగా కిలో వెండి రూ.6.2 లక్షలకు చేరుకునే అవకాశం ఉంది.

మూడో రోజూ నష్టాల్లోనే మార్కెట్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 313.70 పాయింట్లు కోల్పోయి 84,587.01 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 74.70 పాయింట్లు తగ్గి 25,884.80 వద్ద స్థిరపడింది. ఐటీ, ఆటో రంగ షేర్లలో అమ్మకాలతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణం.

వచ్చేనెల 1 నుంచి పీసీ డయాగ్నోస్టిక్స్ ఐపీఓ

పీసీ డయాగ్నోస్టిక్స్ పేరుతో ముంబై కేంద్రంగా కార్యకలపాలు సాగిస్తున్న ఇన్విక్టా డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 1న ప్రారంభమై 3న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.80-85గా నిర్ణయించింది.

భారీగా పెరిగి బంగారం, వెండి : అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ పసిడి, వెండి ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత బంగారం 10 గ్రాములు రూ.3,500 ఎగబాకి రూ.1,28,900కు చేరింది. 99.5% స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,28,300 పలికింది. కిలో వెండి సైతం ఒక్కరోజే రూ.5,800 పెరుగుదలతో రూ.1,60,800 స్థాయికి చేరుకుంది.



టాటా సియారా మళ్లీ వచ్చెన్..

ముంబై: సుమారుగా రెండు దశాబ్దాల తర్వాత టాటా సియారా కారు మళ్లీ రోడ్లపైకి రాబోతోంది. ఈ ప్రముఖ బ్రాండ్‌ను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ (టీఎంపీవీ) సరికొత్త అవతారంలో అందుబాటులోకి తెచ్చింది. తద్వారా సంస్థ వేగంగా వృద్ధి చెందుతున్న మిడ్‌సైజ్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) విభాగంలోకి ప్రవేశించింది. మూడు ఇంజిన్ (రెండు పెట్రోల్, ఒకటి డీజిల్) ఆప్షన్లలో లభించనున్న ఈ కారు పరిచయ ధర రూ.11.49 లక్షలు. సియారా బుకింగ్స్‌ను డిసెంబరు 16 నుంచి ప్రారంభించనున్నట్లు, వచ్చే ఏడాది జనవరి 15 నుంచి కస్టమర్లకు వాహనాలను అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. సియారా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను వచ్చే ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రీమియం లుక్‌తో కూడిన ఈ కారులోని మూడు స్క్రీన్లతో కూడిన ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్, 5జీ కనెక్టివిటీ, 2+ అడాస్ వంటి డిజిటల్ ఫీచర్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టీఎంపీవీ పేర్కొంది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి సుజుకీ గ్రాండ్ విటారాకు పోటీగా టాటా కంపెనీ సియారాను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది.

స్పోర్ట్స్

స్మృతి పెళ్లి వాయిదాపై నెట్‌లో ఊహాగానాలు



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ పెళ్లి నిరవధికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఆమె తండ్రి అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం జరగాల్సిన వీరి వివాహం ఆగిపోయింది. అయితే, పెళ్లి వేడుకలు, ప్రపోజల్ వీడియోలు, ఫొటోలను స్మృతి తన సోషల్ మీడియా ఖాతానుంచి తొలగించడం ఏదో జరిగిందన్న అనుమానాలకు తావిచ్చింది. స్మృతి స్నేహితులు జెమీమా, శ్రేయాంక కూడా పెళ్లి వీడియోలను తమ ఖాతాల నుంచి తీసేయడం ఈ పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఇదే అదనుగా కొందరు అనేక ఊహాగానాలకు తెరదీశారు. పలాష్ మోసం బయటపడడం వల్లే పెళ్లి రద్దయిందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అందుకు ఆధారంగా మేరీ డికోస్టా అనే మహిళతో జరిగిన వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్లను పోస్టు చేశారు. దీనిపై స్మృతి లేదా ముచ్చల్ టీమ్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

ఇపో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్‌లో కొరియాను ఓడించిన భారత జట్టు.. రెండో మ్యాచ్‌లో నిరాశపరిచింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 2-3తో బెల్జియం చేతిలో చిత్తయింది. భారత్ తరఫున అభిషేక్ (33వ), శిలానంద్ (57వ) చెరో గోల్ కొట్టగా.. బెల్జియం నుంచి డువెకోట్ (17వ, 57వ) రెండు, నికోలస్ (45వ) ఓ గోల్ చేశారు. భారత్ తర్వాతి మ్యాచ్‌ను మలేసియాతో నేడు ఆడనుంది.

ఆర్నెల్ల తర్వాత స్వదేశానికి విరాట్



న్యూఢిల్లీ: లండన్‌లో నివాసముంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆరు నెలల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో అడుగుపెట్టాడు. టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్ కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఈనెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం జట్టుతో పాటు చేరనున్నాడు. ఈ ఏడాది మేలో ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలిచాక లండన్ వెళ్లిపోయిన విరాట్.. అక్కడి నుంచే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లి వన్డే సిరీస్ ఆడాడు.

టైబ్రేక్‌కు ఫిడే వరల్డ్‌కప్ ఫైనల్

పనాజీ: ఫిడే వరల్డ్‌కప్ ఫైనల్ టైబ్రేక్‌కు దారితీసింది. వీ యి (చైనా), ఉజ్బెకిస్థాన్ జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)ల మధ్య మంగళవారం జరిగిన రెండో క్లాసికల్ గేమ్ 30 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరూ చెరో పాయింట్‌తో సమంగా ఉన్నారు. బుధవారం జరిగే ర్యాపిడ్ టైబ్రేకర్‌లో విజేతను నిర్ణయిస్తారు.



డ్రానందమైనా.. దక్కాలి!

రోజంతా నిలుస్తారా?

రెండో టెస్టు

రెండో టెస్టులో భారత్ విజయం ఇక అసాధ్యమే. 549 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన పంత్ సేన 30 రన్స్ అయినా చేయకముందే ఓపెనర్లను కోల్పోయింది. ఇక బుధవారం ఆఖరి రోజున 8 వికెట్ల సహాయంతో చేయాల్సిన పరుగులు 522. ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఆటతీరు చూస్తుంటే ఈ కొండంత లక్ష్యాన్ని ఛేదించడం కాదు కదా.. కనీసం రోజంతా నిలిచి డ్రా చేసుకున్నా గొప్పే అనేలా ఉంది పరిస్థితి. మరోవైపు పాతికేళ్ల తర్వాత భారత గడ్డపై క్లీన్‌స్వీప్ కోసం సఫారీలు ఉవ్విళ్లూరుతున్నారు.

- భారత్ లక్ష్యం 549 ● ప్రస్తుతం 27/2
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్

స్టబ్స్ సెంచరీ మిస్

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియాకు భారీ ఓటమి తప్పేలా లేదు. ఇక జట్టు పోరాటమంతా డ్రా కోసమే. భారత బ్యాటర్లు బేలగా మారిన పిచ్‌పై నాలుగో రోజున దక్షిణాఫ్రికా మాత్రం అదరగొట్టింది. ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించకుండా బరిలోకి దిగిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌ను 260/5 స్కోరు వద్ద డిక్లేర్ చేశారు. దీంతో ఆ జట్టుకు 548 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. స్టబ్స్ (94) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. డి జోర్జి (49), రికెల్టన్ (35), ముల్డర్ (35 నాటౌట్) మార్‌క్రమ్ (29) రాణించారు. స్పిన్నర్ జడేజాకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 549 పరుగుల ఛేదనలో భారత్ మంగళవారం ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 27/2 స్కోరుతో నిలిచింది. జైస్వాల్ (13), రాహుల్ (6) నిరాశపర్చారు. క్రీజులో ఉన్న కుల్దీప్ (4 బ్యాటింగ్), సుదర్శన్ (2 బ్యాటింగ్) పరుగులు తీసేందుకు చెమటోడ్చుతున్నారు. విజయం కోసం భారత్ మరో 522 పరుగు లు చేయాల్సి ఉండగా, ఆఖరి రోజును అజేయంగా ముగించి డ్రా చేసుకోగలుగుతారా? అనేది వేచిచూడాల్సిందే.

1 స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టుల్లో ఎక్కువ వికెట్లు (46) తీసిన బౌలర్‌గా అశ్విన్‌తో సమంగా నిలిచిన జడేజా. ఓవరాల్‌గా ఈ టీమ్‌పై 50+ వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్.

2 స్వదేశంలో భారత్‌కు 500+ పరుగుల లక్ష్యం ఎదురుకావడం ఇది రెండోసారి. 2004లో ఆసీస్ 543 పరుగుల టార్గెట్ విధించగా.. భారత్ 342 రన్స్ తేడాతో ఓడింది.



స్టబ్స్ (94)

తొలి సెషన్‌లో మూడు వికెట్లు

26/0 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నిం గ్స్ ఆరంభించిన సఫారీలను భారత బౌలర్లు ఏ మాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. తొలి సెషన్‌లో మూడు వికెట్లు కోల్పోయినా 107 పరుగులు రాబట్టి తమ ఆధిక్యాన్ని 395 పరుగులకు చేర్చారు. ఓపెనర్లు రికెల్టన్, మార్‌క్రమ్ తొలి వికెట్‌కు 59 పరుగులు జోడించారు. ఈ ఇద్దరినీ జడేజా పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే కెప్టెన్ బవుమా (3)ను మరో స్పిన్నర్ సుందర్ అవుట్ చేశాడు. కానీ స్టబ్స్, డి జోర్జి మాత్రం రిస్కీ షాట్లకు వెళ్లకుండా సెషన్‌ను ముగించారు.

స్టబ్స్-డిజోర్జి శతక భాగస్వామ్యం: ఇక విరామం తర్వాత భారత బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. స్టబ్స్-డి జోర్జి జోడీ స్పిన్నర్లను అలవోకగా ఎదుర్కొంటూ స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లతో ఆకట్టుకున్నారు. స్టబ్స్‌కు జోర్జి తోడు కావడంతో మూడో వికెట్‌కు 101 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. అయితే జోర్జిని 59వ ఓవర్‌లో జడేజా ఎల్బీ చేశాడు. ఈ సెషన్‌లో లభించిన ఏకైక వికెట్ ఇదే. కాసేపటికే స్టబ్స్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. ఆధిక్యం కూడా 500కు చేరింది. మరోవైపు అప్పటికే అలిసిపోయినట్టు కనిపించిన భారత ఫీల్డర్లు.. ప్రత్యర్థి డిక్లేర్ చేస్తుందేమోనని ఎదురు చూశారు. కానీ కెప్టెన్ బవుమా నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆటగాళ్లంతా లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.

శతకానికి ఆరు పరుగుల దూరంలో..: 508 పరుగుల ఆధిక్యం ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికా డిక్లేర్ చేయకుండా ఆఖరి సెషన్‌ను ఆరంభించడం ఆశ్చర్యపరిచింది. మరోవైపు వేగంగా ఆడే క్రమంలో నితీశ్, జడేజా ఓవర్లను లక్ష్యంగా చేసుకుని స్టబ్స్ బౌండరీలు సాధించాడు. ఇంకో ఎండ్‌లో ముల్డర్ సైతం బౌలర్లను విసిగించాడు. అయితే 79వ ఓవర్‌లో సిక్సర్‌తో 90 రన్స్ దాటిన స్టబ్స్‌ను జడేజా బౌల్డ్ చేయడంతో శతకానికి 6 పరుగుల దూరంలో వెనుదిరిగాడు. ఆ వెంటనే సఫారీల ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు.

ఒకే గ్రూప్‌లో భారత్, పాక్

ఫిబ్రవరి 15న హైవోల్టేజ్ మ్యాచ్ | **టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల**



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పెద్ద టోర్నీల్లో ఇరుజట్లనూ వేర్వేరు గ్రూపుల్లో ఆడిస్తారని భావించారు. కానీ, ఐసీసీ మాత్రం మరోసారి కాసులపైనే దృష్టిపెట్టింది. టీ20 వరల్డ్‌కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్‌లు మరోసారి ఒకే గ్రూప్‌లో తలపడనున్నాయి. గ్రూప్-ఎలో ఫిబ్రవరి 15న కొలంబోలో ఇండో-పాక్ సమరం జరగనుంది. వచ్చే ఏడాది జరిగే పొట్టికప్ షెడ్యూల్‌ను ఐసీసీ చైర్మన్ జై షా మంగళవారం విడుదల చేశారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టికప్ ఫిబ్రవరి ఏడున ఆరంభం కానుండగా.. మార్చి 8న ఫైనల్ జరగనుంది. 20 జట్లు పాల్గొంటున్న టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లకు ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, చెన్నై, ముంబైతో పాటు శ్రీలంకలోని కొలంబో, క్యాండీలను వేదికలుగా ఖరారు చేశారు. పాక్ ఫైనల్ చేరకపోతే తుది పోరుకు అహ్మదాబాద్ ఆతిథ్యమిస్తుంది. అలాగే, పాక్ సెమీస్‌కు రాకుంటే.. ముంబై, కోల్‌కతాల్లో సెమీస్ మ్యాచ్‌లు నిర్వహించే చాన్సుంది. ఫిబ్రవరి 7న కొలంబోలో జరిగే టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో పాక్ ఆడనుంది. అదేరోజు ముంబైలో అమెరికాతో భారత్ తలపడనుంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో, 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో టీమిండియా ఆడనుంది.

ఫార్మాట్ ఇలా..

టోర్నీలో పాల్గొంటున్న 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్, గ్రూప్-సిలో ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఇటలీ, నేపాల్.. గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్ఘానిస్థాన్, కెనడా, యూఏఈ జట్లున్నాయి. ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ముందుగా నిర్దేశించిన సీడింగ్‌ల ప్రకారం సూపర్-8 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఆ రెండు గ్రూపులలో టాప్-2లో నిలిచే జట్లు సెమీస్‌లో అమీతుమీ తేల్చుకొంటాయి. శ్రీలంక ఉన్న గ్రూప్-బితో పాటు పాక్ ఆడే మ్యాచ్‌ల న్నీ (నాకౌట్ సహా) తటస్థ వేదికైన లంకలోనే జరగనున్నాయి.

టోర్నీ అంబాసిడర్‌గా రోహిత్



టోర్నీ ప్రచారకర్తగా భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. 2024లో యూఎస్‌లో జరిగిన టోర్నీలో రోహిత్ సారథ్యంలో భారత్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ విజయ సంబరాల్లోనే రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489;
భారత్ తొలి ఇన్నింగ్స్: 201;

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) సిరాజ్ (బి) జడేజా 35, మార్‌క్రమ్ (బి) జడేజా 29, స్టబ్స్ (బి) జడేజా 94, బవుమా (సి) నితీశ్ (బి) సుందర్ 3, డి జోర్జి (ఎల్బీ) జడేజా 49, ముల్డర్ (నాటౌట్) 35; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 78.3 ఓవర్లలో 260/5 డిక్లేర్; వికెట్ల పతనం:** 1-59, 2-74, 3-77, 4-178, 5-260; **బౌలింగ్:** బుమ్రా 6-0-22-0, సిరాజ్ 5-1-19-0, జడేజా 28.3-3-62-4, కుల్దీప్ 12-0-48-0, సుందర్ 22-2-67-1, జైస్వాల్ 1-0-9-0, నితీశ్ 4-0-24-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13, రాహుల్ (బి) హార్మర్ 6, సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 2, కుల్దీప్ (బ్యాటింగ్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 15.5 ఓవర్లలో 27/2. వికెట్ల పతనం:** 1-17, 2-21; **బౌలింగ్:** యాన్సెన్ 5-2-14-1, ముల్డర్ 4-1-6-0, హార్మర్ 3.5-2-1-1, కేశవ్ 3-1-5-0.

డిక్లరేషన్ ఎందుకంత ఆలస్యం?

దక్షిణాఫ్రికా ముందే డిక్లేర్ చేస్తుందని అంతా భావించారు. కానీ భారత ఫీల్డర్లను వీలైనంతవరకూ మైదానంలోనే ఉంచి వారు అలసిపోయేలా చేయాలన్న వ్యూహంతోనే సఫారీలు ఆలస్యంగా డిక్లేర్ చేశారట. భారత ఓపెనర్లిద్దరూ అవుటవడం చూస్తే బవుమా చేసింది కరెక్టేనని ఒప్పుకోవాలి. పైగా పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు పూర్తిగా సహకరిస్తుండడం కూడా ఆలస్యానికి ఓ కారణం. ఎలాగూ దక్షిణాఫ్రికా తొలి టెస్టులో గెలిచింది కాబట్టి, వారికి రెండో టెస్టును డ్రా చేసుకున్నా చాలు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పరిశ్రమల ప్రతినిధులు

ఏపీ ఎంఎస్ఎంఈలకు జర్మనీ సహకారం

- చెన్నైలో ఇండో-జర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సదస్సు
- పరిశ్రమలకు ప్రోత్సాహానికి ఎల్‌వోఐపై మంత్రి కొండపల్లి సంతకాలు

చెన్నై/అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిన్న పరిశ్రమలకు అన్ని ప్రోత్సాహకాలూ అందించేందుకు చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలోని హిల్టన్ హోటల్‌లో ఇండో-జర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్ 59వ వార్షిక ప్రాంతీయ సదస్సుకు రాష్ట్రం తరపున మంత్రి హాజరయ్యారు. ఇండో-జర్మన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా ఏపీలో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకానికి సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)పై సంతకాలు చేశారు. పరిశ్రమలల్లో ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, యువ పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి, ఉత్పత్తుల ఎగుమతికి, సాంకేతిక పరిజ్ఞానంలో, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ల ఏర్పాటుకు జర్మనీ సహకారం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది జర్మన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్క్రో ఖాతాల్లో ప్రభుత్వ ప్రోత్సాహకాలు

- రాష్ట్రంలో నిస్సంకోచంగా పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తలకు మంత్రులు కొలుసు, కొండపల్లి పిలుపు
- ఏపీ చాంబర్స్ 'బిజినెస్ ఎక్స్‌పో-2025' బ్రోచర్ ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు ఎస్క్రో ఖాతాల ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహకాలను చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినందున పారిశ్రామికవేత్తలు నిస్సంకోచంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవచ్చని సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు గ్రౌండింగ్ కాగా.. సీఐఐ భాగస్వామ్య సదస్సులో మరో 13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయని వివరించారు. ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో విజయవాడలో 'బిజినెస్ ఎక్స్‌పో-2025' కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. మంత్రి పార్థసారథితో పాటు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ డాక్టర్ రవి వేమూరు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బిజినెస్ ఎక్స్‌పో బ్రోచర్‌ను, ఏపీ లోగోను ఆవిష్కరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో-2025ను పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల చిరకాల కోరిక నెరవేర్చారు: దూండీ

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల చిరకాల కోరిక అయిన పెనుగొండ గ్రామం పేరును వాసవి పెనుగొండగా మార్చడంపై కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవడం ఆర్యవైశ్య సమాజానికి అపార గౌరవాన్ని చేకూర్చిందని రాకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాక్రీట్ దోపిడీ 80 కోట్లు

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ పథకంలో అవినీతి

- ఇళ్లు పూర్తి చేయకుండా లబ్ధిదారులకు మోసం
- కేసు నమోదు చేసి సొమ్ము రికవరీకి చర్యలు
- ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేలా కామన్ వాల్‌తో ట్విన్ హౌసెస్.. త్వరలో జీవో
- వచ్చే నాలుగేళ్లలో 12.59 లక్షల ఇళ్లు పూర్తి
- వచ్చే ఉగాదికి 5 లక్షల గృహాలు: పార్థసారథి



అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆప్షన్-3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీమ్‌లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణలో తేలిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సంబంధీకులకు చెందిన రాక్రీట్ సంస్థ రూ.80 కోట్లు అవినీతికి పాల్పడినట్లు వెల్లడైందని చెప్పారు. ఈ సొమ్మును ఆ సంస్థ నుంచి రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సంస్థకు 50,402 ఇళ్ల నిర్మాణ పనులు అప్పగించారని, వీటిలో 47,850 ఇళ్ల నిర్మాణ పనులు తీసుకుని, ఎక్కడా పూర్తి చేయకుండా లబ్ధిదారులకు అన్యాయం చేసిందని తెలిపారు. ఏయే జిల్లాల్లో అవకతవకలకు పాల్పడిందో, అక్కడ లీగల్‌గా అవకాశం ఉన్న అన్ని రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కామన్ వాల్‌తో ట్విన్ హౌసెస్ నిర్మించుకునే అవకాశాన్ని కల్పిస్తూ త్వరలో జీవో జారీ చేయనున్నట్లు వెల్లడించారు. పేదలకు ఇచ్చిన ఇళ్లకు పై అంతస్తు నిర్మాణం చేసుకోవడానికి చాలా మంది అడుగుతున్నారని, ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐదేళ్లలో 15.59 లక్షల గృహాల లక్ష్యం కాగా, ఇప్పటికే 3 లక్షల గృహాలను పూర్తి చేశామని, మిగిలిన 12.59 లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షలు, జూన్ నాటికి మరో 87వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. పీఎంఏవై 1.00 పథకం అమలు గడువు డిసెంబరుతో ముగియనుందని, కేంద్రం మరో ఏడాది పాటు దీన్ని పొడిగించనుందని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాల లబ్ధిదారులు వాటిని మొదలు పెడితే పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 6 లక్షల గృహాలు మాత్రమే పూర్తి చేసింది. మా ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే 3.19 లక్షల గృహాలను పూర్తి చేసింది. 2014-19 మధ్య ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న 4.7 లక్షల గృహాలను గత ప్రభుత్వం రద్దు చేసింది. పూర్తయిన 2.7 లక్షల గృహాలకు రూ.920 కోట్లు చెల్లించకుండా ఎగ్గొట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు అన్యాయం చేసింది. మా ప్రభుత్వం పక్షపాతం చూపకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన 18.61 లక్షల గృహాల్లో మిగిలి ఉన్న 11.90 లక్షల గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నాం. సర్వేలో ఇప్పటి వరకు 81 వేల మందికి ఇళ్ల స్థలాలు అవసరమని గుర్తించాం. ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో ఉం టున్న దాదాపు 1.15 లక్షల మందికి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేయాలని సీఎం ఆదేశించారు" అని మంత్రి తెలిపారు.

'అండమాన్'లో వాయుగుండం బంగాళాఖాతంలో అల్పపీడనం

- 28 నుంచి పెరగనున్న వర్షాలు: ఐఎండీ

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం మంగళవారం నాటికి బలపడి వాయుగుండంగా మారింది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడనుంది. ఆ తర్వాత మధ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ క్రమేపీ బలహీనపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసరాల్లో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి బుధవారానికి తీవ్ర అల్పపీడనంగా, ఆ తర్వాత 24 గంటల్లో వాయుగుండంగా మారుతుంది. ఆ తర్వాత 3రోజుల్లో వాయవ్యంగా పయనించి ఉత్తర తమిళనాడు తీరం దిశగా రానున్నది. ఆ తర్వాత కూడా ఉత్తరం/వాయవ్యంగా పయనించి కోస్తాంధ్ర వైపు పయనించి దక్షిణ కోస్తాంధ్రలో తీరం దాటుతూ బలహీనపడుతుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఈనెల 28 నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 29న రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడ భారీగా, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ఈనెల 30, డిసెంబరు ఒకటి తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 2, 3 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 27వ తేదీ నుంచి దక్షిణ కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. కోస్తా, రాయలసీమల్లో వరి, పత్తి రైతులు ఈనెల 28వ తేదీ నుంచి అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు. కోతలను మూడు, నాలుగు రోజులు వాయిదా వేయాలని సూచించారు. రైతులు పొలాల్లో వరి కుప్పల రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణలో పంచాయతీలకు మోగిన ఎన్నికల నగారా

- రేపు ప్రారంభమై డిసెంబరు 17న ముగియనున్న ప్రక్రియ

హైదరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల నగారా మోగింది. గురువారం (నవంబరు 27) ప్రారంభమయ్యే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ.. డిసెంబర్ 17 నాటికి పూర్తికానుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎస్ఈసీ కార్యాల యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం మూడువిడతల్లో ఎన్నికలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత.. అదేరోజు ఓట్ల లెక్కింపు జరిపి, ఫలితాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ ఉంటుందని.. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను సంబంధిత విభాగాలు పూర్తిచేస్తాయని చెప్పారు.

పాల ఉత్పత్తిలో ఏపీకి ఏడో స్థానం

- మొదటి మూడు స్థానాల కోసం కృషి
- పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు
- నేడు జాతీయ పాల దినోత్సవం

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఒక్కో వ్యక్తి సగటు పాల వినియోగం రోజుకు 719గ్రాములు. జాతీయ సగటు పాల వినియోగం 459 గ్రాములు. ఈ నేపథ్యంలో పాల ఉత్పత్తిని 2033 నాటికి 150లక్షల టన్నులు సాధించి, 15శాతం వృద్ధి రేటుతో దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నాం' అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు మంగళవారం తెలిపారు. బుధవారం జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'గత తొమ్మిదేళ్లలో జాతీయ పాల ఉత్పత్తిలో 58శాతం వృద్ధి నమోదైంది. జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఐదు శాతం పాల ద్వారానే తోడ్పాటు అందుతోంది. వ్యవసాయ రంగంలో అతి పెద్ద ఆదాయ వనరు పాలే. రాష్ట్రంలో 25లక్షల మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. పాల ఉత్పత్తిలో ప్రస్తుతం 139.46 లక్షల టన్నులతో ఏపీ దేశంలో 7వ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఏపీ పాలు, పాల ఉత్పత్తుల విలువ 713.9 బిలియన్లు ఉండగా, దీనిని 2033 నాటికి రెండింతలు పెంచేందుకు ప్రభుత్వం పశుపోషకులకు అనేక రాయితీలు అందిస్తోంది. 2025 అఖిల భారత పశుగణన ప్రకారం రాష్ట్రంలో 46లక్షల ఆవులు, 62.19లక్షల గేదెలు ఉన్నాయి. 2024-25లో రాష్ట్ర పాల ఉత్పత్తి 139.46 లక్షల టన్నులు ఉండగా, రాష్ట్రంలో ఒక్కొక్క వ్యక్తి సగటు పాల వినియోగం రోజుకు 719గ్రాములు ఉండగా, జాతీయ సగటు పాల వినియోగం 459 గ్రాములు ఉందని అంచనా. ఈ నేపథ్యంలో పాల ఉత్పత్తిని 2033 నాటికి 150లక్షల టన్నులు సాధించి, 15శాతం వృద్ధి రేటుతో దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నాం' అని తెలిపారు. మేలు రకం పశు గణాభివృద్ధి కోసం రాయితీపై దాణా, పశు గ్రాస భద్రత, జన్యుపరంగా అత్యుత్తమ పశుజాతుల అభివృద్ధి, ఉచిత పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణ, గర్భకోశ వ్యాధులు చికిత్స, లింగ నిర్ధారిత వీర్య నాళికల పంపిణీ, పశు బీమా, సంచార పశు ఆరోగ్య సేవలు, మినీ గోకులాల నిర్మాణం, పశు పోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, రైతుసేవా కేంద్రాల సహకారంతో ఇంటి వద్దే పశువైద్యం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

నంద్యాల జిల్లా ఏఐ టెక్నీషియన్‌కు జాతీయ అవార్డు

జాతీయ పాల దినోత్సవం సందర్భంగా డెయిరీ రంగంలో ఉత్తమ సేవలు అందించిన నంద్యాల జిల్లాకు చెందిన అనురాధ అనే పశువైద్య సాంకేతిక సిబ్బంది(ఏఐ టెక్నీషియన్) ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు చెప్పారు. కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో ఎక్కువ పెయ్య దూడలు పుట్టించడంలో ఆమె కృషి చేశారన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

డిసెంబర్‌లో విడుదల



సూపర్ నేచురల్ హారర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో జయ్ వల్లందాస్ నిర్మించారు. రోహిత్, మేఘన జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకుడిని ఆద్యంతం కొత్త అనుభూతికి లోను చేస్తుంది' అని చెప్పారు. 'ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది. అందమైన ప్రేమకథ, మిస్టరీ ఎలిమెంట్స్ లాంటి ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది' అని తెలిపారు. సంగీతం: ఎంఎల్ రాజా, సినిమాటోగ్రఫీ: దేవా.

గృహహింస కేసు పెట్టిన సెలీనా జైట్లీ



బాలీవుడ్ నటీ సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్‌పై గృహహింస కేసు పెట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్ ముంబైలోని ఓ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందుకు మంగళవారం వచ్చినట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఆస్ట్రియాలో పీటర్ కస్టడీలో ఉన్న తన పిల్లలను కలిసేందుకు కూడా తనకు అవకాశం ఇవ్వడం లేదని సెలీనా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. పీటర్ నుంచి నెలకు రూ.10 లక్షల భరణంతోపాటు రూ.50 కోట్లు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ పిటిషన్‌పై డిసెంబరు 12న తుది విచారణ జరగనుంది. కాగా, సెలీనా జైట్లీ, పీటర్ హాగ్‌లు 2011లో ఆస్ట్రియాలో వివాహం చేసుకున్నారు. సెలీనా జైట్లీ 2004లో విడుదలైన 'సూర్యం' సినిమాలో మంచు విష్ణుతో కలసి నటించారు.

అంచనాలను మించేలా..



రిచర్డ్ రిషి, రక్షణ ఇందుచూడన్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'ద్రౌపది 2'. మోహన్.జి దర్శకత్వంలో సోల చక్రవర్తి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో టైటిల్ రోల్ పోషిస్తున్న రక్షణ ఇందుచూడన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఎంతో గాంభీర్యంగా ఉన్న ఆమె లుక్ ప్రస్తుతం అందర్నీ మెప్పిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటుంది, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: దేవరాజ్ ఎస్, కెమెరామెన్: ఫిలిప్ ఆర్ సుందర్, సంగీతం: జిబ్రాన్.

చిరంజీవి గారి సినిమాని డైరెక్ట్ చేయాలి

ఉపేంద్ర



'నేను సినిమాల్లోకి రాకముందు చిరంజీవి గారి సినిమాలను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేవాణ్ణి. ఆ అనుభూతి చాలా గొప్పది. చిరంజీవి గారి సినిమాని డైరెక్ట్ చేయాలనేది నా కల. త్వరలో ఆ కల తీరుతుందనే నమ్మకం ఉంది' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు'. రామ్ కథానాయకుడిగా నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంలో ఉపేంద్ర కీలకపాత్ర పోషించారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉపేంద్ర మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. అద్భుతమైన ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. ఒక స్టార్ హీరోకూ, అతన్ని ఆరాధించే అభిమానికి మధ్య జరిగే కథ ఇది. నేనొక ప్రేక్షకుడిగా కథ విన్నాను. హీరోకూ, అభిమానికి మధ్య ఉండే ఎమోషన్ చాలా గొప్పది. దాన్ని ఈ సినిమాలో దర్శకుడు మహేశ్‌బాబు చాలా అద్భుతంగా, కొత్తగా చూపించారు. ఈ సినిమా ప్రేక్షకులను అలరించడం ఖాయం.
- రామ్ గొప్ప నటుడు. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. ఒక స్టార్ అయి ఉండికూడా ఒక సామాన్య అభిమానిలో ఉండే అమాయకత్వాన్ని ఆయన అభినయించిన తీరు అద్భుతం. భాగ్యశ్రీ బోర్సే, రామ్ మధ్య వచ్చే రెట్రో లవ్ స్టోరీ హృదయాలకు హత్తుకుంటుంది. మంచి నిర్మాణ విలువలతో మైత్రీ మూవీస్ నిర్మించింది. ఇంత మంచి ఎమోషనల్ చిత్రాన్ని నిర్మించినందుకు వారికి నా అభినందనలు.

ఆస్కార్ రేస్‌లో మహావతార్ నరసింహ



ఇటీవలె విడుదలై సంచలన విజయం సాధించిన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ'.. ఆస్కార్ 2026కు షార్ట్‌లిస్ట్ అయ్యింది. ఉత్తమ యానిమేషన్ విభాగంలో అవార్డు కోసం 35 సినిమాలతో పోటీపడుతోంది. 'డెమోన్ స్లేయర్', 'జూటోపియా 2' తదితర చిత్రాలు ఈ షార్ట్‌లిస్ట్‌లో ఉన్నాయి. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన 'మహావతార్ నరసింహ' చిత్రం బాక్సాఫీస్ దగ్గర దాదాపు రూ.300 కోట్ల కలెక్షన్స్ సాధించింది. భారతీయ యానిమేషన్ చిత్రాల్లో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. కాగా, జాన్వీ కపూర్, ఇషాన్ కట్టర్ ప్రధాన పాత్రల్లో 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారత్ తరపున అధికారికంగా ఆస్కార్ నామినేషన్ సాధించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి 15న 98వ ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది.

సాగుకు కూటమి చేసింది

పంచ మోసాలు: షర్మిల

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'సాగుకు పంచ సూత్రాలు కాదు... కూటమి ప్రభుత్వం చేసింది పంచ మోసాలు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమేరకు ఆమె ఓ ప్రకటన చేశారు. 'చంద్రబాబు పంచ సూత్ర సంక్షేమం పచ్చి బూటకం. 17 నెలలుగా వ్యవసాయాన్ని గాలికి వదిలేశారు. సాగుకు సమాధి కట్టి... అన్నదాతల మేలు కోసం పంచసూత్ర ప్రణాళిక అనేందుకు, రైతన్నా మీ కోసం అని వెళ్లేందుకు, విస్తృత ప్రచారం అని డబ్బా కొట్టేందుకు కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగిన నష్టాన్ని చెల్లించకుండా చంద్రబాబు ఎగ్గొట్టారు. పంటలకు మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. అన్నదాత సుఖీభవ కింద సగం మంది రైతులకు పంగనామాలు పెట్టారు. అరటి, టమాటా, ఉల్లి పంటల ధరలు రూపాయికి పడిపోయినా ధరల స్థిరీకరణ నిధి పెట్టలేదు. చివరికి రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలను కూడా అందించకుండా ఇబ్బందులకు గురిచేశారు' అని షర్మిల విమర్శించారు.

లింగ వివక్షపై పోరాటం: సెర్ప్

- నయీ చేతన-4.0 పోస్టర్ల ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లింగ వివక్షపై పోరాటం, స్త్రీ-పురుష సమానత్వం ఆవశ్యకతపై పౌరుల్లో అవగాహన పెంచడం నయీ చేతన జాతీయ జెండర్ క్యాంపైన్-4.0 ముఖ్య ఉద్దేశం అని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ తెలిపారు. మంగళవారం సెర్ప్ రాష్ట్ర కార్యాలయంలో నయీ చేతన-4.0 జెండర్ క్యాంపైన్ ప్రచార పోస్టర్లను, ప్రచార సామగ్రిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షను తగ్గించడం లేదా పూర్తిగా రూపుమాపడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి డిసెంబరు వరకు అన్ని జిల్లాల్లో లింగ వివక్షకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లా సమాఖ్యలు, హెచ్‌డీ విభాగాలు ఇందులో పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెర్ప్ అదనపు సీఈవో శ్రీరాములునాయుడు, డైరెక్టర్లు సుశీల, కృష్ణమోహన్, కల్యాణచక్రవర్తి, శివశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోకి సోషల్ వెల్ఫేర్ బోర్డు

- చైర్మన్‌గా పోతుల బాలకోటయ్య నియామకం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమశాఖ పరిధిలో ఉన్న సోషల్ వెల్ఫేర్‌బోర్డును సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోకి మార్చారు. అలాగే, ఈ బోర్డుకు చైర్మన్‌గా పోతుల బాలకోటయ్యను నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, నలుగురు సభ్యులను కూడా ప్రభుత్వం నియమించనుంది. ఉమ్మడి రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్‌బోర్డు మహిళా శిశు సంక్షేమశాఖ పరిధిలో ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోని సోషల్ వెల్ఫేర్‌బోర్డును కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం మూసేసింది. ఎస్సీల అభివృద్ధికి ఈ సంస్థను తిరిగి ప్రారంభించాలని తాజాగా నిర్ణయించింది. దీంతో అటానమస్ సంస్థగా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో సోషల్ వెల్ఫేర్‌బోర్డును తిరిగి ఏర్పాటు చేశారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది. ఈ సంస్థకు సిబ్బందిని కూడా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీల్లో విద్య, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి చేపట్టేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఎస్సీల్లో చైతన్యం కలిగించేందుకు, వారి హక్కుల అమలుకు, ఎస్సీలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు, ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారి నిరుద్యోగ నిర్మూలనకు, బాల్య వివాహాలు, అంటరానితనం నిర్మూలన కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

ఆప్కో వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్

- సంక్రాంతి వరకూ కొనసాగిస్తాం: మంత్రి సవిత

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఆప్కో షోరూమ్‌ల్లో వస్త్రాల విక్రయాలపై 40శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. చేనేత వస్త్ర వినియోగదారుల నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ డిస్కౌంట్‌ను సంక్రాంతి వరకూ కొనసాగిస్తామని చెప్పారు. దసరా, దీపావళికి డిస్కౌంట్ ఇవ్వడంతో రోజువారీ విక్రయాలు మూడు రెట్లు పెరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాలను సైతం ఆప్కో షోరూమ్‌ల్లో విక్రయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. విశాఖ, కర్నూలు తదితర నగరాలతో పాటు ఇతర జిల్లా కేంద్రాల్లోనూ చేనేత బజార్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

మయన్మార్ బాధితులకు అండగా ప్రభుత్వం

- స్వస్థలాలకు 43 మంది: మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మయన్మార్ సైబర్ క్రైమ్ ముఠాల చెర నుంచి విముక్తి పొందిన 43 మంది బాధితులను వారి స్వస్థలాలకు చేర్చామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ప్రవాసాంధ్రుల వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మయన్మార్ నుంచి 370 మంది బాధితులు మూడు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి చేరుకోగా.. వారిలో విజయవాడ, విశాఖ ప్రాంతాలకు చెందిన 43 మంది ఉన్నారని మంగళవారం ఒక ప్రకటనలో మంత్రి వివరించారు. ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) సూచనలతో ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు ఆ 43 మందికి భోజనం, వసతి, సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. ఆ తర్వాత వారందరికీ ఎమర్జెన్సీ కోటా కింద రైలు టికెట్లు ఖరారు చేయించి, మంగళవారం వివిధ రైళ్లలో స్వస్థలాలకు సాగనంపారని పేర్కొన్నారు.

చిన్నారుల సంరక్షణ కేంద్రాల తనిఖీకి కమిటీ

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పిల్లల సంరక్షణ కేంద్రాల తనిఖీకి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అధికారులు, స్వచ్ఛందసంస్థలు, సామాజిక కార్యకర్తలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మావోయిస్టుల కస్టడీ పిటిషన్ వెనక్కి

విజయవాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన మావోయిస్టుల్లో ముగ్గురిని కస్టడీకి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం రిటర్న్ చేసింది. ఉద్దే రఘు, ఓయం జ్యోతి, మడకం దివాకర్‌ను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పెనమలూరు పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు పరిశీలించారు. తమ కోర్టుకు మావోయిస్టులను కస్టడీకి ఇచ్చే అధికారం లేదని, ఆ అధికారంలో ఉన్న కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచిస్తూ రిటర్న్ చేశారు.

మద్యం కేసులో సొమ్ము డిపాజిట్‌కు అనుమతి కోరుతూ పిటిషన్

విజయవాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో సాక్షి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. 439వ సాక్షిగా ఉన్న ముబారక్ అలీ నుంచి విచారణ సమయంలో రూ.9.20 లక్షలు స్వాధీనం చేసుకున్నామని కోర్టుకు తెలిపారు. ఈ నగదును బ్యాంకులో డిపాజిట్, లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

రాష్ట్రంలో 'ఉద్భవ్ 2025' ఉత్సవాలు

- డిసెంబరు 3, 4, 5 తేదీల్లో నిర్వహణ
- సచివాలయంలో ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సంధ్యారాణి



సచివాలయంలో ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సంధ్యారాణి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని(ఈఎంఆర్ఎస్) గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఏటా నిర్వహించే సాంస్కృతిక, సాహిత్య జాతీయ ఉత్సవాలకు ఈ ఏడాది మన రాష్ట్రం అతిథ్యం ఇస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఉద్భవ్ 2025 పేరుతో నిర్వహించే ఈ కల్చరల్ ఫెస్ట్‌ను డిసెంబరు 3, 4, 5 తేదీల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాల్లో 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య పాఠశాలల నుంచి 1,800 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. మన రాష్ట్రం నుంచి 110 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులతోపాటు మరో 278 మంది హాజరవుతారు. పోటీలను నిర్వహిస్తున్న కేఎల్ యూనివర్శిటీలో 12 వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెరిట్ సర్టిఫికేట్లు అందిస్తాం. ఉద్భవ్ 2025లో 6 నుంచి 12వ తరగతిలోపు విద్యార్థులు హాజరవుతారు. ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు ఎక్కువమంది నీట్, ఐఐటీ, ఎన్ఐటీలకు ఎంపికవుతున్నారు. విదేశీ విద్యకు ఎక్కువ మంది ఎంపికయ్యేలా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటాం. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటి వరకు రూ.1,300 కోట్లు ఖర్చు చేశాం. అల్లూరి జిల్లాకు రూ.1,000 కోట్లు కేటాయించినందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. హాస్టళ్లలో మౌలిక వసతులకు రూ.105 కోట్లు కేటాయించాం. ట్రైకార్‌లో దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు రుణాలు మంజూరు చేస్తున్నాం. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి డిసెంబరులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం' అని మంత్రి సంధ్యారాణి వివరించారు.

ఆగ్రోస్‌లో ఇష్టారాజ్యం!

- పరికరాల కంపెనీలతో సిబ్బంది లాలూచీ
- యంత్రాల టెండర్లలో అవినీతి
- తక్కువ రకం ట్రాక్టర్లు ఇప్పించి.. ఓ కంపెనీ నుంచి రూ.లక్షల్లో ముడుపులు
- అక్రమాలు నిర్ధారణ అయినా చర్యల్లేవు
- సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లకు డొల్ల కంపెనీ ద్వారా పరికరాల సరఫరా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ఆగ్రోస్ అవకతవకలకు నిలయంగా మారింది. ఉద్యోగులపై సరైన అజమాయిషీ లేక ఇష్టారాజ్యమైపోయింది. కింది స్థాయి ఉద్యోగులు పైస్థాయి అధికారుల పేరు చెప్పి.. అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. రైతులకు పరికరాలు పంపిణీ చేసే కంపెనీలతో లాలూచీలు, వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన యంత్రాల సరఫరా చేసే టెండర్లలో అవినీతికి పాల్పడుతున్నారు. వారి అవినీతిపై విచారణ, చర్యలు తీసుకోవడంలో తాత్సారం జరుగుతుండడంతో అక్రమాలు పరంపరంగా సాగుతున్నాయి. ఆరోపణలు వచ్చిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారి మళ్లీ అదే పంథాలో వెళ్లడం విమర్శలకు దారి తీస్తోంది. తాజాగా ట్రాక్టర్లు సరఫరా చేసిన డీలర్‌ను ఇబ్బంది పెట్టిన వైనం ఆగ్రోస్ భాగస్వాముల్లో చర్చనీయాంశమైంది. 2009లో వరికోత యంత్రాల సరఫరాకు సంబంధించి.. తమిళనాడుకు చెందిన ఓ కంపెనీకి కొంత సొమ్ము చెల్లించి.. భారీగా నిధులు స్వాహా చేసినట్లు అప్పట్లో ఆడిట్ విచారణలో తేలడంతో సదరు అధికారిని సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేశారు. 2018లో రైతురథం పథకం కింద 81 మంది రైతులకు ఒక్కో ట్రాక్టరుకు రూ.7.90 లక్షలకు బిల్లు పెట్టి.. తక్కువ రకం ట్రాక్టర్లను ఇప్పించి, కంపెనీ నుంచి రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్న విషయం నిర్ధారణ అయినా.. చర్యల్లేవు. గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖకు చెందిన 9 సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లకు రూ.2.45 కోట్లతో పరికరాల సరఫరాకు టెండర్ లేకుండా డొల్ల కంపెనీ పేరుతో బంధువులతో సరఫరా చేయించడంపైనా విచారణ జరిగింది. కంపెనీ అడ్రసు తప్పని తేలినా చర్యలు తీసుకోలేదు. ఒక్కో యూనిట్ రూ.12 లక్షలకు బహిరంగ మార్కెట్‌లో లభ్యత ఉండగా.. రూ.28 లక్షలపైగా చెల్లించి, ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. మరో 9 ల్యాబ్‌లకు రూ.12 లక్షల చొప్పున వచ్చే పరికరాలకు రూ.22.44 లక్షలు బిల్లు చేశారు. గత ప్రభుత్వంలో ఆగ్రోస్ ద్వారా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు సరఫరా చేసిన వెయ్యి ట్రాక్టర్లకు సంబంధించి మూడు కంపెనీల ఇన్వాయిస్‌కు, ఇన్సూరెన్స్ సొమ్ముకు రూ.లక్షల్లో వ్యత్యాసం ఉందన్న ఆరోపణలు వచ్చాయి.

అర్హత లేని కంపెనీలతో..

గతేడాది వ్యవసాయ యాంత్రీకరణ సబ్-మిషన్ (ఎస్ఎంఏఎం) పథకం కింద రైతులకు వ్యక్తిగత వ్యవసాయ యంత్రాల పంపిణీకి సంబంధించి కంపెనీలకు సరైన అర్హత పత్రాలు లేకుండానే పరికరాల సరఫరాకు అనుమతించారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది మార్చిలో పీఎంకేఎస్‌వై పథకం కింద రాయలసీమ రైతులకు వాటర్‌షెడ్ పరికరాల సరఫరాకు పంచాయతీరాజ్ శాఖ టెండర్లు పిలవాలని కోరితే.. టెండరు నిబంధనలు మార్చి.. ఎల్1 బిడ్‌తో గత ప్రభుత్వంలో లిక్కర్ స్కాంలో నిందితులకు అనుకూలంగా వ్యవహరించారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో టెండరుదారులు కోర్టుకు వెళ్లారు. దీంతో రైతులకు వాటర్‌షెడ్ పరికరాల సరఫరా నిలిచిపోయింది. ఈ వ్యవహారంలో ఓ కాంట్రాక్టు ఉద్యోగిని బదిలీ చేశారు. ఓ అధికారి సెలవుపై వెళ్లి తిరిగొచ్చారు. అంతకు మించి ఏమీ జరగలేదు. తాజాగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ట్రాక్టర్లను సరఫరా చేసినందుకు ఇన్వాయిస్ ప్రకారం బిల్లు పెట్టకుండా.. ఆగ్రోస్ అధికారి ఇబ్బందిపెడుతున్నారంటూ కడప జిల్లాకు చెందిన డీలర్ ఆరోపించారు. జీఎస్టీ, ఇన్సూరెన్స్, టీఆర్, యాక్సెసరీస్, ఇతరాలన్నీ కలిపి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5.75 లక్షలకు ఇన్వాయిస్ ఇస్తే.. బిల్లు మంజూరు చేయకుండా.. ట్రాక్టర్ ధర రూ.5.40 లక్షలేనని... మిగతా మొత్తం ఇచ్చేది లేదని అధికారులు కొర్రీ వేశారని.. లంచాల కోసమే బిల్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. కాగా.. ఏపీ ఆగ్రోస్‌కు గత ప్రభుత్వంలో నాన్ ఐఏఎస్‌లను ఎండీలుగా నియమించడంతో పర్యవేక్షణ లోపించిందన్న విమర్శలొచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారూ పూర్తిగా దృష్టిసారించలేకపోతున్నట్లు తెలిసింది. ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఉద్యోగులపై అజమాయిషీ కొరవడింది. మళ్లీ కొత్త చైర్మన్‌ను, రెగ్యులర్ ఎండీని నియమించి, ఉద్యోగుల అవకతవకలపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'గిరి ప్రగతి'లో సాంకేతిక

సిబ్బంది కొనసాగింపు

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరి ప్రగతి మానిటరింగ్ సిస్టంలో పనిచేస్తున్న 20 మంది టెక్నికల్ సిబ్బందిని కొనసాగిస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018లో గిరిజన ప్రాంతాలకు డిజిటల్ డెలివరీ సేవలు అందించేందుకు ఏపీటీఎస్ ద్వారా గిరిజన సంక్షేమశాఖ ఒక బృందాన్ని నియమించింది. ఆయా పథకాలకు సంబంధించి రూపొందించిన గిరిజన ప్రగతి మానిటరింగ్ సిస్టంకు సాంకేతిక పరంగా డిజైన్, అభివృద్ధి, అమలు, నిర్వహణ చేపట్టేందుకు 20 మందిని నియమించారు. వారిని మార్చి-2024 దాకా కొనసాగించారు. వారిని తిరిగి కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలంటూ గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ పలు దఫాలు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించలేదు. అయితే, తాజాగా వారిని మరో రెండేళ్లు(వచ్చే ఏడాది మార్చి దాకా) కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు. జీతాల బకాయిలు విడుదల కానున్నాయి.

నేవీ గూఢచర్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మన దేశ రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో మరో ఇద్దరు నిందితులకు శిక్షలు విధిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. రాజస్థాన్‌కు చెందిన అశోక్ కుమార్, వికాస్ కుమార్‌కు ఐదేళ్ల 11 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేకపోతే మరో ఏడాది పాటు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని నేవీ స్థావరాలకు చెందిన రహస్యాలను హనీ ట్రాప్(వలపువల) ద్వారా పాకిస్థాన్ సేకరిస్తోందని ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు 2019లో గుర్తించారు. అనంతరం ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించారు. ఉగ్రవాద నిరోధక చట్టం(యూఏపీఏ) కింద 2019 డిసెంబరు లో విశాఖతో పాటు దేశంలోని పలు పోర్టుల్లో గూఢచర్యానికి పాల్పడుతున్న 15మందిపై కేసు నమోదు చేసింది. 2020 జూన్‌లో 14మందిపై, 2021 మార్చి మరొకరిపై ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. ఎన్ఐఏ కోర్టు ఇప్పటికే ఆరుగురికి శిక్షలు విధించింది.

పాలెగాళ్లమండీ.. గుర్తించండి!



కడప జిల్లా ఎర్రమనేనిపాలెంలో సమావేశమైన పాలేకర్ల వారసులు (ఫైల్)

పాలేకర్ల వారసుల 'గుర్తింపు' పోరు!

- సంక్షేమ సంఘంగా ఏర్పాడిన 50 మంది
- పింఛన్ మొత్తం అమలు కోసం ఉద్యమం
- చరిత్ర, కట్టడాలను కాపాడాలని వినతి

(త్రిపురాంతకం - ఆంధ్రజ్యోతి)

'పాలెగాళ్లు'... అంటేనే ఒక పౌరుషం! అది శతాబ్దాలపాటు సాగిన పాలనా వ్యవస్థ! గ్రామీణ పరిపాలన నుంచి చిన్నపాటి రాజ్యాల రక్షణ వరకు వారిది కీలక పాత్ర! కాలక్రమంలో 'పాలెగాళ్ల' వ్యవస్థ రద్దయిపోయింది. కానీ... వారి వారసులు మాత్రం మిగిలే ఉన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం పాలనా వ్యవస్థలో స్థానికంగా బలంగా నిలిచిన పాలెగాళ్ల (పాలేకర్) వారసులు తమను గుర్తించాలని కోరుతున్నారు. రాష్ట్ర పాలేకర్ల వారసుల సంక్షేమ సంఘంగా ఏర్పాటై.. జిల్లాలవారీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాయలసీమలో అన్ని జిల్లాల్లో సమావేశాలు ముగిశాయి. త్వరలో ప్రకాశం జిల్లా పుల్లలచెరువులో సమావేశం కాబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 50 మంది పాలేకర్ల వారసులు ఉన్నట్లు (అత్యధికంగా కర్నూలు జిల్లాలో) గుర్తిస్తే.. అందులో ప్రకాశం జిల్లాలో ఐదుగురు ఉన్నారు. ప్రస్తుతం సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లాకు చెందిన కేశవులునాయుడు, ప్రధాన కార్యదర్శిగా పుల్లలచెరువుకు చెందిన కొర్లకుంట జానకిరఘు ఉన్నారు. పాలేకర్ల చరిత్రను ప్రజలకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో మైదుకూరుకు చెందిన ప్రముఖ రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి పుస్తక రూపంలో తీసుకొచ్చారు.



అన్నమయ్య జిల్లాలోని సోమపాళ్యంలో పాలేకర్లు నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం

ప్రధాన డిమాండ్లు ఇవీ..

ఒక నిర్దేశిత తవర్జీ పింఛన్ మొత్తాన్ని ప్రకటించి, నెలనెలా అందించాలని వారసులు డిమాండ్ చేస్తున్నారు. 'పాలేకర్లు నిర్మించిన కట్టడాలను పరిరక్షించి, చరిత్రను భావితరాలు తెలుసుకునేలా చేయాలి. కడప సుందరీకరణలో భాగంగా కడప, రాయచోటి ప్రధాన కూడళ్లలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. పలు ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా గుర్తించి ఆలయ ట్రస్టీలుగా పాలేకర్ల వారసులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. పాలేకర్లు నిర్మించిన చెరువులకు నిర్మించిన వారి పేర్లు పెట్టాలి' అని వారు కోరుతున్నారు.

బ్రిటిష్ పాలనలో అణచివేత

రెడ్డిరాజులు, విజయనగర రాజులు, మొగల్స్ కాలంలో మొదలైన పాలేకర్ల వ్యవస్థ మహమ్మదీయ రాజుల కాలంలో బలపడింది. వారి ఆధీనంలో కొన్ని గ్రామాలను ఉంచారు. ఒక్కొక్క పాలేకర్ వద్ద అనుచరగణం 500 నుంచి 2000 మంది వరకు ఉండేవారు. గ్రామాల్లో తగాదాలను పరిష్కరించడం, ప్రభుత్వానికి పన్ను వసూలు చేసి పంపడం వీరి బాధ్యత. తర్వాత బ్రిటిష్ పాలన రావడంతో 1800 సంవత్సరంలో సర్ థామస్ మన్రో సీడెడ్ జిల్లాల కలెక్టర్‌గా వచ్చి పాలేకర్లపై అణచివేత ధోరణి అవలంబించాడు. స్వతంత్రంగా పాలనా వ్యవస్థ నడుపుతున్న పాలేకర్లను లొంగిపోవాలని ఆదేశించి... వారికి జీవన భృతి ప్రకటించారు. పాలేకర్ల సమయంలో కట్టిన, నివసించిన కోటలు ఇప్పటికీ ఉన్నాయి. నంద్యాల జిల్లా నొస్సంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కోట, నొస్సం బురుజు, కడప జిల్లాలోని వేములకోట, అన్నమయ్య జిల్లాలోని సోమపాళ్యంలోని చెన్నకేశవస్వామి ఆలయం నిర్మాణాలు చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలి ఉన్నాయి.



నంద్యాల జిల్లా నొస్సంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కోట

'తవర్జీ'పై పొంతన లేని విధానం

పాలేకర్ వ్యవస్థ అణచివేత తర్వాత వారికి తవర్జీ పేరుతో పింఛన్ అందించారు. ఇప్పటికి కూడా కొద్ది మంది పింఛన్ తీసుకుంటుండగా.. దీనిపై స్పష్టమైన ప్రభుత్వ విధానం లేకపోవడంతో పలు వ్యత్యాసాలతో పొందుతున్నారు. 1801లో ఏడాదికి 209.5 అణాలుగా అప్పట్లో పింఛన్ నిర్ణయించారు. తర్వాత 1995 ఆగస్టు 4న పుల్లలచెరువుకు చెందిన కొర్లకుంట సత్యనారాయణరాజు (చిన్న సుబ్బనాయుడు) సంవత్సరానికి రూ.881 తీసుకున్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో గుడిపల్లికి చెందిన బలరామయ్య అనే వ్యక్తి ట్రెజరీ ద్వారా నెలకు రూ.18.61 అందుతోంది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం చాపలమడుగుకు చెందిన బోడా సూర్యనారాయణ 2007 ఫిబ్రవరి 7న చివరిసారిగా నెలకు రూ.2,282 తీసుకొని మృతిచెందారు. ఒక్కోచోట ఒక్కో విధంగా తవర్జీ అమలు సరికాదని... వారసులకు న్యాయబద్ధమైన మొత్తాన్ని అందజేయాలని పాలెగాళ్ల వారసులు కోరుతున్నారు.



రాజానగరం మండలం సంపత్‌నగరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, పక్కన ఎమ్మెల్యే బలరామకృష్ణ

4 గంటల్లోనే రైతులకు ధాన్యం సొమ్ము

- డిసెంబరు నెలాఖరుకు కొనుగోళ్లు పూర్తి: మంత్రి నాదెండ్ల మనోహర్

దివాన్‌చెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని సంపత్‌నగరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో యూరియా కొరత ఉండదని, కారణం 152 శాతం అధికంగా కేంద్రం నుంచి తీసుకున్నామని తెలిపారు. యూరియాపై కొంతమంది చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని రైతులకు సూచించారు. గత ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాలకోసం రైతులను ఓటు బ్యాంకుగా మార్చుకుని ఎన్నికలకు ముందు అనేక ఇబ్బందులు పెట్టిందంటూ గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో గోనెసంచులు లేకపోవడం, దూరప్రాంతాల మిల్లులకు లింక్ చేయడం వంటి సమస్యలు రైతులను అనేక ఇక్కట్లకు గురి చేశాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు 7 కోట్ల 54 లక్షల గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు డిసెంబరు 31వ తేదీనాటికి నాటికి పూర్తి చేయాలని మంత్రి మనోహర్ కోరారు.

రైతులకు జగన్ చేసిన మేలేమీ లేదు

- 900 కోట్లు ఇచ్చి.. 8 వేల కోట్లు అని అబద్ధాలు: మంత్రి అచ్చెన్న

సత్తెనపల్లి, అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తన ఐదేళ్ల పాలనలో జగన్ రైతులకు చేసిన మేలేమీ లేదని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. వైసీపీ పాలనలో రైతులకు మేలు చేయక పోగా రూ.8000 కోట్లు సాయం అందించామని జగన్ పచ్చి అబద్దాలు చెబుతున్నాడని కేవలం 900 కోట్లను మాత్రమే అందించారన్నారు. 16 నెలల కూటమి పాలనలోనే రైతులకు రూ.300 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. కాగా, రైతులకు ఉచితంగా టార్పాలిన్ పట్టాలు సరఫరా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

డ్రగ్స్ కేసులో కొండారెడ్డిపై పీటీ వారెంట్

- విశాఖ నుంచి బెజవాడకు తీసుకురానున్న పోలీసులు

విజయవాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో వైసీపీ విద్యార్థి విభాగం నేత కొండారెడ్డిపై పీటీ వారెంట్‌కు విజయవాడ ఎంఎస్‌జే(మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి) కోర్టు అనుమతి ఇచ్చింది. న్యాయాధికారి ఎ.సత్యానంద్ మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చారు. వైజాగ్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఆర్జా శ్రీవాత్సవ్, ఆయన ప్రియురాలు హవీలా డిలైట్ ఆగస్టులో బెంగళూరు నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను తరలిస్తూ విజయవాడ మహానాడు కూడలిలో ఈగల్, టాస్క్‌ఫోర్స్ బృందాలకు పట్టుబడ్డారు. వారికి డ్రగ్స్‌ను సరఫరా చేసిన చిత్తూరు జిల్లాకు చెందిన మల్లెల మధుసూదనరెడ్డి(మడ్డీ)ని కొద్దిరోజుల క్రితం మాచవరం పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. అతడితోపాటు రిమాండ్ ఖైదీగా ఉన్న వైజాగ్‌కు చెందిన జోగా లోహిత్ యాదవ్‌ను పోలీసులు విచారించగా వైజాగ్‌లో వైసీపీ విద్యార్థి విభాగం నేతగా వ్యవహరిస్తున్న కొండారెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. కొండారెడ్డి ప్రస్తుతం విశాఖ పోలీసులకు డ్రగ్స్‌తో చిక్కి జైల్లో ఉన్నాడు. అతడిని బెజవాడ కోర్టులో హాజరుపరిచేందుకు రెండు రోజుల్లో వైజాగ్ నుంచి పీటీ వారెంట్‌పై తీసుకురానున్నారు.



సచివాలయ సిబ్బంది పదోన్నతులపై సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, నారాయణ, అనిత, అనగాని, గొట్టిపాటి

సచివాలయ వ్యవస్థపై అధ్యయనం

- మార్చి నాటికి నివేదిక.. తర్వాత చర్యలు
- మంత్రుల బృందంతో ఉపముఖ్యమంత్రి చర్చ
- పదోన్నతులపైనా సమీక్షించిన పవన్ కల్యాణ్

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల పనితీరు, ఆ వ్యవస్థ నిర్మాణంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. మార్చి నాటికి దీనికి సంబంధించిన నివేదికను రూపొందించాలన్నారు. మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రుల బృందంతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బందికి పదోన్నతుల కల్పన, ఇతర శాఖలతో అనుసంధానించడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినప్పటికీ సచివాలయ వ్యవస్థ నిర్మాణం దెబ్బతినకుండా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవసరమైతే ప్రతి నెలా సమీక్షిద్దామని చెప్పారు. ఈ సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

విశాఖలో రిలయన్స్ డేటా సెంటర్

- 1.25 లక్షల కోట్లతో 1 గిగావాట్ ఏర్పాటుకు ప్రతిపాదన
- 500 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వం సుముఖం
- భూముల పరిశీలనకు రిలయన్స్ సిద్ధం



అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ డేటా సెంటర్లకు విశాఖ మహానగరం కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. తాజాగా రూ. 1,25,000 కోట్లతో ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. డేటా సెంటర్ ఏర్పాటుకు వెయ్యి ఎకరాలు కేటాయించాలంటూ కోరింది. అయితే, ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఇతర డేటా సెంటర్లకు కేటాయించినట్లే 500 ఎకరాలను కేటాయిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ భూములను రిలయన్స్ సంస్థకు చూపించేందుకు విశాఖ రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఈ భూములను రిలయన్స్ సంస్థ ప్రతినిధులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశాక తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ భూ కేటాయింపులపై రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ, ఆ తర్వాత పెట్టుబడుల ప్రోత్సాహక మండలి, రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం పొందిన వెంటనే ఉత్తర్వులను జారీ చేస్తామని ప్రభుత్వ అధికారులు చెప్పారు.

నేడే స్టూడెంట్ అసెంబ్లీ

- ప్రత్యక్షంగా వీక్షించనున్న సీఎం, మంత్రులు
- నాయకత్వ లక్షణాలు పెంచడమే లక్ష్యం



మంగళవారం నాడు అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ రిహార్సల్స్‌లో విద్యార్థులు

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వినూత్నంగానిర్వహిస్తున్న 'విద్యార్థుల అసెంబ్లీ' బుధవారం అసెంబ్లీ ఆవరణలో జరగనుంది. శాసనసభ ఆవరణలో ఏర్పాటు చేసిన నమూనా అసెంబ్లీ దీనికి వేదిక కానుంది. 8, 9, 10 తరగతుల విద్యార్థులను నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఎంపిక చేశారు. వారితో మంగళవారం వేదికపై ప్రాక్టీస్ చేయించారు. మొత్తం 175 మంది విద్యార్థులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తారు. ఉదయం 9.30 గంటలకు ప్రొటెం స్పీకర్‌గా ఒకరు అసెంబ్లీని ప్రారంభిస్తారు. అనంతరం, స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. సీఎం, ప్రతిపక్ష నేత, మంత్రులుగా విద్యార్థులు వ్యవహరిస్తారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ తర్వాత సోషల్ మీడియా వినియోగం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై బిల్లులు పెట్టి చర్చిస్తారు. సుమారు 2 గంటల పాటు విద్యార్థుల అసెంబ్లీ జరిగేలా పాఠశాల విద్యాశాఖ కార్యాచరణను రూపొందించింది. ఈ అసెంబ్లీకి సీఎం, మంత్రులు హాజరుకానున్నారు. సభ అనంతరం విద్యార్థులను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తారు. ఆ తర్వాత విద్యార్థులతో గ్రూప్ ఫొటో దిగుతారు. విద్యార్థులను అసలు అసెంబ్లీ హాలు సందర్శనకు తీసుకెళ్తారు. అనంతరం 'చిన్నారుల భారత రాజ్యాంగం' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరిస్తారు.

ఉద్యాన హబ్‌గా రాయలసీమ

సీమ, ప్రకాశం జిల్లాల్లో ప్రోత్సాహకాలు.. రూ.40 వేల కోట్లతో ప్రణాళిక

- ఉద్యాన శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష



ఉద్యాన పంటలపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులు

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఉద్యాన శాఖ పని చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచంలో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల్లో 18 రకాలు రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోనే పండుతాయని అన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం పూర్వోదయ పథకం నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయలసీమ ఉద్యాన పంటల అభివృద్ధిపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం సమీక్ష జరిపారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా రైతులకు జీవనోపాధి పెంచేలా కార్యాచరణ రూపొందించారు. పూర్వోదయ పథకంలో భాగంగా రహదారులు, జలవనరుల ప్రాజెక్టుల వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు లబ్ధిచేకూరేలా రూ.40వేల కోట్లతో అమలు చేయనున్న ప్రణాళికపై సమీక్షించారు. అలాగే ప్రపంచ బ్యాంక్ నిధులతో రాయలసీమ అభివృద్ధికి ఏయే అంశాల్లో దృష్టి సారించాలనే దానిపైనా, నీతి ఆయోగ్ సిఫారసులతో రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉద్యానవనాలు, రహదారులు, జలవనరులు వంటి అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాయలసీమలో 65రకాల ఉద్యాన పంటలు పండుతుంటే.. 18 పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

రైతులకు మేలు కలగాలి

"రెగ్యులర్ ఉద్యాన పంటల కంటే.. భవిష్యత్‌లో ప్రజల అలవాట్లకు అనుగుణంగా పంటలు పండించాలి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో టేబుల్ వెరైటీలను పండించి, ఆ పంటలకు విలువ జోడించాలి. అప్పుడు రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఈ ఉద్యాన పంటలకు నీటిని అందించాలి. హార్టికల్చర్ జోన్లుగా తీర్చిదిద్ది, ప్రోత్సాహకాలు కల్పించాలి. ఆర్గానిక్ సేద్యంతో పంటలు పండించాలి. ఆక్వా రంగం తరహాలోనే ఉద్యాన రంగం కూడా భవిష్యత్‌లో అగ్రస్థానానికి చేరుతుంది. రాయలసీమ, ప్రకాశంలో ప్రస్తుతం ఉన్న 10 రకాల ఉద్యాన పంటలతో పాటు డిమాండ్ ఉన్న మరో 8 రకాలను పండించేలా చర్యలు తీసుకోవాలి. 50 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల ద్వారా పెద్దఎత్తున రైతులకు ప్రయోజనం కలుగుతుంది. 18 ముఖ్యమైన పంటలను లక్ష్యంగా చేసుకుని, వాటికి మంచి సాగు సదుపాయాలు, రవాణా, మార్కెటింగ్, కోల్డ్‌చైన్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి" అని అన్నారు.

అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి

"దుబాయ్ లాంటి ప్రాంతాలకు ఎయిర్ కార్గో ద్వారా పండ్లను రవాణా చేయగలగాలి. దుబాయ్ నుంచి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు పండ్లను రవాణా చేసే అవకాశం ఉంటుంది. స్పెషల్ కార్గోగా పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తే రైతులు, రాయలసీమ, ప్రకాశం ప్రాంత భవిష్యత్ మారిపోతుంది. రాయలసీమ ప్రాంతంలో ఇంకా కవర్ కాని ప్రాంతాలను గుర్తించి, అక్కడికీ నీటి సరఫరా కోసం ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయాలి. సీమలో మారుమూల ప్రాంతాలను కలుపుతూ మరికొన్ని రహదారులు రావాల్సి ఉంది. తద్వారా మార్కెటింగ్ మెరుగుపడుతుంది. ఉద్యాన పంటల సాగు మొదలు మార్కెటింగ్ వరకు మొత్తం రూ.14,800కోట్లు ప్రాజెక్టులకు ఖర్చుపెట్టబోతున్నాం. సబ్సిడీగా 9వేల కోట్లు ఇచ్చేలా ప్రణాళిక వేస్తున్నాం. ఈ విషయం రైతులకు అర్థమయ్యేలా చెప్పాలి. అరటి, చీని, బొప్పాయి, దానిమ్మ, మామిడి, నిమ్మతో పాటు ఉల్లి, టమోటా, మిర్చి వంటి పంటలపై దృష్టి పెట్టాలి" అని సీఎం సూచించారు. ప్రభుత్వ చర్యల వల్ల రాయలసీమలో భూగర్భ జలాలు మెరుగ్గా ఉన్నాయన్న ప్రస్తావన ఈ సమీక్షలో వచ్చింది. హంద్రీ-నీవా సహా వివిధ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేస్తుండటంతో సీమలో ఉద్యాన సాగు గతంతో పోల్చుకుంటే సులభతరమైందని మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. పంటలు చక్కగా పండటం వల్ల రైతులకు ఆదాయంతో పాటు భూముల రేట్లు పెరిగాయని, దానికి ఉమ్మడి అనంతపురం జిల్లానే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు.

స్టెమీతో 95.94% మందికి ప్రాణదానం

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి


అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గుండెపోటు మరణాలను తగ్గించేందుకు అమలు చేస్తున్న స్టెమీ ప్రాజెక్టుతో గతేడాది జూన్ 1 నుంచి ఈ నెల 15 వరకు 3,027 మంది ప్రాణాలు నిలిచాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో ప్రవేశపెట్టిన స్టెమీ విధానం కింద ఖరీదైన టెనెక్టప్లస్ ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వడం ద్వారా విలువైన ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. ఛాతీ నొప్పి లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చినవారిలో ఈ ఇంజక్షన్ అవసరమని గుర్తించిన 3,155 మందిలో 3,027 (95.94%) మంది ప్రాణాలు నిలబడినట్లు పేర్కొన్నారు. స్టెమీ కింద ప్రతి నెలా సగటున 175 మంది ప్రభుత్వాస్పత్రుల్లో టెనెక్టప్లస్ ఇంజక్షన్ పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

మన సంస్కృతి, నాగరికత దేశానికి పునాది

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, నాగరికత ఎప్పుడూ భారతదేశానికి పునాదిగా ఉన్నాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం కేవలం నిర్మాణ ప్రాజెక్టు మాత్రమే కాదని, ఇది సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతీకగా పేర్కొన్నారు. సనాతన ధర్మం లోతైన జ్ఞానం, సమానత్వం, సోదరభావం, శాంతి, సామరస్యంతో పాటు ప్రకృతిని తల్లితో పోల్చి చూపడం వంటి లోతైన విషయాల్ని నేర్పిందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వలస రాజ్య చిహ్నాలు, సంకేతాలను కడిగివేయడమే కాకుండా, మన స్వంత గుర్తింపును తిరిగి పొందేందుకు జాతీయ స్వీయ విలువ భావాలను పునరుద్ధరించడానికి చొరవ తీసుకోవడంపై సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. నావికాదళంలోని సెయింట్ జార్జ్ శిలువ స్థానంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ రాజముద్ర వేయడం మన వీరులను గౌరవించడం అవుతుందన్నారు. మన భారతీయతను తిరిగి తీసుకురావడానికి ఇది ఒక శక్తిమంతమైన మేల్కొలుపుగా పవన్ అభివర్ణించారు.

మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాలు, 19 మండలాలతో 27వ జిల్లాగా దీనిని ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. దీనిలో మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాలు (మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, కురబలకోట, పెద్ద తిప్పసముద్రం, బి.కొత్తకోట, చౌడేపల్లి, పుంగనూరు).. కొత్తగా ఏర్పడే పీలేరు డివిజన్‌లోని 8 మండలాలు.. (సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం) ఉంటాయి.



మదనపల్లె జిల్లా

మార్కాపురం జిల్లా

ప్రకాశం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు, 21 మండలాలతో ప్రత్యేక మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలన్న ఉపసంఘం సిఫారసును ముఖ్యమంత్రి ఆమోదించారు. ఇది 28వ జిల్లా. ఇందులో మార్కాపురం డివిజన్‌లోని 9 మండలాలు (యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల).. కనిగిరి డివిజన్‌లో 12 మండలాలు (హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెద్ద చెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు) ఉంటాయి.




ఊహాగానాలకు, కోరికలకు చెక్

9 జిల్లాల్లో మార్పులు లేవు

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో కొత్త డివిజన్లు, మండలాల ఏర్పాటు, జిల్లా ప్రధాన కేంద్రాల మార్పుపై ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నుంచి మంత్రివర్గ ఉపసంఘానికి అనేక విన్నపాలు వచ్చాయి. అందులో అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి రాజంపేటకు.. పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రాన్ని భీమవరం నుంచి నరసాపురానికి మార్చాలన్న సూచనలు కూడా ఉన్నాయి. అయితే ముఖ్యమంత్రి ఈ అంశాల జోలికి ఇప్పుడు వెళ్లొద్దని, అవసరాన్ని బట్టి తర్వాత పరిశీలిద్దామని సూచించడంతో ఉపసంఘం ఆ ప్రతిపాదనలు చేయలేదని తెలిసింది. దీంతో జిల్లా, డివిజన్ కేంద్రాల మార్పుపై ఊహాగానాలకు, నేతల వినతులకు చెక్ పెట్టినట్లయింది. దీంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పుచేర్పులనూ ప్రతిపాదించలేదు.

ఏపీ@29 జిల్లాలు



(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా పెద్ద హరివాణం మండలంఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. సదరు నివేదికపై చంద్రబాబు ఉపసంఘం సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ఆ తర్వాత కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సుదీర్ఘ చర్చల అనంతరం నివేదికను సీఎం ఆమోదించారు. 3 కొత్త జిల్లాలు, 5 కొత్త రెవెన్యూ డివిజన్లు, ఒక కొత్త మండలం ఏర్పాటుకు ఉపసంఘం సిఫారసు చేసింది. కొన్ని నియోజకవర్గాలను, మండలాలను వేర్వేరు జిల్లాలు, డివిజన్లకు మార్చాలని సూచించింది. మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫైలును రెవెన్యూ శాఖ సిద్ధం చేస్తోంది. బుధవారం దానిని మంత్రులకు సర్క్యులేట్ చేసి ఆన్‌లైన్‌లోనే ఆమోదం తీసుకుంటారు. ఆ వెంటనే రెవెన్యూ శాఖ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు జారీచేస్తుంది. అభ్యంతరాలకు నెల రోజులు గడువిస్తారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ ఇస్తారు.

ప్రతిపాదిత జిల్లాలు, డివిజన్ల స్వరూపం..

ప్రస్తుతం రాష్ట్రంలో 26 జిల్లాలు, 77 రెవెన్యూ డివిజన్లు, 679 మండలాలున్నాయి. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలం రాకతో ఇక 29 జిల్లాలు, 82 రెవెన్యూ డివిజన్లు, 680 మండలాలు అవుతాయి.

5 రెవెన్యూ డివిజన్లు ఇలా..

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 77 రెవెన్యూ డివిజన్లకు మరో ఐదు కలవనున్నాయి. నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిర, బనగానపల్లె రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. వాస్తవానికి మొదట 4 డివిజన్లకే సిఫారసు చేసింది. అయితే ముఖ్యమంత్రితో మంగళవారం సమావేశమైనప్పుడు.. కొత్తగా బనగానపల్లె నియోజకవర్గ కేంద్రాన్ని కూడా డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఆదోని మండలాన్ని విభజించి..

కర్నూలు జిల్లాలోని ఆదోని మండలాన్ని పునర్వ్యవస్థీకరించి కొత్తగా పెద్దహరివాణం మండలం ఏర్పాటు చేయాలన్న ఉపసంఘం సిఫారసును సీఎం ఆమోదించారు. దీంతో రాష్ట్రంలో మొత్తం మండలాల సంఖ్య 680కి చేరనుంది.



29వ జిల్లాగా పోలవరం..

ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను కొత్తగా ఏర్పాటుచేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. దీనిలో మొత్తం 11 మండలాలు.. రంపచోడవరం డివిజన్‌లోని 7 మండలాలు (రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి).. చింతూరు డివిజన్‌లోని 4 మండలాలు (యటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం) ఉంటాయి. నిజానికి ముంపు మండలాలతో తొలుత పోలవరం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని ఉపసంఘం భావించినా సీఎం వద్దన్నారు. ముంపు మండలాల అభివృద్ధికి కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని లోగడ ఆయన అరకులో టీడీపీ నిర్వహించిన సభలో హామీ ఇచ్చారు. ఆ మేరకే జిల్లాను ఏర్పాటు చేద్దామని సూచించారు. దీంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని ఉపసంఘం సిఫారసు చేసింది. పోలవరం నియోజకవర్గం దీని పరిధిలో లేకున్నా.. జిల్లాకు పోలవరం పేరు పెట్టడం గమనార్హం.

ఉపసంఘం సిఫారసులు ఇవే..

- శ్రీకాకుళం జిల్లాలోని నందిగాం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చాలి. దీంతో టెక్కలి నియోజకవర్గమంతా ఒకే డివిజన్ పరిధిలో ఉంటుంది.
- పాయకరావుపేట, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాల మండలాలను కొత్తగా ఏర్పాటు చేసే నక్కపల్లి డివిజన్‌లో కలపాలి.
- నర్సీపట్నం డివిజన్‌లో ఉన్న వడ్డాది మాడుగుల, చీడికాడ మండలాలను అనకాపల్లి డివిజన్‌లోకి తీసుకురావాలి. దీనివల్ల మాడుగుల నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉంటుంది.
- కాకినాడ జిల్లా సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌కు మార్చాలి. అప్పుడు పెద్దాపురం నియోజకవర్గమంతా ఒకే డివిజన్ పరిధిలోకి వస్తుంది.
- రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాలతో కూడిన మండపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలి. అంటే నియోజకవర్గం మొత్తాన్నీ తూర్పుగోదావరిలో కలుపుతారన్న మాట. అప్పుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా ఆరు అసెంబ్లీ స్థానాలకే పరిమితమవుతుంది. తూర్పు గోదావరి జిల్లాలోని నియోజకవర్గాల సంఖ్య 8కి చేరుతుంది.
- పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం పేరు వాసవీ పెనుగొండగా మార్చాలి.
- టీడీపీ యువనేత లోకేశ్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అద్దంకి డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదన.
- ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయాలి. సీఎం చంద్రబాబు హామీ ప్రకారం నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని కూడా తిరిగి ప్రకాశం జిల్లాలోకి తీసుకురావాలి.
- నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను గూడూరు డివిజన్‌లో కలపాలి. ప్రస్తుతం ఈ డివిజన్ తిరుపతి జిల్లాలో ఉంది.
- పలమనేరు డివిజన్‌లో ఉన్న బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో కలపాలి. దీంతో పూతలపట్టు నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉంటుంది.
- పలమనేరు డివిజన్‌లో ఉన్న చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లె డివిజన్‌లో కలపాలి.
- కడప జిల్లా ఒంటిమిట్ట మండలాన్ని రాజంపేట డివిజన్‌లో కలపాలి. దీంతో రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలన్నీ ఒకే డివిజన్‌లోకి వస్తాయి.
- శ్రీసత్యసాయి జిల్లా కదిరి డివిజన్‌లో ఉన్న అమడగూరు మండలాన్ని పుట్టపర్తి డివిజన్‌లో విలీనం చేయాలి.
- ఇదే జిల్లా గోరంట్ల మండలాన్ని పుట్టపర్తి డివిజన్ నుంచి.. తిరిగి పెనుకొండ డివిజన్‌లో కలపాలి.
- డోన్, నంద్యాల డివిజన్‌లో ఉన్న మండలాలను విడదీసి కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేయాలి. ఇందులో అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాలు ఉంటాయి. బనగానపల్లె నియోజకవర్గానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

73 ఏళ్లు.. 73 డిగ్రీలు!



- చదువుల్లో 'మెగాస్టార్' డాక్టర్ కర్రి రామారెడ్డి
- తాజాగా ఒకే సెమిస్టర్లో 12 ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ కోర్సులు!

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా నిత్య విద్యార్థిగా జ్ఞాన సముపార్జనే జీవన విధానంగా మార్చుకున్న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి మరో మైలు రాయిని అధిగమించారు. ఇప్పటికే పలు భిన్నమైన డిగ్రీలు సాధించిన ఆయన, దేశంలోనే పేరుగాంచిన ఐఐటీ సంస్థలు నిర్వహించే ఎన్‌పీటీఈఎల్ కోర్సులను పూర్తిచేయడంపై దృష్టి సారించి ఒకే సెమిస్టర్‌లో 12 కోర్సులు పూర్తి చేసి రికార్డు సృష్టించారు. అంతేకాక, పరీక్షా ఫలితాల్లో 8 కోర్సులు విశిష్ట శ్రేణి(ఎలైట్ ప్లస్ గోల్డ్), 4 కోర్సులు విశిష్ట శ్రేణి(ఎలైట్ ప్లస్ సిల్వర్)లోనూ ఉత్తీర్ణత పొంది, వరుసగా మూడోసారి 'మెగాస్టార్' టైటిల్‌ను కైవశం చేసుకున్నారు. తాజాగా సాధించిన 12 సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 73కు చేరుకున్నాయి.

డిగ్రీలన్నీ పరీక్షలు రాసి సంపాదించినవే: రామారెడ్డి

రాజమహేంద్రవరంలోని మానస హాస్పిటల్‌లో రామారెడ్డి మీడియాతో మంగళవారం మాట్లాడారు. తాను పూర్తిచేసిన అన్ని డిగ్రీలూ.. పరీక్షల ఆధారంగా సంపాదించినవేనని, ఏదీ ఆయాచితంగా గానీ, గౌరవపూర్వక నామమాత్రపు అర్హతతో పొందినవి కానీ లేవని స్పష్టం చేశారు. వచ్చే సెమిస్టర్ కోర్సుల్లో 16 కోర్సులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు రామారెడ్డి తెలిపారు.

అంధ బాలల కోసం 'బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్'!

- సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేసిన గీతం అధ్యాపకుడు
- విద్యార్థులు స్వయంగా బ్రెయిలీ నేర్చుకునే వెసులుబాటు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దృష్టి లోపం ఉన్నవారికి బ్రెయిలీ లిపి ఓ వరం. ఈ లిపిని బోధించే అధ్యాపకులు విద్యార్థులకు అన్నివేళలా దగ్గరే ఉండి బోధించడం సాధ్యం కాదు. ప్రత్యేక పాఠశాలలు లేని ప్రాంతాల్లో చదువుకోవాలన్న అభిలాష ఉన్న చిన్నారులకు మరీ కష్టం. ఈ సమస్యను పరిష్కరించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్ పేరిట సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేశారు. కంటి చూపు లేని బాలలు గురువు సహాయం లేకుండా స్వయంగా బ్రెయిలీ నేర్చుకునేలా దీనిని తీర్చిదిద్దారు. ఈ లెర్నింగ్ అసిస్టెంట్ ఎంబెడెడ్ కిట్ బ్రెయిలీ లిపిని ఇంటి వద్ద ఉంటూ మరింత సులభంగా నేర్చుకునేలా చేస్తుందని చిస్తీ తెలిపారు. దీనికి పేటెంట్ కోసం దరఖాస్తు చేశామని చెప్పారు. ఈ పరికరంలో 3 బై 2 ఆకారంలో గుల్లగా ఉన్న బ్రెయిలీ సెల్ ఉంటుంది. ఇందులోని సెన్సర్లు విద్యార్థి ఉంచిన డాట్స్‌ను కచ్చితంగా గుర్తిస్తాయని, ఆ ప్యాటర్న్‌ను సిస్టమ్ డీకోడ్ చేసి సంబంధిత అక్షరం, సంఖ్య లేదా సూచనను ఆడియో రూపంలో విద్యార్థులకు వినిపిస్తుందని వివరించారు. తద్వారా వారు బ్రెయిలీని స్వయంగా నేర్చుకోవడం సులభమవుతుందన్నారు. గురువుల మీద ఆధారపడే అవసరాన్ని ఈ పరికరం గణనీయంగా తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని తెలిపారు. ఈ పరికరం తయారీలో టి.సూర్యస్వరూప్, మహ్మద్ ఎహసాన్, మహ్మద్ సమీమ్ సుల్తానా ఎంతో సహకరించారని డాక్టర్ చిస్తీ తెలిపారు.



బ్రెయిలీ అభ్యాస పరికరాన్ని అభివృద్ధి చేసిన డాక్టర్ చిస్తీ



నిరక్షరాస్యుల కోసం

అక్షరాంధ్ర

- ఏటా 25లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లక్ష్యం
- చదవడం, రాయడం, లెక్కలపై అవగాహన
- పథకం అమలుపై పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ 'అక్షరాంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర పథకం 'ఉల్లాస్'తో అనుసంధానం చేసుకుని, అక్షరాంధ్రను అమలుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీనికి సంబంధించిన విధివిధానాలను కూడా అందులో పొందుపరిచారు. గ్రామ వార్డు సచివాలయాల సర్వే ప్రకారం రాష్ట్రంలో 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్కులు 81లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. వారందరినీ అక్షరాస్యులుగా మార్చడం లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమం అమలుచేస్తారు. ఏడాదికి 25లక్షల మందికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా మార్చనున్నారు. వారికి మాతృభాష చదవడం, రాయడం, కూడికలు తీసివేతలు లాంటి చిన్నపాటి లెక్కలపై అవగాహన కలిగేలా వారికి ప్రాథమికాంశాలను బోధిస్తారు. అలాగే డిజిటల్, ఫైనాన్షియల్, ఆరోగ్యం, న్యాయ అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. వలంటీర్లను నియమించి వారి ద్వారా వయోజనులకు బోధిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లను ఇందుకోసం వినియోగిస్తారు. ఉదయం, సాయంత్రం, వారాంతాల్లో తరగతులు నిర్వహిస్తారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్లు ఇస్తారు.

సూపర్ వుడ్..

ఉక్కును మించిన చెక్క



- అల్యూమినియం కన్నా తేలిక.. అమెరికా శాస్త్రజ్ఞుల ఆవిష్కరణ
- సాధారణ చెక్కలోనే రసాయనిక మార్పులతో అభివృద్ధి
- నిర్మాణ, రక్షణ, వాహన తయారీ రంగాల్లో వినియోగం

న్యూయార్క్, నవంబరు 25: ఉక్కు కన్నా శక్తిమంతమైన.. అల్యూమినం కన్నా తేలికైన, పర్యావరణహితమైన చెక్క ఆధారిత ఉత్పత్తిని అమెరికాలోని మేరీల్యాండ్ వర్సిటీ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. ప్రకృతి సిద్ధమైన సాధారణ చెక్కనే రసాయన, యాంత్రిక మార్పులకు గురిచేయడం ద్వారా దాన్ని వారు కొన్ని పారిశ్రామిక లోహాల కన్నా మరింత బలంగా, దృఢంగా.. ఒక్క మాటలో చెప్పాలంటే 'సూపర్ వుడ్'గా మార్చగలిగారు. ఉక్కు బరువుతో పోలిస్తే ఆ చెక్క బరువు ఆరోవంతే! కానీ.. శక్తి మాత్రం ఉక్కుకన్నా 10 రెట్లు ఎక్కువ. సహజంగా భూమిలో కలిసిపోయే పదార్థం కావడంతో పర్యావరణానికి హానికరం కాదు. సూపర్‌వుడ్ తయారీలో భాగంగా తొలుత మామూలు చెక్కను తీసుకుని దానిలోని కొన్ని ముఖ్యమైన భాగాలను ముందుగా తొలగిస్తారు. చెక్కలో ముఖ్యమైన భాగాలు.. సెల్యులోజ్, హెమీసెల్యులోజ్, లిగ్నిన్. వీటిలో లిగ్నిన్‌ను ఎక్కువగా, హెమీసెల్యులోజ్‌ను కొంతమేర తొలగిస్తారు. దీంతో చెక్క మృదువుగా తయారవుతుంది. అనంతరం అధిక ఒత్తిడి, ఎక్కువ ఉష్ణోగ్రత ఉపయోగించి ఆ చెక్కను కంప్రెస్ చేస్తారు. దీంతో చెక్కలో ఉండే సూక్ష్మతంతువులన్నీ ఒకదానికొకటి అతుక్కుపోయేంత దగ్గరగా జరిగి ఆ చెక్క అత్యధిక సాంద్రత కలిగిన బ్లాకుగా మారుతుంది. అదే పరిమాణంలో ఉన్న చెక్కతో పోలిస్తే.. ఈ సూపర్ వుడ్ దృఢత్వం 3 నుంచి 10 రెట్లు ఎక్కువగా మేరీల్యాండ్ వర్సిటీ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇలా తయారుచేసిన చెక్క టెన్సైల్ స్ట్రెంత్ (తెంపడానికి కావాల్సిన శక్తి.. ఉదాహరణకు ప్లాస్టిక్ కవర్‌ను అటూ ఇటూ పట్టుకుని లాగితే ఇట్టే చినిగిపోతుంది. అదే.. ప్లాస్టిక్ తాడు తెగాలంటే చాలా ఎక్కువ బలం కావాలి. ఇనప తీగను తెంపాలంటే ఇంకా ఎక్కువ బలం కావాలి) అత్యున్నత శ్రేణి మిశ్రలోహాలకు సమానంగా ఉందని పరీక్షల్లో తేలింది. అదే సమయంలో.. ఈ చెక్క బరువు ఆయా లోహాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడం గమనార్హం. ఇక.. సాధారణ చెక్క కంప్రెసివ్ స్ట్రెంత్ (అంటే చెక్కను ఎంత గట్టిగా నొక్కితే అది విరుగుతుందో తెలిపే బలం).. 35 ఎంపీఏ(మెగాపాస్కల్)గా ఉంటుంది. కానీ ఈ సూపర్‌వుడ్ కంప్రెసివ్ బలం ఏకంగా 160 ఎంపీఏ. ఇక.. దీని ఫ్లెక్సురల్ స్ట్రెంత్ (ఎంత బరువు పెడితే ఒక చెక్క వంగుతుందో తెలిపే బలం) ఏకంగా అల్యూమినియంకు సమానంగా 330 ఎంపీఏ ఉంటుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. కాగా.. 'ఇన్వెంట్‌వుడ్' అనే కంపెనీని ప్రత్యేకంగా స్థాపించి.. ఈ సూపర్ వుడ్‌ను వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. నిర్మాణ రంగం, విమానాల తయారీ, ఆటోమోటివ్, రక్షణ రంగాల్లో దీన్ని వినియోగించేందుకు సిద్ధం చేస్తున్నారు.

మీకా అధికారమే లేదు

(మొదటి పేజీ తరువాయి)

వినిపించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా జలాల కేటాయింపులను పునఃసమీక్షించాలన్న తెలంగాణ అభ్యర్థనతో 2023లో కేంద్రం ఇచ్చిన గెజిట్ మేరకు ట్రైబ్యునల్ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు ఇప్పటికే ముగియగా.. ఏపీ తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా మంగళవారం వాదనలు వినిపించారు. ఒక్క ప్రాజెక్టుకూ నీటి కేటాయింపులను మార్చేందుకు వీల్లేదన్నారు. 'కేటాయింపులపై తొలి నుంచీ వాదనలు వింటామంటే కుదరదు. ఈ కేటాయింపుల జోలికి వెళ్లేందుకు ట్రైబ్యునల్‌కు అధికారమే లేదు. విభజన చట్టంలోని సెక్షన్ 89.. సబ్‌పేరా 4.1 ప్రకారం.. కృష్ణా జలాల కేటాయింపులను తిరగదోడేందుకు, మార్చడానికి వీల్లేదు' అని తేల్చిచెప్పారు. తెలంగాణ కొత్తగా పుట్టిన బిడ్డేమీ కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్రప్రదేశ్ విడిపోయిందని.. రాజధాని హైదరాబాద్‌ను కూడా కోల్పోయిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్మాణాలకు తెలంగాణ కూడా బాధ్యత వహించాల్సిందేనన్నారు. వందేళ్ల క్రితం నుంచే కృష్ణా ప్రాజెక్టులకు కేటాయింపులున్నాయని ఆధారాలతో ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. కావేరి జలవివాదానికి, కృష్ణా జలాల వివాదానికి పొంతన లేదన్నారు. కృష్ణా ట్రైబ్యునల్-1, ట్రైబ్యునల్-2లో ఇప్పటికే ఉమ్మడి ఏపీలోని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరిగిపోయాయని గుర్తుచేశారు. వాటిపై పునఃసమీక్ష జరిపే అధికారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు లేదన్నారు. 'విభజన చట్టం మేరకు కొద్ది మార్పులకు వీలున్నా.. నదీ జలాల విషయంలో జోక్యం చేసుకునే పరిధి ట్రైబ్యునల్‌కు లేదు. గత ట్రైబ్యునళ్లు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడం తప్ప.. మార్పులూ చేర్పులూ చేసేందుకు దానికి అధికారం ఉండదు. 2002కి ముందున్న కేటాయింపుల జోలికి వెళ్లేందుకు వీల్లేదు. ఫర్దర్ టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (ఎఫ్‌టీవోఆర్)ను మార్చేందుకు కూడా వీల్లేదు. ట్రైబ్యునల్-1 చేసిన కేటాయింపులను బట్టి ప్రాజెక్టులను నిర్మించినట్లుగానే భావించాల్సి ఉంటుంది' అని గుప్తా తేల్చిచెప్పారు. మంగళవారం నాటి విచారణకు వైద్యనాథన్ కూడా హాజరయ్యారు. బుధ, గురు వారాల్లో కూడా ట్రైబ్యునల్ విచారణ కొనసాగనుంది.

నైలు నదిలో మొసళ్లెన్ని?

(మొదటి పేజీ తరువాయి)



తలనీలాలు ఇచ్చిన వారు ఎంతమంది? నిన్న తిరుపతిలో కురిసిన వాన చినుకులు ఎన్ని? అని అడిగితే ఏమి సమాధానం చెప్పగలనో... పరకామణి కేసులో అంతే సమాధానం చెప్పాను" అని అన్నారు. పరకామణి చోరీ కేసులో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ ఎదుట భూమన విచారణకు హాజరయ్యారు. మాజీ ఏవీఎస్వో సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగానే మీరు ఆత్మహత్య అని ఎలా చెప్పారు? అని భూమనను సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. నగదు చోరీకి సంబంధించిన కేసు రాజీ చేస్తుంటే టీటీడీ ఛైర్మన్‌గా ఏం చేస్తున్నారు? నిందితుడి ఆస్తులు టీటీడీకి రాయించుకోవాలని టేబుల్ అజెండాలో ఎవరు పెట్టారు? ఎస్టేట్ కమిటీలో సభ్యుడిగా అత్యవసర తీర్మానం చేసిందెవరు? రాజీ ప్రతిపాదన ఎవరు తెచ్చారు? వంటి ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. సతీశ్ కుమార్‌ది ముమ్మాటికి ఆత్మహత్యేనని, ప్రభుత్వ ఒత్తిడితోనే చనిపోయాడన్న వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని భూమన చెప్పినట్టు తెలిసింది. "చోరీ కేసులో రాజీకి ముందు, వెనుక ఏం జరిగిందో నాకేమీ తెలియదు. టేబుల్ అజెండాలో అందరూ పెట్టినట్టే నేను కూడా సంతకం పెట్టాను. ఈవోకు తెలియకుండా ఎలా జరుగుతుంది? నాకు సంబంధం లేని ప్రశ్నలు వేస్తే ఎలా?" అని భూమన ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే కేసులో టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్‌ను కూడా సీఐడీ బృందం మంగళవారం విచారించింది. ఎస్టేట్ కమిటీలో సభ్యుడిగా పరకామణి ఎపిసోడ్‌లో రాజీ ఎలా జరిగిందని ప్రశ్నించినట్టు తెలిసింది. మరో ఎస్టేట్ కమిటీ సభ్యుడు జీవన్ రెడ్డిని కూడా విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది.



క్యాంప్ కార్యాలయం వద్ద గుమిగూడిన జనాన్ని నియంత్రిస్తున్న పోలీసులు

మళ్లీ అధికారంలోకి వస్తాం

- మంచి రోజులొస్తాయ్.. అధైర్యపడొద్దు.. వైసీపీ కార్యకర్తలతో జగన్
- బెంగళూరు నుంచి పులివెందులకు రాక

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మంచి రోజులు వస్తాయని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం జగన్ బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో పులివెందులకు వచ్చారు. భాకరాపురంలోని హెలిప్యాడ్ నుంచి రోడ్డుమార్గాన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. 4 గంటల నుంచి 7.10 గంటల వరకు ప్రజాదర్బార్ చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలు, ప్రజలు ఆయనను కలిసేందుకు వచ్చారు. జగన్‌ను కలిసేందుకు క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకున్న కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కార్యాలయంలోకి ఒక్కోసారి కొందరికి మాత్రమే అనుమతి ఇస్తుండడంతో డోరు వద్ద తోపులాట జరిగింది. ఈ తోపులాటలో డోరు పక్కనే ఉన్న కిటికీ అద్దం పగిలింది. జగన్ గత పర్యటనలో కూడా తోపులాటలో కార్యాలయం కిటికీ అద్దాలు పగిలాయి. తాజా పర్యటనలో కిటికీ అద్దం పగిలిన విషయాన్ని గమనించిన సీఐ సీతారామిరెడ్డి ఇందుకు కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలుగజేసుకుని వీళ్లంతా తమ కార్యకర్తలే అని, వదిలేయాలని సూచించారు. అనంతరం డీఎస్పీ మురళీనాయక్ జగన్ క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. సీఐలు సీతారామిరెడ్డి, నరసింహులు, రమణలతో కలిసి డోరు వద్ద గుంపుగా ఉన్న వారందరినీ అక్కడి నుంచి బయటికి పంపించేశారు.

జగన్ మీడియాపై కేసు నమోదు

- అసత్య కథనాలపై పొన్నూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పొన్నూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అసత్య కథనాలు ప్రసారం చేసి పరువుకు భంగం కలిగించిన ఘటనలో బాధితుని ఫిర్యాదు మేరకు జగన్ మీడియాపై గుంటూరు జిల్లా పొన్నూరు అర్బన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ ఎల్ వీరానాయక్ కథనం ప్రకారం... 'పొన్నూరు పట్టణానికి చెందిన లింగేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు ఏలూరి చెన్నయ్య పోలీసులకు జగన్ పత్రికపై ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఆభరణాల చోరీ కేసులో చెన్నయ్య చోరికి పాల్పడినట్లు జగన్ మీడియాలో కథనాలు ప్రచురించారు. ప్రసారం చేశారు. అంతే కాకుండా ఒంగోలు పోలీసులు చెన్నయ్య గృహంలో తనిఖీలు నిర్వహించి వెండి నగదు స్వాధీనం చేసుకున్నట్లు నిరాధారమైన ఆరోపణలు చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. అంతే కాకుండా ఈ కథనంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై అత్యంత హేయమైన అభూత కల్పనలతో కూడిన వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జగన్ పత్రికలో ఉద్దేశపూర్వకంగా తనను, ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను ప్రజల దృష్టిలో చులకన చేసే విధంగా ప్రచారం చేశారని, జగన్ టీవిలో వచ్చిన ప్రసారాన్ని కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అర్బన్ పోలీసులు జగన్ మీడియా ప్రతినిధులు తలారి సురేంద్రనాథ్, వై అశోక్‌వర్ధన్, యాజమాన్యం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ వివరించారు.

పార్టీయే సుప్రీం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన జోనల్ కో-ఆర్డినేటర్లకు కీలక సూచనలు చేశారు. పార్టీ సభ్యత్వంతోపాటు అందిస్తున్న బీమా ప్రయోజనం విషయంలో కొందరు నేతలు నిర్లక్ష్యంగా ఉండటంపై లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పార్టీ సభ్యత్వం ఉన్న సుమారు 600 మంది మృతి చెందారని, వారిలో 75 మందికి రూ.5 లక్షల బీమా మొత్తాన్ని అందజేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇలాంటి విషయాలను సహించేది లేదని స్పష్టం చేశారు.

న్యాయం చేస్తాం.. నాదీ హామీ.....

"నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరగని వారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. వారందరికీ పార్టీ ఏదో ఒక విధంగా న్యాయం చేస్తుంది. ఈ విషయంలో నాదీ హామీ" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి కార్యకర్తకూ, నాయకుడికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి, నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కని వారి జాబితా తయారు చేయాలని జోనల్ కో-ఆర్డినేటర్లను ఆదేశించారు. డిసెంబరు 1 నుంచి పార్టీ శ్రేణులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు, పార్టీ జిల్లా కమిటీలను 10 రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు లేని 23 నియోజకవర్గాల్లో మండల కమిటీల నియామకాలు ఇంత వరకు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయాల నిర్మాణంపైనా దృష్టి సారించాలన్నారు. పార్టీ శ్రేణుల విషయంలో కొందరు మంత్రులు, అధికారుల వ్యవహారశైలి సరిగా లేదన్న ఫిర్యాదులపై లోకేశ్ స్పందిస్తూ.. పార్టీ శ్రేణులను గౌరవించే విషయంలో తేడా జరగకూడదని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం సిరివెళ్లలో రవిచంద్రారెడ్డి అనే టీడీపీ కార్యకర్తపై పోలీసులు అత్యంత అమానుషంగా ప్రవర్తించారని, ఊర్లోకి కూడా వెళ్లనివ్వకుండా అప్రకటిత ఆంక్షలు పెట్టారని.. సొంత అక్క చనిపోయినా ఊర్లోకి వెళ్లనివ్వలేదని, ఆయన భార్య క్యాన్సర్‌తో బాధపడుతున్నా కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని జోనల్ కో-ఆర్డినేటర్లు లోకేశ్ దృష్టికి తెచ్చారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని బీద రవిచంద్రను ఆయన ఆదేశించారు. డీఆర్సీ భేటీలకు ముందు ఇన్చార్జి మంత్రి జోనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ నేతలతో సమావేశమవ్వాలన్నారు. వైసీపీ హయాంలో టీడీపీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసులను డిసెంబరు 31కల్లా కొలిక్కి తీసుకురావాలని, ఈ బాధ్యత కో-ఆర్డినేటర్లు తీసుకోవాలని ఆదేశించారు. భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కో-ఆర్డినేటర్లు బీద రవిచంద్ర, వేపాడ చిరంజీవి, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జి.దీపక్ రెడ్డి, దామచర్ల సత్య, పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, సుజయ్‌కృష్ణ రంగారావు, రవి మందలపు, ఎం.సత్యనారాయణ రాజు, కోవెలమూడి నాని పాల్గొన్నారు.



టీడీపీ ప్రధాన కార్యాలయంలో అర్జీదారులకు లోకేశ్ అభివాదం

టీడీపీ కార్యాలయంలో లోకేశ్ ప్రజాదర్బార్

మంగళగిరి, అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి లోకేశ్ 75వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన్ను కలసి స్వయంగా సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. 'టీడీపీ సానుభూతిపరుడిననే అక్కసుతో గత వైసీపీ పాలనలో నాపై అక్రమ కేసులు బనాయించారు. కుటుంబాన్ని మానసిక క్షోభకు గురిచేశారు. విచారించి కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలి. ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి' అని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి మండలం కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 70 మంది కలిసి పొదుపు చేసిన రూ.7.55 కోట్ల నగదును సీఈవో దుర్వినియోగం చేశారని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రిటైర్డ్ పార్ట్‌టైం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.4 వేల పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని ఏపీ రిటైర్డ్ పార్ట్‌టైం వీఏవో, పీటీఏ, వీఆర్వోస్ ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 'నేను దివ్యాంగురాలిని. నా జీవనోపాధి నిమిత్తం ఓ ప్రైవేటు పాఠశాలలో టీచరుగా పనిచేస్తున్నా. దైనందిన జీవితం కోసం ట్రైస్కూటీ ఇచ్చి ఆదుకోండి' అని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ సుభాన్ బీ విజ్ఞప్తి చేశారు. జ్ఞప్తులను పరిశీలించిన లోకేశ్ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వ్యక్తిగత దాడులు రాజకీయాల్లో వాంఛనీయం కాదు

- విమర్శ కూడా గౌరవంగా ఉండాలి: లోకేశ్

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లో వ్యక్తిగత దాడులు ఎప్పుడూ వాంఛనీయం కాదు. విమర్శలు చేసే సమయంలోనూ గౌరవంగా వ్యవహరించాలి' అని టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. వైసీపీ అధినేత జగన్.. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న ప్లకార్డు పట్టుకుని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను అభ్యర్థిస్తున్నట్లు ఉన్న ఏఐ వీడియోను కొందరు పార్టీ సానుభూతిపరులు వైరల్ చేయడంపై లోకేశ్ స్పందించారు. 'ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజం. కానీ అవి వ్యక్తిగత దాడులుగా మారకూడదు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు గౌరవప్రదంగా ఉండాలి. సంబంధిత అంశాలకు మాత్రమే విమర్శ పరిమితం కావాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు... ద్వేషపూరిత, దిగజారుడు విమర్శల నుంచి నిర్మాణాత్మక విమర్శలు, అభివృద్ధి దిశగా పయనించాలి' అని లోకేశ్ ఆకాంక్షించారు.

సిట్ కస్టడీకి జోగి బ్రదర్స్

- నకిలీ మద్యం నిందితులకు రిమాండ్ పొడిగింపు



జోగి రమేశ్, ఆయన సోదరుడిని విజయవాడ కోర్టుకు తెచ్చిన పోలీసులు

విజయవాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రామును సిట్ కస్టడీలోకి తీసుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది. ప్రస్తుతం వారిద్దరూ నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఈ కేసులో విచారించేందుకు వారిని వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు కోరగా.. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు మంగళవారం తీర్పు ఇచ్చారు. కాగా, నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులకు న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుతోపాటు మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము, సయ్యద్ హాజి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మిథున్‌దాస్, అంతాదాస్‌లను మంగళవారం పోలీసులు విజయవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అద్దేపల్లి జగన్మోహనరావును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరిచారు. దీంతో వారికి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు.

ఐపీఎస్ అధికారి సంజయ్‌కు వైద్యపరీక్షలు

అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎం.సంజయ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బికిన కొండలరావుకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యంగా ఉందని చెప్పడంతో వారిని జైలు అధికారులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం తిరిగి జైలుకు తరలించారు.

కసిరెడ్డి బెయిల్ విచారణ 28కి వాయిదా

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. కసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ గత 7 నెలలుగా జైలులో ఉన్నారు. ఇతర నిందితులు ఇప్పటికే బెయిలుపై విడుదల అయ్యారు. కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవ రెడ్డి, మరో అధికారి సత్యప్రసాద్‌లను సీఐడీ కనీసం అరెస్టు కూడా చేయలేదు. కేవలం ఎంచుకున్న వ్యక్తులను మాత్రమే టార్గెట్ చేస్తున్నారు' అని పేర్కొన్నారు. తదుపరి విచారణను న్యాయస్థానం 28కి వాయిదా వేసింది.

వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్న విక్రాంత్‌రెడ్డి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి ఉపసంహరించుకున్నారు. కాకినాడ డీప్ వాటర్ పోర్టు, కాకినాడ సెజ్‌లోని కేవీఆర్ గ్రూప్‌కు చెందిన వాటాలు అరబిందోకు బదలాయింపు వ్యవహారంలో కేవీఆర్ గ్రూపునకు చెందిన కర్నాటి వెంకటేశ్వరరావు సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుమేరకు పోలీసులు విక్రాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు లేవని దిగువ కోర్టు విక్రాంత్‌రెడ్డిపై కేసును మూసివేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.